PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 45 సంచిక : 126 | విజయవాడ, సోమవారం 8 డిసెంబర్ 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Monday 8 December 2025 | Rs

నిర్బంధ సైనిక నియామకం వద్దు

- జర్మనీలో వెల్లువెత్తిన నిరసనలు
- ఆయుధాలు వద్దు.. విద్య కావాలంటూ నినాదాలు

7



సిమ్రన్‌జిత్ పసిడి గురి

- ఐశ్వరీ ప్రతాప్‌కు రజతం

8

గోవా నైట్‌క్లబ్‌లో ఘోరం



గోవా నైట్ క్లబ్‌లో మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

25 మంది మృతి.. ఆరుగురికి తీవ్రగాయాలు

- మేనేజర్ సహా పలువురి అరెస్ట్
- రాష్ట్రపతి, ప్రధాని దిగ్భ్రాంతి
- సమగ్ర దర్యాప్తునకు ప్రతిపక్షాల డిమాండ్

గోవా : బిజెపి పాలిత రాష్ట్రమైన గోవాలో ఘోరం జరిగింది. నైట్‌క్లబ్‌లో 25 మంది రెప్పపాటులో చెలరేగిన మంటల్లో సజీవ దహనమయ్యారు. మాంసం ముద్దల్లా మారిపోయారు. సంస్కృతి, సాంప్రదాయాలు పాటించడం లేదంటూ వాలంటైన్స్ డే రోజు కనిపించిన జంటలపై దాడులు, పెళ్లిళ్లు చేయడం సహా... ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల్లో నానా హంగామా చేసే మతతత్వ మూకలు బిజెపి పాలిత రాష్ట్రాల్లో మౌనంగా ఉంటాయి. అక్కడి పాలకులు కనీస భద్రతా చర్యలను, నిబంధనలను కూడా పట్టించుకోకుండా విచ్చలవిడి సంస్కృతికి వేదికలైన నైట్ క్లబ్‌లు లాంటి వాటికి అనుమతిస్తారని తాజా ఘటన స్పష్టం చేసింది.

ఏం జరిగిందంటే..?

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గోవా రాజధాని పానాజీకి 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న అర్పోరా గ్రామంలోని పర్యాటక కేంద్రం బగా బీచ్ సమీపంలో గల బిర్చ్ బై రోమియో లేన్ క్లబ్‌లో శనివారం అర్ధరాత్రి భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకున్నది. ఈ ప్రమాదంలో మరణించిన 25 మందిలో నలుగురు పర్యాటకులు, 14 మంది స్టాఫ్ మెంబర్స్‌గా గుర్తించారు. మిగతా ఏడుగురి వివరాలు తెలియాల్సి ఉంది. మరో ఆరుగురికి గాయాలయ్యాయి. వారికి ఆస్పత్రిలో చికిత్స అందుతున్నది. అగ్ని ప్రమాద ఘటనకు గల కారణం ఇంకా పూర్తి స్పష్టంగా తెలియలేదు. సిలిండర్ పేలుడు జరిగి ఉండొచ్చని పోలీసులు ప్రాథమికంగా చెప్తున్నారు. మొదటి అంతస్తులో డ్యాన్స్ ఫ్లోర్ వైపు నుంచి మంటలు మొదలయ్యాయని కొంతమంది ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. మృతుల కుటుంబీకుల ఆర్తనాదాలతో ఆస్పత్రుల్లోని మార్చురీల వద్ద విషాదం నెలకొంది. వీకెండ్‌కు వెళ్లి ప్రాణాలు కోల్పోయారంటూ కన్నీరుమున్నీరుగా విలపించారు.

చేతులు కాలాక..

ఈ ప్రమాదానికి సిలిండర్ పేలుడు కారణమై ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ ఘటనపై గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ మెజిస్టీరియల్ విచారణకు ఆదేశించారు. నైట్‌క్లబ్ యజమానులపై ఎఫ్‌ఐఆర్ నమోదైందని ఆయన తెలిపారు. వారిపై అరెస్ట్ వారెంట్ జారీ అయిందనీ, క్లబ్ మేనేజర్‌తోపాటు మరికొందరు ఇప్పటికే అరెస్ట్ అయ్యారని వివరించారు. క్లబ్‌కు సరైన ఫైర్ సేఫ్టీ అనుమతులు లేవని ప్రాథమిక విచారణలో తేలినట్లు చెప్పారు. నిబంధనలు ఉల్లంఘించిన క్లబ్ యాజమాన్యం మాత్రమే కాకుండా.. అనుమతులిచ్చిన అధికారులపై మిగతా 7లో

సరుకు రవాణా రంగంపై

ఫిట్‌నెస్ పిడుగు

వాహన యజమానులపై కేంద్రం భారీ మోత

- శ్లాబుల కుదింపుతో ఎనలేని భారం
- లారీ యజమానుల పోరుబాట
- 9న అర్ధరాత్రి నుంచి నిలిచిపోనున్న సరుకు రవాణా



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కేంద్ర ప్రభుత్వం అమాంతం పెంచిన ఫిట్‌నెస్ ఛార్జీలు, టెస్టింగ్, సర్టిఫికేషన్ ఫీజులతో రవాణా రంగం ఒక్కసారిగా కుదేలైంది. 20 ఏళ్లు దాటిన హెవీ వాహనాలకు రూ.1,340 ఉన్న ఫిట్‌నెస్ ఫీజును రూ.33,040లకు పెంచడంతో లారీ యజమానులకు వాహనాల ఫిట్‌నెస్ తలకు మించిన భారమైంది. అసలే కిరాయిలు లేక ఏదో ఒకరకంగా నెట్టుకొస్తున్న లారీ యజమానులకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయం 'మూలిగే నక్కపై తాటికాయ పడిన చందంగా' మారింది. కేంద్ర ప్రభుత్వం ఫిట్‌నెస్ ఛార్జీలను పెంచుతూ 11.11.2025న విడుదల చేసిన నోటిఫికేషన్ నవంబరు 22 నుంచి అమల్లోకి వచ్చింది. వాహన యజమానులు ఫిట్‌నెస్ చేయించుకోవడం ఆర్థిక భారం కావడంతో ఆయా వాహనాలను నిలిపేస్తున్నట్లు లారీ యజమానులు పేర్కొన్నారు. కేంద్రం నోటిఫికేషన్ యథాతథంగా అమలు చేయాల్సిన అవసరం రాష్ట్ర ప్రభుత్వానికి లేదు. ఈ అంశం రాష్ట్ర పరిధిలోనిది కావడంతో రాష్ట్ర ప్రభుత్వం టెస్టింగ్ ఫీజులను, సర్టిఫికెట్ ఫీజులను యధాతథంగా పాత విధానాన్ని అమలు చేయాలని లారీ యజమానుల సంఘం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. లారీ యజమానులు రవాణాను నిలిపివేస్తే ప్రభుత్వం రైతుల నుంచి సేకరిస్తున్న ధాన్యం తరలింపు కష్టమయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. అసలే రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని తరలించేందుకు సరిపడా లారీలు అందుబాటులో లేవు. ఈ నేపథ్యంలో పాత లారీలు రోడ్డెక్కకపోతే ధాన్యం మిల్లులకు చేర్చడం కూడా కష్టతరమయ్యే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. అలాగే నిత్యావసర వస్తువుల ధరలు మిగతా 7లో

ప్రవాసాంధ్రులకు అండగా ఉంటాం

- వచ్చే ఏడాది నుంచి 'కలలకు రెక్కలు'
- డల్లాస్ తెలుగు డయాస్పోరా సమావేశంలో మంత్రి లోకేష్

2



డల్లాస్‌లో తెలుగు డయాస్పోరా సమావేశంలో అభిమానులతో కరచాలనం చేస్తున్న లోకేష్

బిసి హాస్టళ్ల విద్యార్థులకు

స్టడీ మెటీరియల్ నిలిపివేత

- టెన్త్ ఉత్తీర్ణత శాతం తగ్గుతుందని ఆందోళన

ప్రజాశక్తి- కడప ప్రతినిధి

బిసి హాస్టళ్ల విద్యార్థులను రాష్ట్రంలోని టిడిపి కూటమి సర్కారు మోసగించింది. ఈ ఏడాది టెన్త్ స్టడీ మెటీరియల్ నిలిపివేసింది. రాష్ట్రంలోని 8,068 విద్యార్థులపై ఈ ప్రభావం తీవ్రంగా పడింది. టెన్త్‌లో ఉత్తీర్ణతా శాతం తగ్గిపోయే ప్రమాదం ఉందనే ఆందోళన వ్యక్తమవుతున్నా పట్టనట్టు వ్యవహరిస్తోంది. ప్రభుత్వం 2026 మార్చి 16 నుంచి పదో తరగతి పరీక్షలను నిర్వహించనున్నట్లు షెడ్యూల్‌ను విడుదల చేసిన సంగతి తెలిసిందే. బిసి సంక్షేమ శాఖ ఈ ఏడాది నవంబర్ ఒకటిన రాష్ట్రంలోని 26 జిల్లాల పరిధిలోని బిసి హాస్టల్ విద్యార్థులకు వంద రోజుల ప్రణాళికను రూపొందించింది. దీని అమలులో భాగంగా హాస్టల్ విద్యార్థులను మూడు గ్రేడ్లుగా విభజించింది. శ్రీకాకుళం జిల్లాలో 1,024 మంది, విజయనగరంలో 403, పార్వతీపురం మన్యంలో 95, విశాఖపట్నంలో 174, అనకాపల్లిలో 763, అల్లూరు సీతారామరాజు జిల్లాలో 42, కాకినాడలో 232, తూర్పుగోదావరిలో 88, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమలో 56, ఏలూరులో 197, పశ్చిమగోదావరిలో 99, కృష్ణా జిల్లాలో 171, ఎన్‌టిఆర్ జిల్లాలో 94, గుంటూరులో 150, బాపట్లలో 79, పల్నాడులో 362, ప్రకాశంలో 658, నెల్లూరులో 536, తిరుపతిలో 425, చిత్తూరులో 201, వైఎస్ఆర్ కడపలో 364, అన్నమయ్యలో 453, అనంతపురంలో 779, సత్యసాయిలో 632, కర్నూలులో 974, నంద్యాల జిల్లాలో 444 మంది విద్యార్థులను పదో పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధం చేస్తోంది. వీరిలో 2,784 మందిని 'ఎ' గ్రేడ్, 3,660 మందిని 'బి' గ్రేడ్, 1,624 మందిని 'సి' గ్రేడ్ కింద విభజించింది. హాస్టళ్లకు నెలవారీగా కీలక ప్రశ్నలు, జవాబులతో కూడిన స్టడీ మెటీరియల్‌ను ప్రభుత్వం నిలిపివేయడంతో ఆందోళన నెలకొంది. గతేడాది బిసి హాస్టళ్లలోని ఏడో తరగతి విద్యార్థులకు మనబడి, పదో తరగతి విద్యార్థులకు పాఠశాల పేరుతో మెటీరియల్‌ను మంజూరు చేసింది. ఈ ఏడాది నిలిపేసింది.

గత విద్యా సంవత్సరంలో రాష్ట్రంలోని బిసి హాస్టళ్లు 77.22 ఉత్తీర్ణతా శాతం సాధించాయి. కడప జిల్లాలో ఈ శాతం 82.85గా ఉంది. ఈ ఏడాది మెటీరియల్ సరఫరా కాకపోవడంతో ఫలితాలపై గణనీయంగా పడిపోయే ప్రమాదం ఉన్నాయనే ఆందోళన వ్యక్తమవుతోంది. 'సి' కేటగిరి పరిధిలోని హాస్టళ్లపై ఈ ప్రభావం మరింత ఎక్కువగా పడే అవకాశం ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బిసి హాస్టళ్ల టెన్త్ విద్యార్థులకు మెటీరియల్ సరఫరా చేయాలని బిసి హాస్టళ్ల వార్డెన్లు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

బలవంతపు భూ సేకరణకు వ్యతిరేకంగా

'మా ఊరు-మా భూమి-మా హక్కు'

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో బలవంతపు భూ సేకరణకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న 'మా ఊరు - మా భూమి - మా హక్కు' కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం సూర్యనారాయణ, సీనియర్ నాయకులు వై కేశవరావు, కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం హరిబాబు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి సుబ్బరావు, వి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు వి రాణి ఆవిష్కరించారు. విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, కౌలు రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల సంయుక్త ఆధ్వర్యాన ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. పేదల నుంచి లక్షలాది ఎకరాలను అభివృద్ధి అనే పేరుతో తీసుకుంటుందన్నారని తెలిపారు. 2013 భూ సేకరణ చట్టాన్ని తుంగలో తొక్కి అడ్డగోలుగా రైతులు, పేదల నుంచి ప్రభుత్వం భూములు లాక్కుంటుందన్నారు. విజయనగరం జిల్లా గుర్లలో ఊరూపేరు లేని పరిశ్రమకు 1,092 ఎకరాలు కట్టబెడుతుందన్నారు. కుప్పం ఎయిర్ పోర్టు, బల్క్ డ్రగ్స్, రాజధాని, జిందాల్ వంటి అనేక పరిశ్రమల పేరుతో పేదలు, సన్న, చిన్నకారు రైతులకు చెందిన 5.10 లక్షల ఎకరాల భూమిని కూటమి ప్రభుత్వం తీసుకుందన్నారు. ఉద్యోగాలను ఆశ చూపి భూములను తీసుకుని కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేస్తే, ఆయా సంస్థలు ఆ భూముల్లో పరిశ్రమలు పెట్టకుండా బ్యాంకుల్లో తనఖా పెట్టి రూ.వేలకోట్లు రుణాలు తెచ్చుకుని భూములను బీళ్లుగా మారుస్తున్నాయని తెలిపారు. ఈ దుర్మార్గానికి వ్యతిరేకంగా 'మా ఊరు - మా భూమి - మా హక్కు' కార్యక్రమం చేపట్టామన్నారు. రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలన్నారు. రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం సూర్యనారాయణ మాట్లాడుతూ.. రాష్ట్రంలో రైతుల నుంచి బలవంతంగా, చట్ట వ్యతిరేకంగా భూములు లాక్కుని కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తున్నాయని తెలిపారు. దీనివల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. గత పదేళ్లలో తీసుకున్న భూముల్లో 10 శాతంలో కూడా పరిశ్రమలు ఏర్పాటు చేయలేదన్నారు. మరోవైపు వ్యవసాయం జరగడం లేదన్నారు. లేపాక్షి, కాకినాడ సెజ్, ఇతర అన్ని సెజ్‌లలో ఇదే మిగతా 7లో



విజయవాడలో 'మా ఊరు - మా భూమి మా హక్కు'పోస్టర్‌ను విడుదల చేస్తున్న వివిధ సంఘాల నాయకులు



పిఎబిఆర్ కుడికాలువకు గండిపడడంతో దిగువకు ప్రవహిస్తున్న నీరు

హెచ్‌ఎల్‌సికి రెండు చోట్ల గండి

- వృథాగా తుంగభద్ర నీరు

2

పల్లెల్లో ఉపాధి హుష్!

- పెరిగిన నూర్పిడి యంత్రాలు
- కోత కట్టేత, నూర్పిడిల్లో తగ్గిపోయిన పనిదినాలు

గుత్తాధిపత్యం వల్లే సంక్షోభం

- కేంద్రం ఆదేశాలు బుట్టదాఖలు
- మరో 650 సర్వీసులు రద్దు
- 10 వరకూ ఇదే పరిస్థితి



న్యూఢిల్లీ : దేశీయ విమానయాన రంగంలో ఇండిగో సంక్షోభం ఆదివారం కూడా కొనసాగింది. విమానయాన రంగంలో ఇండిగో గుత్తాధిపత్యం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విమానయాన రంగంలో 63 శాతం వాటాతో ఇండిగో సంస్థ గుత్తాధిపత్యం సాధించడానికి ఎలక్టోరల్ బాండ్లను అత్యధికంగా కొనుగోలు చేయడమే కారణమని విశ్లేషకులు వాఖ్యానిస్తున్నారు. ఆ తరువాత ప్రభుత్వ రంగంలోని ఎయిర్ ఇండియాను కొనుగోలు చేసిన టాటా ఎయిర్ ఇండియా 13.6 శాతం వాటా కలిగి వుంది. కోవిడ్-19 మహమ్మారి తర్వాత సంవత్సరాల్లో ఇండిగో గుత్తాధిపత్యానికి ఎందుకు అనుమతించారని ప్రతిపక్షాలు ప్రశ్నిస్తున్నాయి. లోక్‌సభ ఎన్నికలకు ఒక సంవత్సరం ముందు, 2023లో ఎలక్టోరల్ బాండ్లను పెద్ద సంఖ్యలో కొనుగోలు చేయడంపై ప్రతిపక్ష పార్టీలు తీవ్ర ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. 2024లో భారత ఎన్నికల కమిషన్ వెల్లడించిన వివరాల ప్రకారం, ఇండిగోలో భాగంగా వున్న ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, ఇంటర్‌గ్లోబ్ ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్, ఇంటర్‌గ్లోబ్ రియల్ ఎస్టేట్ వెంచర్స్ మొత్తం 36 బాండ్లను కొనుగోలు చేశాయి. వాటిలో 31 బాండ్లు రూ.1 కోటి విలువైనవి. వాటిలో 31 బాండ్లు మే 2019లో కొనుగోలు చేశారు. మిగిలినవి అక్టోబర్ 2023లో కొనుగోలు చేశారు. అదనంగా, ఇంటర్‌గ్లోబ్ ప్రమోటర్ రాహుల్ భాటియా రూ.1 కోటి విలువైన 29 బాండ్ల సెట్‌ను కొనుగోలు చేశారు. ఏప్రిల్ 2021లో ఆయన వ్యక్తిగతంగా రూ.20 కోట్ల బాండ్లను కొనుగోలు చేశారు. భాటియా బాండ్లన్నీ కోవిడ్ -19 మహమ్మారి విమానయాన రంగం తీవ్రంగా దెబ్బతిన్నప్పుడు కొనుగోలు చేసినవే. ఎన్నికల బాండ్లను కొనుగోలు చేసిన మరో విమానయాన సంస్థ స్పైస్‌జెట్, ఇది 2021 జనవరి, జూలై మధ్య రూ.65 లక్షల విలువైన 20 బాండ్లను కొనుగోలు చేసింది. అత్యధికంగా ఎన్నికల బాండ్లను కొనుగోలు చేసి, బిజెపికి లబ్ధి చేకూర్చినందునే ఇండిగో గుత్తాధిపత్యానికి కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అనుమతించిందని కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలు విమర్శించాయి. ఇండిగో పట్ల ద్వంద్వ విధానాలను అనుసరించడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నాయి.

జెపిసి లేదా జ్యుడీషియల్ కమిషన్‌తో విచారణ జరిపించాలి : సిపిఎం

విమానాల రద్దు, ప్రయాణికుల ఇబ్బందులపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ లేదా జ్యుడిషియల్ విచారణ జరిపించాలని సిపిఎం రాజ్యసభ్యులు ఎంపి జాన్ బ్రిట్టాస్ ఇప్పటికే డిమాండ్ చేశారు. అప్పుడే పౌర విమానయాన సేవల్లో అంతరాయం, ఛార్జీల పేరిట దోపిడీ వెనుక దాగి ఉన్న కుట్రను ఛేదించడం సాధ్యమవుతుందని ఆయన అన్నారు.

విమానయాన సంస్థల అధికారులు, డిజిసిఎకు పార్లమెంటరీ ప్యానెల్ నోటీసులు?

ఇండిగో సంక్షోభం నేపథ్యంలో దేశంలోని ప్రైవేట్ విమానయాన సంస్థల ఉన్నతాధికారులు, పౌరవిమానయాన నియంత్రణ సంస్థ (డిజిసిఎ)కు పార్లమెంటరీ ప్యానెల్ నోటీసులు మిగతా 7లో

నేడు తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ప్రారంభం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ సోమవారం ప్రారంభంకానుంది. పెట్టుబడుల ఆకర్షణ, ఉపాధి సృష్టి లక్ష్యంగా నిర్వహిస్తున్న ఈ సమ్మిట్‌కు రంగారెడ్డి జిల్లా కందుకూరు సమీపంలోని భారత్ ఫ్యూచర్ సిటీలో ఏర్పాట్లను పూర్తిచేసింది. రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో 44కుపైగా దేశాల నుంచి 154 మంది అంతర్జాతీయ ప్రతినిధులు హాజరుకానున్నారు. సోమవారం మధ్యాహ్నం 1:30 గంటలకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ లాంఛనంగా ప్రారంభించనున్నారు. నోబెల్ బహుమతి గ్రహీత అభిజిత్ బెనర్జీ, ట్రంప్ మీడియా-టెక్నాలజీ గ్రూప్ సిఇఒ ఎరిక్ స్వైడర్, వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ సిఇఒ జెరెమీ జుర్గెన్స్, నోబెల్ శాంతి బహుమతి గ్రహీత కైలాష్ సత్యార్థి, బయోకాన్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ చైర్‌పర్సన్ కిరణ్ మజుందార్-షా, తదితరులు ప్రసంగించనున్నారు. మధ్యాహ్నం రెండున్నర గంటలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడనున్నారు. తెలంగాణలో ప్రజాపాలన, పెట్టుబడుల అవకాశాలు, ప్రభుత్వ సహకారంపై ముఖ్యమంత్రి అతిథులకు వివరిస్తారు.

తిరుపతి జాతీయ సంస్కృత యూనివర్సిటీలో

కీచక పర్వం

- విద్యార్థినిపై అసిస్టెంట్ ప్రొఫెసర్ లైంగిక వేధింపులు
- మరో ప్రొఫెసర్ ఫొటోలు తీసి బెదిరింపు
- ఆలస్యంగా స్పందించిన 'వర్సిటీ' ఉన్నతాధికారులు
- చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ, ఐద్వా నిరసన



అసిస్టెంట్ ప్రొఫెసర్ లక్ష్మణ్ కుమార్

ప్రజాశక్తి- క్యాంపస్ (తిరుపతి)

తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్న లక్ష్మణ్ కుమార్ అదే యూనివర్సిటీలో చదువుతున్న ఒడిశా రాష్ట్రానికి చెందిన ఒక విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. ఆయనపైనా, మరో అసిస్టెంట్ ప్రొఫెసర్‌పైనా బాధితురాలు ఫిర్యాదు చేసినా యూనివర్సిటీ అధికారులు, పోలీసులు అప్పట్లో పట్టించుకోలేదు. దీంతో, ఆ విద్యార్థిని టిసి తీసుకొని వెళ్లిపోయారు. ఈ విషయం సోషల్ మీడియా ద్వారా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తోటి విద్యార్థినుల కథనం ప్రకారం... తిరుపతి ఎన్ఎస్‌యులో బిఇడి మొదటి సంవత్సరం చదువుతున్న ఒడిశాకు చెందిన విద్యార్థినిని ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్‌లో పని చేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ లక్ష్మణ్ కుమార్ లైంగిక వేధించేవాడు. అదే విభాగానికి చెందిన మరో అసిస్టెంట్ ప్రొఫెసర్ శేఖర్‌రెడ్డి ఈ సందర్భంగా వీడియో తీసి ఆ విద్యార్థినిని బెదిరిస్తూ ఉండేవాడు. లైంగిక వేధింపులు, బెదిరింపులపై బాధితురాలు గత నెల 24, 25 తేదీల్లో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌కు, పోలీసులకు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోలేదు. దీంతో, ఆ విద్యార్థిని మనస్తాపానికి గురై టిసి తీసుకొని ఒడిశాకు వెళ్లిపోయారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న అసిస్టెంట్ ప్రొఫెసర్లు లక్ష్మణ్ కుమార్ మహారాష్ట్రకు, శేఖర్ రెడ్డి మన మిగతా 7లో

పల్లెల్లో ఉపాధి హుష్!

- పెరిగిన నూర్పిడి యంత్రాలు
- కోత కట్టేత, నూర్పిడిల్లో తగ్గిపోయిన పనిదినాలు

ప్రజాశక్తి- కృష్ణా ప్రతినిధి

ఆధునిక యంత్రాలు పల్లెల్లో ఉపాధిని దెబ్బతీస్తున్నాయి. యంత్రాల వినియోగం పెరిగిపోవడంతో ఈ సీజన్లో సాధారణ పద్ధతుల్లో వరి కోత నూర్పిడిలకు డిమాండ్ తగ్గింది. గతేడాదితో పోలిస్తే వ్యవసాయ కార్మికులకు కోత, కట్టేత పనులకు సంబంధించి రెండున్నర వేల రూపాయల మేర ఆదాయం తగ్గిపోయింది. మరోపక్క పని దినాలు కూడా తగ్గాయని వారు వాపోతున్నారు. కృష్ణా జిల్లా ఘంటసాల మండలం కొత్తపల్లి పంచాయతీలో 920 ఎకరాల్లో వరి సాగవుతోంది. గత ఏడాది 170 ఎకరాలు యంత్రాలతో నూర్పిడి చేశారు. 750 ఎకరాలు సాధారణ పద్ధతుల్లో కోత కోశారు. నవంబర్ 20 నుంచి డిసెంబర్ 25 తేదీ వరకు గ్రామంలోని 140 మంది వ్యవసాయ కార్మికులు 35 రోజులు పనులు దొరికాయి. పక్క గ్రామాలకు చెందిన కొందరు వ్యవసాయ కార్మికులు కూడా ఈ గ్రామంలో కోత, కట్టేత పనులు చేశారు. ప్రస్తుత ఏడాది సీజన్లో ఈ గ్రామానికి ఆరు యంత్రాలను ఈ పనుల నిమిత్తం తీసుకొచ్చారు. సాధారణ పద్ధతుల్లో కోతలకు వాతావరణం అనుకూలించపోవడంతో యంత్రాలతోనే ఎక్కువగా వరి నూర్పిడి చేశారు. దీంతో, నవంబర్ రెండు నుంచి డిసెంబర్ నాల్గో తేదీ మధ్యకాలంలో సగటున పది రోజులు మాత్రమే



వ్యవసాయ కార్మికులకు పనులు దొరికాయి. మరో తొమ్మిది రోజుల్లో ఈ గ్రామంలో కోతలు పూర్తవుతాయి. ప్రస్తుత సీజన్లో మొత్తం 19 రోజులు మాత్రమే వ్యవసాయ కార్మికులకు పనులు దొరుకుతున్నాయి. గతేడాదితో పోలిస్తే కోత, కట్టేతల్లో ఒక్కొక్కరు 16 రోజుల పనిదినాలు కోల్పోతున్నారు. యంత్రాలను ఉపయోగించిన పొలాల్లో కుప్ప నూర్పిడి పనులు ఉండవు. దీంతో, కుప్పనూర్పిడి పనిదినాలు మరో తొమ్మిది రోజులు తగ్గిపోతాయని వ్యవసాయ కార్మికులు చెబుతున్నారు. మొత్తంగా పరిశీలిస్తే ఒక్కో కార్మికుడికి 25 రోజుల పనిదినాలు తగ్గిపోతున్నాయి. సగటున ఒక్కొక్కరు రోజుకు రూ.750 చొప్పున మొత్తం 25 రోజులకు రూ.18,750 కోల్పోతున్నారు. ప్రస్తుత సీజన్లో కృష్ణా జిల్లాలో 3.87 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. 60 శాతానికిపైగా విస్తీర్ణంలో వరి నూర్పిడికి యంత్రాలనే ఉపయోగిస్తుండడంతో పనిదినాలు తగ్గి ఆదాయాన్ని కోల్పోతున్నామని వ్యవసాయ కార్మికులు వాపోతున్నారు.

వ్యవసాయ పనుల కూలిలోనూ కోత

వరిలో మగతా పనులు ఎక్కువ. ఎకరాలు లెక్కన చేసిన పనులకు నగదు చెల్లిస్తారు. ఈ ఏడాది అధిక సంఖ్యలో యంత్రాలు ప్రవేశించడంతో సాధారణ పద్ధతుల్లో కోత, పన తిరగేయడం, కట్టేత పనులకు డిమాండ్ తగ్గింది. గత సీజన్లో ఎకరా కోతకు సగటున రూ.7 వేలు, పనలు తిరగేయడానికి రూ.1000, కట్టేతకు రూ.6 వేల చొప్పున వచ్చేది. ప్రస్తుత సీజన్లో కోతకు రూ.6 వేలు, పనలు తిరగేయడానికి రూ.1000, కట్టేతకు రూ.5 వేలు మాత్రమే వస్తోంది. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది ఎకరా ఒక్కంటికీ కార్మికులకు రూ.2,200 వరకూ ఆదాయం వరకు తగ్గిపోయింది.

వ్యవసాయ పనులు తగ్గిపోయాయి

వాతావరణంలో మార్పులతో రైతులు ఎక్కువగా యంత్రాలతో కోతలు కోయించారు. మా గ్రామంలో ఇప్పటి వరకు 12 రోజులు మాత్రమే పని దొరికింది. మరో తొమ్మిది రోజుల్లో కోత, కట్టేతలు పూర్తవుతాయి. మొత్తంగా 20 నుండి 22 రోజుల వరకు మాత్రమే పని దొరుకుతుంది. ఈ సీజన్లో కోత, పన తిరగేయడం, కట్టేత పనులకు కూలి తగ్గించారు. మగతా పనుల్లో క్షణం తీరిక ఉండదు. చేసిన పనికే కూలి దక్కుతుంది. ఇటువంటి పరిస్థితుల్లో రెక్కలు ముక్కలు చేసుకున్నా రోజుకు రూ.500 నుంచి రూ.600 వరకు తెచ్చుకోవడం కష్టంగా మారింది.

–పడమట నాగార్జున, వ్యవసాయ కార్మికుడు, కొత్తపల్లి

ప్రవాసాంధ్రులకు అండగా ఉంటాం

- వచ్చే ఏడాది నుంచి 'కలలకు రెక్కలు'
- డల్లాస్ తెలుగు డయాస్పోరా సమావేశంలో మంత్రి లోకేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



కష్టకాలంలో తమ కుటుంబానికి, తెలుగుదేశం పార్టీకి వెన్నుదన్నుగా నిలిచిన ప్రవాసాంధ్రులకు రుణపడి ఉంటామని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అన్నారు. ఏ కష్టమొచ్చినా.. ప్రవాసాంధ్రులకు అండగా ఉంటామని తెలిపారు. అమెరికా పర్యటనలో భాగంగా ఆదివారం డల్లాస్‌లోని కర్టిస్‌కల్‌వెల్ సెంటర్‌లో నిర్వహించిన తెలుగు డయాస్పోరా సమావేశంలో లోకేష్ ప్రసంగించారు. డల్లాస్‌లో ఇంత పెద్ద సంఖ్యలో తెలుగువాళ్లను చూస్తుంటే 'అమరావతి'లో ఉన్నట్టే ఉందని ఆయన అన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వ హాయంలో రాష్ట్రం అన్ని రంగాల్లోనూ అభివృద్ధి పథంలో పయణిస్తోందని, వేగానికి ప్రతీకగా నిలుస్తోందని ఆయన చెప్పరు. 'కలలకు రెక్కలు' పేరుతో వచ్చే ఏడాది నుంచి విదేశాల్లో చదువుకునే వారికి అండగా నిలవాలని నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. తెలుగువారు.. విదేశాల్లో ఏ మూలన ఉన్నా..ఎంత కష్టమొచ్చినా ఎపి ఎన్ఆర్‌టి అండగా ఉంటుందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రతిపక్షనేతగా ఉన్నప్పుడు గత వైసిపి ప్రభుత్వం అరెస్టు చేసిన సమయంలో ప్రవాసాంధ్రులు పెద్దయెత్తున బయటకు వచ్చి అండగా నిలిచారని ఆయన గుర్తు చేసుకున్నారు. ఎన్ఆర్ఐల మద్దతుతో టిడిపి కూటమి సూపర్ హిట్ అయ్యిందన్నారు. ఒకే రాష్ట్రం–ఒకే రాజధాని, అభివృద్ధి వికేంద్రీకరణ తమ నినాదమని చెప్పారు. రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, ఇందుకు ప్రవాసాంధ్రులు సహకరించాలని కోరారు. 17 నెలల్లో రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని, తద్వారా 16 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించేలా ఒప్పందాలు కుదుర్చుకున్నామని ఆయన చెప్పారు. టిడిపి కూటమిలో విడాకులు, మిస్‌ఫైర్, క్రాస్‌ఫైర్లు ఉండబోమని, మరో పదేళ్ల రాష్ట్రాన్ని కూటమి ప్రభుత్వమే ముందుకు తీసుకెళ్తుందని చెప్పారు. 'రెడ్‌బుక్' తన పని తాను చేసుకుపోతుందని, చట్టాన్ని ఉల్లంఘించిన వారిని వదిలిపెట్టేది లేదని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రవాసాంధ్ర వ్యవహారాల సలహాదారు, ఎపి ఎన్ఆర్‌టి సొసైటీ అధ్యక్షులు వేమూరు రవికుమార్, ఎన్ఆర్ఐ టిడిపి యుఎస్ఎ కో–ఆర్డినేటర్ కోమటి జయరామ్ తదితరులు పాల్గొన్నారు.

'మీ కులం వేరు.. మా కులం వేరు..'

- ప్రియుడి వంచనతో యువతి ఆత్మహత్య

ప్రజాశక్తి–ఒంగోలు సిటీ

ప్రియుడు కులం పేరు చెప్పి.. తనతో పెళ్లి నిరాకరించడాన్ని భరించలేక ఓ యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఒంగోలు నగరంలోని కబాడిపాలెంలో ఆదివారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. కబాడీపాలెంకు చెందిన మైరాల నళిని (26) ఎంటెక్ చదువు పూర్తి చేసి.. ఉద్యోగ ప్రయత్నాలు చేస్తున్నారు. ఆమెకు ఒంగోలు మహేంద్ర నగర్‌కి చెందిన శింగోతు శ్రీనివాసరావుతో పదేళ్ల క్రితం ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైంది. ఇటీవల శ్రీనివాసరావుని కలిసి తన చదువు పూర్తయ్యిందని, పెళ్లి చేసుకుందామని అడిగారు. 'నీ కులం వేరు.. నా కులం వేరు, మన పెళ్లికి మా ఇంట్లో వాళ్లు అంగీకరించరు' అని శ్రీనివాసరావు పెళ్లికి నిరాకరించారు. దీంతో మనస్తాపానికి గురైన ఆమె ఆదివారం ఉదయం తన తండ్రి టిఫిన్ తీసుకుని రావడానికి బయటకు వెళ్లిన సమయంలో ఇంటిలో చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. తిరిగి వచ్చిన తండ్రి గమనించి.. ఇరుగు పొరుగు వారి సాయంతో తలుపులు బద్దలు కొట్టారు. లోపల నళిని ఉరి వేసుకొని కనిపించారు. కిందకు దించి చూడగా అప్పటికే ఆమె మృతి చెందారు. మంచంపై ఆమె రాసిన సూసైడ్ నోట్ లభించింది. ఘటనపై ఒంగోలు ఒకటో పట్టణ ఇన్‌స్పెక్టర్ వై.నాగరాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు. నళిని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిజిహెచ్‌కి తరలించారు.

కోటి సంతకాల సేకరణలో స్వల్ప మార్పులు

- వైసిపి సమన్వయకర్త సజ్జల

ప్రజాశక్తి–అమరావతి బ్యూరో

వైద్య కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైసిపి నిర్వహిస్తున్న కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో స్వల్ప మార్పులు చేసినట్లు ఆ పార్టీ రాష్ట్ర సమన్వయకర్త సజ్జల రామకృష్ణారెడ్డి తెలిపారు. పార్టీ ముఖ్య నాయకులు, స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులతో ఆదివారం ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వైసిపి అధినేత వైఎస్ జగన్.. గవర్నరును కలిసే కార్యక్రమం ఈ నెల 16 నుంచి 17వ తేదీకి మారినందున, జిల్లా స్థాయి కార్యక్రమం 13కు బదులు 15వ తేదీన నిర్వహించాలని సూచించారు. నియోజకవర్గ స్థాయిలో కార్యక్రమం మాత్రం 10న యథావిధిగా జరుగుతుందన్నారు. కోటి సంతకాలు, రచ్చబండ కార్యక్రమానికి అనూహ్య స్పందన వచ్చిందని తెలిపారు. పార్టీ కేంద్ర కార్యాలయ ఇన్‌ఛార్జి లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ.. స్వల్ప మార్పులను పార్టీ నాయకులంతా గమనించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.



విశాఖ ఉక్కులో మరో అగ్నిప్రమాదం

ప్రజాశక్తి – ఉక్కునగరం (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌లో వరుస అగ్ని ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఆదివారం వేకువజామున ప్లాంట్‌లోని బ్యాటరీ – 3 ప్రాంతంలో ఒక్కసారిగా మంటలు చెలరేగి, ఛార్జింగ్ కారు పూర్తిగా దగ్ధమైంది. ప్లాంట్ అధికారుల కథనం మేరకు.. ఛార్జింగ్ కారు – 7 టెలిస్కోప్ ఛార్జింగ్ పూర్తయినప్పటికీ లిఫ్ట్ సరిగ్గా పని చేయకపోవడంతో లోపం తలెత్తింది. దీంతో ఓవెన్‌లోనుంచి ఒక్కసారిగా మంటలు ఎగిసిపడ్డాయి. ఛార్జింగ్ కారుకు అంటుకోవడంతో వాహనం పూర్తిగా కాలిపోయింది. ప్రమాద విషయం తెలిసిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను అదుపుచేశారు. కొద్దిరోజులుగా ప్లాంట్‌లో అగ్ని ప్రమాదాలు పెరుగుతుండటంతో కార్మికులు ఆందోళనకు గురవుతున్నారు. అక్టోబర్‌లో ప్లాంట్‌లోని కోకో ఓవెన్ బ్యాటరీ–5 దగ్గర భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. లాడిల్ నుంచి ఉక్కు ద్రావకాన్ని తరలించే సమయంలో మంటలు చెలరేగాయి. ప్రమాదాల నివారణకు ప్లాంట్ యాజమాన్యం చర్యలు చేపట్టాలని, భద్రతా ప్రమాణాలకు ప్రాధాన్యతనివ్వాలని కార్మిక సంఘాలు, కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.

'ఉపాధి' ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి : జెఎసి

ప్రజాశక్తి–అమరావతి బ్యూరో

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని జాయింట్ యాక్షన్ కమిటీ కోరింది. ప్రధానంగా ఉద్యోగ భద్రతతోపాటు వేతనాల పెంపు తదితర సమస్యలను పరిష్కరించాలని జెఎసి రాష్ట్ర నాయకులు ఎస్ రెడ్డప్ప, యు తిరుమలేష్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. దశాబ్దాలుగా ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్నా ఉద్యోగోన్నతులు లేవని పేర్కొన్నారు. ఉద్యోగుల సమస్యలపై పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్, ఇతర అధికారులకు ఇప్పటికే పలుమార్లు వినతిపత్రాలు సమర్పించినట్లు చెప్పారు.

ఈ నెల 6న టిడిపి కేంద్ర కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు వినతిపత్రాన్ని అందజేసి, సమస్యలను వివరించినట్లు తెలిపారు. ఇప్పటికైనా ఉపాధి పథకంలో వివిధ విభాగాల ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని జెఎసి నాయకులు కోరారు.

నెల్లూరులో రెచ్చిపోయిన రౌడీమూక

- బస్సు డ్రైవర్, క్లీనర్‌పై దాడి

ప్రజాశక్తి – నెల్లూరు

సిపిఎం నాయకులు పెంచలయ్య దారుణ హత్యను మరువక ముందే నెల్లూరులో రౌడీ మూకలు రెచ్చిపోయారు. ఓ ప్రయివేటు బస్సు డ్రైవర్, క్లీనర్‌పై కత్తులతో దాడి చేశారు. ఈ సంఘటనతో నగరం ఒక్కసారిగా ఉలిక్కి పడింది. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని గాంధీనగర్‌కు చెందిన మన్సూర్, ఇందుకూరుపేట మండలం గంగపట్నం గ్రామానికి చెందిన సలాం ఇద్దరూ నగరంలోని ఓ ప్రయివేటు సిటీ బస్సులో విధులు నిర్వహిస్తున్నారు. విధి నిర్వహణలో భాగంగా ఆదివారం సాయంత్రం వారు నెల్లూరు ఆర్‌టిసి సెంటర్ నుంచి అలీపురానికి బయలుదేరారు. ఈ క్రమంలో బోసుబొమ్మ సమీపంలోని బాబు ఐస్‌క్రీమ్ సెంటర్ వద్ద బస్సును ఓవర్ టేక్ చేసేందుకు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ముగ్గురు యువకులు ప్రయత్నించారు. ట్రాఫిక్ కారణంగా డ్రైవర్ సైడ్ ఇవ్వలేదు. తర్వాత ద్విచక్రవాహనం అడ్డుపెట్టి బస్సును నిలిపివేశారు. ద్విచక్రవాహనదారులకు మరో ముగ్గురు జతయ్యారు. ఐదుగురు కలిసి బస్సులోకి వెళ్లారు. సైడ్ ఎందుకు ఇవ్వలేదంటూ క్లీనర్ సలాంతో ఘర్షణకు దిగి కత్తులతో దాడికి తెగపడ్డారు. అడ్డుకొనే ప్రయత్నంలో డ్రైవర్ మన్సూర్‌పై దాడికి పాల్పడ్డారు. తీవ్రంగా గాయపడిన కండక్టర్, డ్రైవర్‌ను జిజిహెచ్‌కు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సలాం

50 ఏళ్లు దాటిన వారిని కొనసాగించాలి

- మెడికల్ అండ్ హెల్త్‌లో తొలగింపు విధానం ఆపాలి
- సిఐటియు డిమాండ్

ప్రజాశక్తి–అమరావతి బ్యూరో

వైద్యారోగ్యశాఖలో 50 ఏళ్లు పైబడిన కాంట్రాక్టు కార్మికులను, డిగ్రీ లేదని సూపర్‌వైజర్లను తొలగించొద్దని సిఐటియు రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎవి నాగేశ్వరరావు, సిహెచ్ నర్సింగరావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాజ్యాంగబద్ధమైన ఈ నిబంధనను ముఖ్యకార్యదర్శి హోదాలో సీనియర్ ఐఎఎస్ అధికారులు టెండర్లలోని షరతుల్లో పేర్కొనడం, దీనిపై మెడికల్ విద్య డైరెక్టర్ ఆదేశాలు ఇవ్వడం దారుణమని పేర్కొన్నారు. శాశ్వత ఉద్యోగుల ఉద్యోగ విరమణ వయసు 62 ఏళ్లకు ప్రభుత్వం పెంచిందని, దీనికి పూర్తి విరుద్ధంగా దశాబ్దాల తరబడి పనిచేస్తున్న కార్మికులను 50 ఏళ్లకే తొలగించడం అమానుషమని తెలిపారు. రాష్ట్రంలో 9 జిల్లాల్లో కార్మికులను పద్మావతి హాస్పిటాలిటీ, ఫెసిలిటీ మేనేజ్‌మెంట్ సర్వీస్ అధినేత తొలగించేందుకు పూనుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ స్థానంలో సూపర్‌వైజర్ పోస్టుకు రూ.3 లక్షలు, వర్కర్‌కు రూ.1 లక్ష వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి తన చిన్ననాటి స్నేహితుడని, తాము చెప్పిందే పాటించాలని కాంట్రాక్టరు జిల్లా అధికారులపై ఒత్తిడి చేస్తున్నారని వివరించారు. కలెక్టర్లు, కార్మికశాఖ అధికారులు చర్యలు తీసుకోకుండా చోద్యం చూస్తున్నారని పేర్కొన్నారు. తొలగించిన వారిని తిరిగి ఉద్యోగాల్లోకి తీసుకునేంత వరకు అన్ని జిల్లాల్లో ధర్నాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని తొలగింపులు ఆపాలని, లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా పెద్దయెత్తున ఆందోళనలు, న్యాయపరమైన పోరాటాలు చేపడతామని హెచ్చరించారు. కార్మికుల తొలగింపు విధానాన్ని ఎపి మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్, ఎపి మెడికల్ అండ్ హెల్త్ కాంట్రాక్టు ఎంప్లాయిస్ యూనియన్లు కూడా ఖండిస్తూ వేర్వేరు ప్రకటనలు విడుదల చేశాయి.

మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా సావిత్రిభాయి జయంతి : ఆప్టా డిమాండ్

ప్రజాశక్తి–అమరావతి బ్యూరో

సావిత్రిభాయి పూలే జయంతిని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక ఉపాధ్యాయుల టీచర్స్ అసోసియేషన్ కోరింది. ఈ మేరకు అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె ప్రకాష్‌రావు, ఎంజి మెహిది ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. దేశంలోనే తొలిసారిగా 1848లో బాలికల పాఠశాలను సావిత్రిభాయి ప్రారంభించారని తెలిపారు. ఆమె జయంతి జనవరి 3న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా అధికారికంగా ప్రకటించిందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా అధికారికంగా ఆమె జయంతిని జరపడంతోపాటు మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించాలని సిఎం, విద్యాశాఖ మంత్రిని కోరారు.



సైకిల్ యాత్రను ప్రారంభిస్తున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి టి.సుబ్రహ్మణ్యం

మీ సేవ ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలి

- తిరుపతి నుంచి సైకిల్ యాత్ర ప్రారంభం

ప్రజాశక్తి- తిరుపతి టౌన్

గత ప్రభుత్వ హయాంలో తొలగించిన మీ సేవా ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సిఐటియు అనుబంధ సంస్థ ఎపి మీసేవ ఎంప్లాయిస్ అసోసియేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ఆదివారం సైకిల్ యాత్ర ప్రారంభమయ్యింది. తిరుపతి నగరం అలిపిరి గరుడ సర్కిల్ వద్ద సైకిల్ యాత్రకు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి టి సుబ్రహ్మణ్యం జెండా ఊపి ప్రారంభించారు. మీసేవ, అవుట్‌సోర్సింగ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి నాగేశ్వరావు తిరుపతి నుంచి సైకిల్‌పై యాత్రగా బయలుదేరారు. శ్రీకాళహస్తి, నాయుడుపేట, నెల్లూరు, గుంటూరు ప్రాంతాల వారీగా యూనియన్ నాయకులు ఆయనతో పాటు యాత్రలో భాగస్వాములు కానున్నారు. అమరావతికి సైకిల్ యాత్ర చేరుకునేలోపు మీసేవ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని లేదంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యం హెచ్చరించారు. ఎపి మీసేవల ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాలసుబ్రమణ్యం, రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ 2003 నుంచి 18 ఏళ్లుగా 170 ప్రభుత్వ అర్బన్ మీ సేవ కేంద్రాల్లో విధులు నిర్వహించిన 607 మంది ఉద్యోగులను గత ప్రభుత్వం తొలగించిందని ఆవేదన వ్యక్తం చేశారు. తిరిగి తమను విధుల్లోకి తీసుకుంటామని యువగళం పాదయాత్రలో నారా లోకేష్ ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రారంభ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రవి కిరణ్, పవన్ కుమార్, జిల్లా నాయకులు వెంకటరమణ, శ్రీధర్, భాస్కర్, మోహిని, రేవతి, సురేష్ , మోహిని, బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.

ఇద్దరు మావోయిస్టుల లొంగుబాటు

ప్రజాశక్తి – పాడేరు (అల్లూరి జిల్లా)

అల్లూరి జిల్లా ఎస్‌పి అమిత్ బర్దర్ ఎదుట ఇద్దరు మావోయిస్టులు ఆదివారం లొంగిపోయారు. ఆ వివరాలను మీడియా సమావేశంలో ఎస్‌పి వెల్లడించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుక్మా జిల్లా బోడెగుబ్బల్ గ్రామానికి చెందిన దిరిదో విజ్జల్ అలియాస్ జైలాల్, ఫుల్బాగిడే గ్రామానికి చెందిన మడివి గంగి అలియాస్ విమల మావోయిస్టు పార్టీలో పనిచేస్తున్నారు. పలు ఆపరేషన్లలో పాల్గొన్నారు. కొంతకాలంగా పార్టీలోనూ, బయట నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో జనజీవన స్రవంతిలో కలిసేందుకు సిద్ధమై పోలీసుల ఎదుట లొంగిపోయారు. మావోయిస్టులు స్వచ్ఛందంగా లొంగిపోయి ప్రభుత్వం కల్పిస్తున్న సంక్షేమ పథకాలు, సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌పి కోరారు. లొంగిపోయినవారికి ప్రభుత్వం ఆధ్వర్యంలో నైపుణ్య శిక్షణ అందిస్తామని తెలిపారు.

స్టీల్‌ప్లాంట్ సిఎమ్‌డిపై సిబిఐ విచారణ

- శాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ, కార్మిక సంఘాల డిమాండ్

ప్రజాశక్తి – ఉక్కునగరం (విశాఖపట్నం)

చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడిన వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ఇన్‌ఛార్జి సిఎమ్‌డి సక్సేనాపై సిబిఐ విచారణ జరిపించాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ, ఉక్కు కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు ఆదివారం పోరాట కమిటీ చైర్మన్లు సిహెచ్.నర్సింగరావు (సిఐటియు), డి.ఆదినారాయణ (ఎఐటియుసి), ఎం. రాజశేఖర్ (ఐఎన్‌టియుసి), పాడి త్రినాధరావు (విశాఖ స్టీల్ ఎంప్లాయిస్ యూనియన్) సంయుక్త ప్రకటన విడుదల చేశారు. కోక్, పల్లెట్స్, ఇతర ముడి సరుకుల కొనుగోలు విషయంలో సక్సేనా ఆమోదించిన అన్ని ఫైళ్లను సిబిఐకి అందజేయాలని కోరారు. ఆయన ఈ నెలలోనే ఉద్యోగ విరమణ చేయనున్నందున ఈ అంశంపై తక్షణమే విచారణ జరిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్మిక శాఖకు వాస్తవాలను తప్పుగా అందించినందుకు ఆయనను ప్రాసిక్యూట్ చేయాలని పేర్కొన్నారు. ప్లాంట్‌లో భద్రతా ప్రమాణాలు కొరవడ్డాయని, గడిచిన 11 నెలల్లో పలువురు కార్మికులు మరణించారని గుర్తుచేశారు. సక్సేనా బాధ్యతలు స్వీకరించిన తరువాత ప్లాంట్‌లోని ముడి సరుకు కొనుగోలు విషయంలో అనేక అవినీతి కార్యకలాపాలకు పాల్పడ్డారన్నారు. వెంటనే ఆయన్ని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

ప్రజలకు ఆరోగ్యాన్నిచ్చేలా వ్యవస్థ

- ప్రజారోగ్యవేదిక సదస్సులో వక్తలు

ప్రజాశక్తి–అమరావతి బ్యూరో



సదస్సులో మాట్లాడుతున్న వేదిక ఎన్‌టిఆర్ జిల్లా గౌరవాధ్యక్షులు డాక్టర్ సూరపనేని సుధాకర్

ప్రజలందరికీ ఆరోగ్యాన్నిచ్చేలా వైద్యవిధానం ఉండాలని ప్రజారోగ్యవేదిక నిర్వహించిన సదస్సులో వక్తలు తెలిపారు. జన్‌స్వాస్థ్య అభియాన్ వ్యవస్థాపకులు డాక్టర్ అమిత్‌సేన్ గుప్తా వర్ధంతి సందర్భంగా విజయవాడలోని ఎంబి విజ్ఞాన కేంద్రంలో ఆరోగ్య సదస్సు జరిగింది. ఈ సదస్సుకు వేదిక ఎన్‌టిఆర్ జిల్లా గౌరవాధ్యక్షులు డాక్టర్ సూరపనేని సుధాకర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వేదిక ప్రధాన కార్యదర్శి టి కామేశ్వరరావు మాట్లాడుతూ.. వైద్యారోగ్య రంగానికి జిడిపిలో 6 శాతం నిధులను కేటాయించాలని నిపుణులు చెబుతున్నప్పటికీ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పబ్లిక్, ప్రైవేట్, పార్ట్‌నర్‌షిప్ (పిపిపి) పేరుతో వైద్య కళాశాలలను ప్రైవేటీకరించే యత్నం సరికాదని అన్నారు. దీనివల్ల ప్రజలకు వైద్యం మరింత భారంగా మారుతుందని తెలిపారు. ప్రభుత్వ రంగంలో వైద్య సేవలు అందుబాటులో లేకపోతే ప్రజలకు అన్యాయం జరుగుతుందన్నారు. సీనియర్ వైద్యులు, ప్రజారోగ్య వేదిక జిల్లా గౌరవ అధ్యక్షులు ఎం సీతారామారావు మాట్లాడుతూ.. అమిత్‌సేన్ గుప్తా అంతర్జాతీయంగా, జాతీయంగా ప్రజారోగ్య సమస్యలపై నిరంతరాయంగా కృషి చేశారని చెప్పారు. విధానపరమైన మార్పుల కోసం పనిచేశారని తెలిపారు. ప్రముఖ వైద్యులు జి సురేంద్ర మాట్లాడుతూ.. వ్యాధుల పట్ల, వైద్యం పట్ల ప్రజలకు అవగాహన పెరగాలని చెప్పారు. ఆర్థిక కారణాలతో వైద్యం పేదలకు అందుబాటులో ఉండటం లేదని పేర్కొన్నారు. ప్రముఖ మానసిక వైద్య నిపుణులు ఇండ్ల రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ.. సమాజంలో రోజురోజుకూ మానసిక సమస్యలు పెరుగుతున్నాయ ని చెప్పారు. మానవ సంబంధాలు, కుటుంబ సంబంధాలు దెబ్బతింటున్నాయని, ఇది ప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేశారు. గంజాయి, డ్రగ్స్ వల్ల యువత పెను ప్రమాదాన్ని ఎదుర్కొంటుందని, ప్రభుత్వాలు వీటిని పూర్తిగా నిర్మూలించాలని చెప్పారు. 'ఎపి హెల్త్ కేర్ సిస్టం ఎదుర్కొంటున్న సవాళ్లు–పరిష్కారాలు' అనే అంశంపై ప్రముఖ వైద్యులు ఎ పూర్ణానంద్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రజారోగ్య వేదిక ఎన్‌టిఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి విజయ్‌ప్రకాష్, నాయకులు లీల, పిఆర్‌కె రెడ్డి, రామావతారం, జి దుర్గ తదితరులు పాల్గొన్నారు.



పిఎబిఆర్ కుడికాలువకు గండిపడడంతో దిగువకు ప్రవహిస్తున్న నీరు

హెచ్‌ఎల్‌సికి రెండు చోట్ల గండి

- వృథాగా తుంగభద్ర నీరు

ప్రజాశక్తి – అనంతపురం యంత్రాంగం

తుంగభద్ర రిజర్వాయర్ నుంచి మన రాష్ట్రానికి నీరు సరఫరా అయ్యే హెచ్‌ఎల్‌సి కాలువకు ఆదివారం ఉదయం గండిపడింది. అదే విధంగా అనంతపురం జిల్లా ఉరవకొండ నియోజకవర్గ పరిధిలో ఉన్న పెన్నా అహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (పిఎబిఆర్) కుడికాలువకు శనివారం రాత్రి గండిపడింది. కాలువలు బలహీనంగా ఉండటంతోనే ఈ గండ్లు పడినట్లు తెలుస్తోంది. అనంతపురం జిల్లా డి. హీరేహాల్, బొమ్మనహాల్ మండలాల పరిధిలో ఉన్న తుంగభద్ర ఎగువ కాలువకు 113/557 కిలోమీటరు వద్ద అండర్ టన్నెల్ సైడ్‌వాల్ కూలడంతో కాలువకు గండిపడింది. దీంతో స్థానిక రైతులు తుంగభద్ర అధికారులకు సమాచారం అందించారు. తుంగభద్ర ఎగువ కాలువ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మద్దిలేటి, డిఇ దివాకర్‌రెడ్డి, అసిస్టెంట్ ఇంజనీర్ అల్తాఫ్ తన సిబ్బందితో కలిసి గండిపడిన చోటుకు చేరుకుని మరమ్మతులు చేపట్టారు. అనంతపురం జిల్లా కూడేరు మండల పరిధిలోని పిఎబిఆర్ కుడికాలువకు నాల్గోవ కిలోమీటరు వద్ద జల్లిపల్లి గ్రామం సమీపాన గండిపడడంతో వరి, వేరుశనగ, చీనీతోటలను కాలువ నీరు ముంచెత్తింది. హెచ్‌ఎల్‌సి అధికారులకు రైతులు సమాచారమివ్వడంతో కుడికాలువ గేట్లను మూసివేయడానికి ప్రయత్నించారు. అయితే గేట్లు స్తంభించిపోవడంతో పిఎబిఆర్ నుంచి నీటిని పెనకచెర్ల డ్యాం (ఎంపిఆర్)కు వదిలిపెట్టారు. దీంతో కుడికాలువకు నీటి ప్రవాహం తగ్గిపోయింది. హెచ్‌ఎల్‌సి ఎఇ ఓబుళరెడ్డి మాట్లాడుతూ... పిఎబిఆర్ నుంచి కుడి కాలువకు మూడు రోజులుగా నీరు విడుదల చేస్తున్నామన్నారు. మొరాయించిన గేట్లను రిపేర్ చేయడానికి రెండు, మూడు రోజుల సమయం పడుతుందని తెలిపారు.

సంపులో పడి అన్నదమ్ములు మృతి

ప్రజాశక్తి – బ్రహ్మసముద్రం

వ్యవసాయ నీటి సంపులో పడి అన్నదమ్ములు మరణించిన విషాదకర సంఘటన అనంతపురం జిల్లా బ్రహ్మసముద్రం మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. కళ్యాణదుర్గం పట్టణం శెట్టూరు రోడ్డులో నివాసముంటున్న తలారి వెంకటేశు, వరుసకు తమ్ముడైన రాము కలిసి పాలవెంకటాపురం గ్రామంలోని మామిడితోటను కౌలుకు తీసుకున్నారు. ఆదివారం ఉదయం మామిడి చెట్లకు పిచికారీ చేస్తుండగా మందు కొరత రావడంతో వెంకటేశు తన కుమారులు నరేంద్ర ఆలియాస్ నాని (25), చరణ్ ఆలియాస్ చిన్న (18)కి ఫోన్ చేసి విషయం చెప్పారు. వారు మందు తీసుకుని తోట వద్దకు వచ్చారు. తోటలోని నీటి సంపులోకి చరణ్ దిగాడు. లోతు ఎక్కువగా ఉండడంతో మునిగిపోయారు. గమనించిన నరేంద్ర తన తమ్ముడిని కాపాడే క్రమంలో సంపులోకి దిగాడు. లోతు ఎక్కువగా ఉండడంతో ఊపిరాడక ఇద్దరూ మరణించారు. కుమారులు కనిపించకపోవడంతో తోటలో వెంకటేశు వెతకసాగారు. నీటి సంపులో విగతజీవిగా పడి ఉన్న కుమారులను చూసి ఒడ్డుకు చేర్చారు. అప్పటికే వారు మరణించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మూగజీవాలపైకి దూసుకెళ్లిన వాహనం

- 40 గొర్రెలు మృత్యువాత

ప్రజాశక్తి – బెలుగుప్ప

మూగజీవాలపైకి తుఫాను వాహనం దూసుకువెళ్లడంతో 40 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. మరో 15 తీవ్రంగా గాయపడ్డాయి. ఈ సంఘటన అనంతపురం జిల్లా బెలుగుప్ప మండల పరిధిలోని కాలువపల్లి బ్రిడ్జి వద్ద ఆదివారం చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల మేరకు... ఆత్మకూరు మండలం బియాలేరుకు చెందిన గొర్రెలకాపరులు నాగేశ్వరరెడ్డి, అక్కులప్ప తమ గొర్రెలను తీసుకుని కాలువపల్లి రహదారి పక్కన వెళ్తుండగా ఆర్‌టిసి బస్సును తప్పించబోయిన తుఫాను వాహనం గొర్రెల మందపైకి దూసుకువెళ్లింది. ఈ ప్రమాదంలో 40 గొర్రెలు అక్కడకక్కడే మృతిచెందాయి. దాదాపు రూ.15 లక్షలకు పైగా నష్టం వాటిల్లిందని గొర్రెల యజమాని నాగేశ్వరరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివ తెలిపారు.



డోలి కట్టి గర్భిణిని తీసుకొస్తున్న గిరిజనులు

తప్పని డోలీ మోత

ప్రజాశక్తి-శృంగవరపుకోట (విజయనగరం జిల్లా)

గిరిశిఖర గ్రామాల గిరిజనులకు డోలీ మోతలు తప్పడం లేదు. ఎక్కడికక్కడ ఇవి నిత్యకృత్యమవుతున్నాయి. విజయనగరం జిల్లా శృంగవరపుకోట మండలంలోని మూలబొడ్డవర పంచాయతీ పరిధిలో గాదిల్లోవ గ్రామానికి చెందిన గర్భవతైన అంటిపర్తి భజంతికి పురిటినొప్పులు ప్రారంభమయ్యాయి. ఆమె భర్త సన్యాసిరావు తోటి గిరిజనుల సాయంతో సుమారు రెండు కిలోమీటర్ల మేర డోలీపై కొండ దిగువకు తీసుకొచ్చారు. అక్కడి నుంచి అంబులెన్స్‌లో శృంగవరపుకోట పట్టణంలోని ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించారు. బొడ్డవర నుంచి గాదిల్లోవ గ్రామానికి ఇదివరకే రోడ్డు మంజూరైంది. గత, ప్రస్తుత ఎమ్మెల్యేలు శంకుస్థాపనలు కూడా చేశారు. పనులు ప్రారంభమవ్వలేదు. స్థానిక ప్రజాప్రతినిధులు రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్నారే తప్ప పనులు ప్రారంభించడం లేదని, గిరిజనులంటే చిన్నచూపుతోనే ఇలా చేస్తున్నారని ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ రోడ్డును వెంటనే పూర్తి చేయాలని, డోలీ మోతలను తప్పించాలని డిమాండ్ చేశారు.



చెక్కును టిటిడి అధికారులకు అందిస్తున్న దాతలు

టిటిడికి రూ.10 లక్షలు విరాళం

ప్రజాశక్తి- తిరుమల:

టిటిడి శ్రీ వేంకటేశ్వర అన్న ప్రసాదం ట్రస్టుకు ఆదివారం అమెరికాకు చెందిన ఎన్ఆర్ఐ శివప్రసాద్ రూ.10, 01,116 విరాళం ఇచ్చారు. ఈ మేరకు డిడిని ఆలయ పేష్కార రామకష్ణకు రంగనాయక మండపంలో అందజేశారు. అనంతరం టిటిడి అధికారులు దాతలకు దర్శన ఏర్పాట్లు చేసి స్వామివారి తీర్థప్రసాదాలు అందించారు.

ఉపాధ్యాయులపై మానసిక ఒత్తిడి

- పాఠశాల విద్యను అత్యవసర శాఖగా మార్చారు : యుటిఎఫ్
- 18న నిరసనలకు పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉపాధ్యాయులను మానసిక ఒత్తిడికి గురి చేయొద్దని యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఆ సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం విజయవాడలోని రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం జరిగింది. పాఠశాల విద్యాశాఖను అత్యవసర శాఖగా మార్చి ఒత్తిడికి గురి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు కార్యవర్గం తీర్మానం చేసిందని సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్ వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్ ప్రసాద్ తెలిపారు. పాఠశాల విద్యాశాఖ వెకేషన్ డిపార్ట్‌మెంట్‌గా ఉంటూ, మానసిక శాస్త్ర ప్రకారం నేర్చుకొనేవారికి, చదువు చెప్పేవారికి విశ్రాంతి అవసరమని చెప్పిన దానికి భిన్నంగా అత్యవసర శాఖగా మార్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాన్ వెకేషన్ శాఖగా మార్చాలని కొన్ని ఉపాధ్యాయ సంఘాలు విద్యాశాఖ కమిషనర్‌కు గతంలో ప్రాతినిధ్యం చేస్తే నాన్ వెకేషన్ శాఖగా మార్చలేమని సమాధానం చెప్పిందని గుర్తు చేశారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో బోధించాల్సిన ఉపాధ్యాయులను రోజుకో స్కీం పేరుతో ఒత్తిడి తీసుకొస్తూ ఆదివారాలు, రెండో శనివారాలు పండగ సెలవుల్లో పనిచేయించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పదో తరగతి బోధించే ఉపాధ్యాయులకు సెలవులు ఇవ్వకుండా ఇబ్బందికి గురిచేస్తున్నారని విమర్శించారు. పదో తరగతి ఉత్తీర్ణత 100 శాతం పేరుతో ప్రతిరోజూ సాయంత్రం పరీక్ష నిర్వహించి మార్కులు అప్‌లోడ్ చేయాలని ఒత్తిడి చేయడం ద్వారా మానసిక వేధింపులకు గురిచేస్తున్నారన్నారు. వాతావరణ పరిస్థితుల వల్ల ప్రభుత్వం ఇచ్చిన సెలవులను సైతం 220 పనిదినాలు ఉన్నా.. రెండో శనివారం పనిచేయాలనే నిబంధన పెట్టారని తెలిపారు. పాఠశాల విద్యాశాఖ ఇచ్చిన అకడమిక్ క్యాలెండర్‌ను విద్యాశాఖే అమలు చేయని వింత పరిస్థితి ఉందని పేర్కొన్నారు. విద్యాశాఖ ఒత్తిడితో కొన్ని జిల్లాల కలెక్టర్లు ఉపాధ్యాయులపై రకరకాల స్కీమ్‌లను అమలు చేస్తున్నారని, లేకుంటే షోకాజ్‌లు ఇస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. 3 నుంచి 5 కిలోమీటర్ల దూరంలో ఉన్నా.. కొన్ని ప్రాథమికోన్నత పాఠశాలలు ప్రాథమిక పాఠశాలల విద్యార్థులను ఉన్నత పాఠశాలలకు మ్యాప్ చేశారని తెలిపారు. ఈ విద్యార్థులకు రవాణా భత్యం చెల్లిస్తామని చెప్పిన విద్యాశాఖ జిఓ ఇచ్చినా ఆచరణలో రకరకాల నిబంధనలు పెట్టి విద్యార్థుల సంఖ్యను కుదించడం సరికాదన్నారు. మ్యాప్ చేసిన అందరి విద్యార్థులకు రవాణా భత్యం చెల్లించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు విద్యను దూరం చేసేలా గిరిజన విద్యాశాఖ అధికారుల వైఖరి ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వార్డెన్ బాధ్యతతోపాటు విద్యార్థులకు అనారోగ్యం వస్తే ఉపాధ్యాయులే బాధ్యత వహించాలని, రోజూ రాత్రి 9 గంటలకు, అర్ధరాత్రి 12 గంటలకు, ఉదయం 6 గంటల వరకు బయోమెట్రిక్ వేయాలని ఉపాధ్యాయులను ఒత్తిడి చేస్తున్నారని తెలిపారు. 2010కి ముందు నియామకం పొందిన ఉపాధ్యాయులను టెట్ నుంచి మినహాయించాలని డిమాండ్ చేస్తూ.. ఈ నెల 9, 10 తేదీల్లో పాత తాలూకా కేంద్రాల్లో నిరసన ర్యాలీ, 18న జిల్లా కేంద్రాల్లో ధర్నా నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని తీర్మానించినట్లు వెల్లడించారు. గిరిజన సంక్షేమశాఖ ఐటిడిఎ ముఖ్యకార్యదర్శి వైఖరికి, ఉపాధ్యాయులను వేధింపులకు గురిచేసే విధానానికి వ్యతిరేకంగా 18న ఐటిడిఎ ఉన్న జిల్లాల్లో ధర్నాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం సహాధ్యక్షులు కె సురేష్‌కుమార్, కోశాధికారి రెడ్డి మోహనరావు, కార్యదర్శులు బి లక్ష్మీరాజా, ఎస్‌పి మనోహర్ కుమార్, అరుణకుమారి, ఎన్ఎస్ నాయుడు, నవకోటేశ్వరరావు, కెఎ ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయాలపై చర్యలు తీసుకోవాలి

గంజాయిని విక్రయించే వారి పట్ల ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని యుటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్ వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్ ప్రసాద్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. విద్యార్థులు గంజాయికి బానిసలుగా మారి జీవితాలను నాశనం చేసుకుంటున్న సంఘటనలు జరగడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాల పరిసరాల్లో గంజాయి అమ్మకాలు లేకుండా నియంత్రించడంతోపాటు విద్యార్థులకు గంజాయి వల్ల ఏర్పడే పరిణామాలను వివరిస్తూ పాఠశాల స్థాయిలో అవగాహన సదస్సులు నిర్వహించాలని కోరారు. చాక్లెట్, టాబ్లెట్, సిగరెట్, కూల్‌డ్రింక్ రూపంలో గంజాయి అమ్మకాలు సాగడాన్ని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవాలని కోరారు. గంజాయికి గురవుతున్న విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇచ్చి మంచి పౌరులుగా మారడానికి ఉపాధ్యాయులు కూడా బాధ్యత తీసుకోవాలన్నారు.

గోదావరిలో నిలిచిన పంటు

ప్రజాశక్తి - సఖినేటిపల్లి)

వశిష్ట గోదావరి నది మధ్యలో పంటు (పడవ) సాంకేతిక కారణాలతో నిలిచిపోయింది. దీంతో పంటులో ఉన్న ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మధ్య ప్రతి రోజూ వేలాది మంది పంటుపై రాకపోకలు సాగిస్తుంటారు. ఆదివారం ఉదయం నరసాపురం వైపు నుంచి సఖినేటిపల్లి రేవుకు వస్తున్న సమయంలో పంటుకు సంబంధించిన ఇంజన్ మొరాయించడంతో నది మధ్యలో నిలిచిపోయింది. ఆ సమయంలో సుమారు 80 మంది ప్రయాణికులు, ఒక కారు, 20 ద్విచక్ర వాహనాలు పంటుపై ఉన్నాయి.



సఖినేటిపల్లిలో గోదావరి నది మధ్యలో నిలిచిన పంటను తాడు సహాయంతో లాక్కుని వస్తున్న మరో పంటు(పడవ)

సముద్రపు ఆటుపోట్లతో పంటు కదులుతూ సముద్రపు వైపునకు సాగడంతో తీవ్ర ఆందోళనకు గురయ్యారు. పంటు నిర్వాహకులు మరమ్మతులు చేపట్టిన ఫలితం లేకుండాపోయింది. ఇదే రేవులో ప్రయాణం సాగిస్తున్న మరొక పంటుకు తాళ్లను కట్టి సఖినేటిపల్లివైపునకు చేర్చడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకొన్నారు. పంటులపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో తరచూ ఇలాంటి ఘటనలు జరుగున్నాయని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు పంటుల ఫిట్‌నెస్‌పై దృష్టి సారించాలని వారు కోరుతున్నారు.



రామభద్రాపురం మండలంలో పట్టుబడిన గంజాయిని స్వాధీనం చేసుకున్న పోలీసులు

విజయనగరం కేంద్రంగా గంజాయి రవాణా

- ఎఎస్ఆర్ జిల్లా, ఒడిశా నుంచి దిగుమతులు
- ఒడిశా, చెన్నై, హైదరాబాద్, బెంగళూరుకు ఎగుమతులు
- స్థానికంగా విస్తరిస్తున్న క్రయ, విక్రయాలు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

గంజాయి ఎగుమతి, దిగుమతులకు విజయనగరం కేంద్ర బిందువుగా మారింది. ఒడిశా నుంచి అల్లూరి సీతారామరాజు జిల్లాల అటవీ ప్రాంతం నుంచి శృంగవరపుకోట, సాలూరు, రామభద్రపురం మీదుగా జిల్లాలోకి గంజాయి దిగుమతి అవుతోంది. ఇక్కడి నుంచి ఒడిశా, పశ్చిమబెంగాల్, బీహార్ రాష్ట్రాలతో పాటు ఇటు విశాఖ, చెన్నై, హైదరాబాద్, బెంగళూరు తదితర మహానగరాలకు ఎగుమతులు జరుగుతున్నట్టు పోలీసులు గుర్తించారు. దిగుమతి, ఎగుమతికి విజయనగరం కేంద్ర బిందువుగా ఉండడంతో నగరంలో గంజాయి మాఫియా విస్తరించింది. రైల్వేస్టేషన్, పూల్‌బాగ్ పరిసర ప్రాంతాల్లో అగ్గిపెట్టెలు, సిగరెట్ పెట్టెల్లో విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఏడాది క్రితం నైట్ రైడింగ్‌కి వెళ్లిన క్రైమ్ బ్రాంచ్ పోలీసులపై గంజాయి బ్యాచ్ దాడికి యత్నించింది.

విజయనగరంలోని బాలాజీనగర్, శ్రీనివాసనగర్ ప్రాంతాల్లో గంజాయి మత్తులో ద్విచక్ర వాహనాలతో స్టంట్లు వేస్తున్నారు. కాలేజీలకు వెళ్లే విద్యార్థులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నాలుగు నెలల క్రితం చెల్లూరు - గొట్లాం బైపాస్ రోడ్డులో వెళ్తున్న ఓ లారీని అడ్డగించి, డ్రైవర్ వద్దనున్న రూ.ఆరు వేల నగదు, సెల్‌ఫోను లాక్కొన్నారు. ఇది గంజాయి బ్యాచ్ పనేనని పోలీసుల విచారణలో తేలింది. ఉడా కాలనీలో జరిగిన అత్యాచారం కేసు నిందితుడు ఆ సమయంలో గంజాయి సేవించినట్టుగా పోలీసులు గుర్తించారు.

గంజాయి పట్టుబడిన కేసుల్లో ఎక్కువగా ఒడిశా, బీహార్, ఉత్తరప్రదేశ్ యువకులు ఉన్నారు. ఉపాధి లేమి, నిరుద్యోగం ఆసరాగా చేసుకుని పలు రాష్ట్రాలకు చెందిన యువతను ఎఎస్ఆర్ జిల్లా, ఒడిశా అడవులకు గంజాయి వ్యాపారులు పంపుతారు. అక్కడి నుంచి పలు రకాల వాహనాల్లో విజయనగరం వరకు రావడమే వీరి పని. ఇక్కడికి వచ్చాక ఆ వాహనాల్లో ఉన్న గంజాయిని గుర్తు తెలియని వ్యక్తులు స్వాధీనం చేసుకుని మాఫియా డాన్ చెప్పిన ప్రాంతాలకు తరలిస్తుంటారు. ఈ క్రమంలో యువత, విద్యార్థులు కేసుల్లో చిక్కుకుంటున్నారు. ఈ రకమైన కేసులు ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 84 కేసులు నమోదు అయినట్టు పోలీసుల రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. గంజాయి అక్రమ రవాణాకు పాల్పడుతున్న శృంగవరపుకోటకు చెందిన శెట్టి ఉమామహేశ్వరరావుకు చెందిన రూ.రెండు కోట్లకుపైగా ఆస్తిని సీజ్ చేశారు. ఇవన్నీ కేవలం పోలీసులు చూపిన లెక్కలు. గంజాయి అక్రమ రవాణా నివారణకు ప్రస్తుతం ఎస్.కోట, రామభద్రపురం, కొట్టక్కి, పాత బొబ్బిలి, అట్టాడ వంటి ఐదు ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. మరో పది ప్రాంతాల్లో ప్రత్యేక చెక్ పోస్టులు ఏర్పాటు చేస్తామని పోలీసులు చెబుతున్నారు. గతంతో పోలిస్తే ఈ ఏడాది కేసులు అధికమయ్యాయి.

సంవత్సరం	కేసులు	సీజ్‌చేసిన గంజాయి	అరెస్ట్ అయిన నిందితులు	సీజ్‌చేసిన వాహనాలు
2023	58	2559.169 కేజీలు	110	23
2024	83	2186.943 కేజీలు	278	31
2025 నవంబర్ వరకు	84	1171.501 కేజీలు	259	36

కేంద్ర పోలీసు బలగాల్లో ఉద్యోగాలకు సిద్ధమా!





-కోడూరి సుధాకర్
జోష్ ఫిజికల్ ఫిట్నెస్ అకాడమీ,
విజయవాడ.
సెల్ : 7729823118

దేశరక్షణ, దేశ భద్రతకు అవసరమైన సైన్యమే కేంద్ర సాయుధ బలగాలు. సమాజ హితం కోసం, దేశ సమగ్రత, సౌభాగ్యం కోసం ఆదర్శ భావాలు గల యువత ఇలాంటి ఉద్యోగాల్లో చేరి ఎంతో గురుతరమైన బాధ్యతను పోషిస్తున్నారు. దేశకోసం, సమాజంకోసం పాటుపడటమే లక్ష్యంగా ఎంతో త్యాగం చేస్తూ ఉద్యోగ బాధ్యతలను నిర్వరిస్తుంటారు. మంచి జీతం, అలవెన్సులు, వసతి సదుపాయాలు ఉంటాయి. గ్రామీణ ప్రాంతానికి చెందిన నిరుద్యోగ యువత ఇలాంటి ఉద్యోగాలను ఎంపిక చేసుకోవచ్చు.

మనదేశం వివిధ సరిహద్దుల, అంతర్గత భద్రతకు కేంద్ర రక్షణ దళాలు ఒఎంతో కీలకమైనవి. సిఆర్‌పిఎఫ్, బిఎస్ఎఫ్, సిఐఎస్ఎఫ్, ఐటీబీపీ, ఎస్ఎస్‌బి, ఐటిబిపి, ఎఆర్, ఎస్ఎస్ఎఫ్ వంటి విభాగాలు ఉన్నాయి. పతి దళం తన పని ప్రాంతానికి అనుగుణంగా ప్రత్యేక శిక్షణ, సామర్థ్యాలను కలిగి ఉంటుంది. ఆయా విభాగాల్లో చేరేందుకు కేంద్ర హోంశాఖ మంత్రిత్వశాఖ తాజాగా ఎస్ఎస్‌సి జిడి కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీచేసింది. గతంలో హిందీ, ఇంగ్లీష్ భాషల్లోనే అవకాశం ఉండేది. అయితే వచ్చిన వినతులను దృష్టిలో పెట్టుకుని ప్రాంతీయ భాషలైన అస్సామీ, బెంగాలీ, గుజరాతీ, మరాఠీ, మళయాలం, కన్నడ, తమిళం, తెలుగు, ఒడియా, ఉర్దూ, పంజాబీ, మణిపూరీ, కొంకణీ భాషల్లోనూ పరీక్షలు నిర్వహిస్తోంది.

ప్రధాన సరిహద్దు రక్షణ దళాలు

సరిహద్దు భద్రతా దళం(బిఎస్ఎఫ్) : భారత-పాకిస్థాన్, భారత-బంగ్లాదేశ్ సరిహద్దులను రక్షించడం. స్మగ్లింగ్, అక్రమ ప్రవేశం, మానవ అక్రమ రవాణా వంటి నేరాలను నిరోధిస్తుంది. యుద్ధ సమయంలో: భారత సైన్యానికి సహాయక దళంగా పనిచేస్తుంది.

ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీస్ (ఐటిబిపి) : భారత-చైనా సరిహద్దు (హిమాలయ ప్రాంతాలు) పర్యవేక్షణ ప్రాథమిక బాధ్యత. అత్యంత కఠినమైన శీతల వాతావరణంలో పనిచేయడానికి శిక్షణ పొందిన దళం.

సశస్త్ర సీమా బల్ (ఎస్ఎస్‌బి) : భారత-నేపాల్, భారత-భూటాన్ సరిహద్దుల భద్రత ప్రాథమిక బాధ్యత.

అస్సాం రైఫిల్స్ (ఎఆర్) : భారత-మయన్మార్ సరిహద్దు, ఈశాన్య రాష్ట్రాల్లో అంతర్గత భద్రత ప్రాథమిక బాధ్యత. అడవులు, కొండ ప్రాంతాల్లో పర్యవేక్షణ వంటి బాధ్యతలు నిర్వహించారు.

ఇతర ముఖ్యమైన భద్రతా దళాలు

సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స (సిఐఎస్ఎఫ్) : విమానాశ్రయాలు, మెట్రోలు, అణుశక్తి కేంద్రాలు వంటి కీలక మౌలిక సదుపాయాలను రక్షిస్తుంది.

నేషనల్ సెక్యూరిటీ గార్డ్స్ (ఎన్ఎస్‌జి) : భద్రతా బెదిరింపులను ఎదుర్కోవడానికి ప్రత్యేక దళం (ఉదా : టెర్రరిజం వ్యతిరేక కార్యకలాపాలు).

సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సిఆర్‌పిఎఫ్) : అంతర్గత భద్రత, ఎన్నికల భద్రత, నక్సలైట్ వ్యతిరేక కార్యకలాపాలు.

బిఎస్ఎఫ్ భారత-పాక్ సరిహద్దు భద్రతకు ప్రధాన దళం

ఐటిబిపి హిమాలయ పరిసరాల్లో చైనాతో ఉన్న సరిహద్దును కాపాడుతుంది. సిఐఎస్ఎఫ్, సిఆర్‌పిఎఫ్ వంటి దళాలు అంతర్గత భద్రతకు సహాయపడతాయి. ఈ దళాల సమన్వయం, సామర్థ్యం భారతదేశ భద్రతకు అత్యంత ముఖ్యమైంది.

గ్రామీణ నిరుద్యోగులకు వరం

గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగులకు ఇది నిజంగా భారీ శుభవార్తే. దేశ రక్షణ దళంలో ఈ సారి కూడా పెద్ద సంఖ్యలో కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. వివిధ విభాగాల్లో కానిస్టేబుల్ (జీడీ) నియామకాలకు సంబంధించి స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సి) నోటిఫికేషన్ తాజాగా వెలువడింది. గతేడాది కూడా భారీగా కానిస్టేబుల్ పోస్టులను భర్తీ చేయగా.. ఈ ఏడాది కూడా 25,487 పోస్టులను తాజా నోటిఫికేషన్ ద్వారా భర్తీ కానున్నాయి. పదో తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఎవ్వరైనా ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చు. వచ్చే ఏడాది జనవరి లేదా ఫిబ్రవరిలో రాత పరీక్షలు జరుగుతాయి. దరఖాస్తు ప్రక్రియ ఇప్పటికే ప్రారంభం అయింది. డిసెంబర్ 31వ తేదీ వరకూ దరఖాస్తుకు అవకాశం కల్పించారు. బిఎస్ఎఫ్, సిఐఎస్ఎఫ్, సిఆర్‌పిఎఫ్, ఐటిబిపి, ఎస్ఎస్‌బి, ఎస్-ఎస్ఎఫ్‌లో కానిస్టేబుల్ (జనరల్ డ్యూటీ) పోస్టులు, అస్సాం రైఫిల్స్ రైఫిల్ మ్యాన్ (జనరల్ డ్యూటీ), ఎన్‌సిబిలో సిపాయి పోస్టులను ఈ నోటిఫికేషన్ కింద భర్తీ కానున్నాయి.

25,487 పోస్టులకు నోటిఫికేషన్

దేశంలోని కేంద్ర సాయుధ బలగాల్లోని వివిధ విభాగాల్లో మొత్తంగా 25,487 కానిస్టేబుల్ (జీడీ) పోస్టుల్ని భర్తీ చేయనున్నారు. అర్హులైన అభ్యర్థులు నవంబర్ 24 నుంచి డిసెంబర్ 31వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు రుసుం జనవరి 1 రాత్రి 11 గంటల వరకు చెల్లించొచ్చు. ఆన్‌లైన్ పరీక్ష ఫిబ్రవరి లేదా మార్చిలో జరిగే అవకాశం ఉంటుంది. ఇంగ్లీష్, హిందీ భాషల్లోనే కాకుండా తెలుగు సహా మొత్తం 13 ప్రాంతీయ భాషల్లో పరీక్ష ఉంటుంది. కేంద్ర సాయుధ బలగాలు (సీఏపీఎఫ్)తో పాటు ఎన్ఐఏ, ఎస్ఎస్ఎఫ్, అస్సాం రైఫిల్స్ (రైఫిల్ మ్యాన్) విభాగాల్లో ఈ పోస్టుల్ని భర్తీ చేస్తారు.

మొత్తం పోస్టులు	**25,487**
పురుషులు	23,467
మహిళలు	2020
బిఎస్ఎఫ్	616
సిఐఎస్ఎఫ్	14595
సిఆర్‌పిఎఫ్	5490
ఎస్ఎస్‌బి	1764
ఐటీబీపీ1293	
ఎఆర్	1706
ఎస్ఎస్ఎఫ్	23

విద్యార్హతలు : అభ్యర్థులు తప్పనిసరిగా జనవరి 1, 2026 నాటికి 10వ తరగతి/మెట్రిక్యులేషన్ ఉత్తీర్ణులై ఉండాలి. వయస్సు, నివాసం, శారీరక ప్రమాణాలకు సంబంధించిన నిబంధనలను నోటిఫికేషన్‌లో పేర్కొన్న విధంగా పాటించాలి. శారీరక వికలాంగులు ఈ పరీక్షకు అనర్హులు.

వేతనం: పే లెవెల్-3 కింద రూ. 21,700 నుంచి రూ.69,100 వరకు ఉంటుంది. కెరీర్ పరంగా మంచి స్థిరత్వం, జీతం, భద్రత అన్నీ ఉంటాయి. దీనితో పాటు డీఏ, హెచ్ఆర్ఏ, రేషన్, యూనిఫారం అలవెన్సులు, మెడికల్ సౌకర్యాలు వంటి అనేక ప్రయోజనాలు లభిస్తాయి. ఒక ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చే భద్రత, పెన్షన్ సౌకర్యాలు కూడా ఉంటాయి.

వయస్సు: జనవరి 1, 2024 నాటికి 18 నుంచి 23 ఏళ్లు మించరాదు. రిజర్వేషన్ కేటగిరీల వారికి వయో పరిమితిలో సడలింపు ఇచ్చారు.

దరఖాస్తు రుసుం: రూ.100 (మహిళలు, ఎస్సీ, ఎస్టీ, ఎక్స్ సర్వీస్‌మెన్ విభాగాలకు చెందిన వారికి మినహాయింపు)

ఎంపిక ప్రక్రియ: కంప్యూటర్ ఆధారిత రాత పరీక్ష, పీఈటీ, పీఎస్‌టి, వైద్య పరీక్షల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

కంప్యూటర్ ఆధారిత పరీక్ష ఆబ్జెక్టివ్ రూపంలో ఉంటుంది. 60 నిమిషాల పాటు ఉండే ఈ పరీక్షలో మొత్తం 80 ప్రశ్నలకు 160 మార్కులకు ఉంటుంది.

పరీక్షలో జనరల్ ఇంటెలిజెన్స్, రీజనింగ్, జనరల్ నాలెడ్జ్, జనరల్ అవేర్‌నెస్, ఎలిమెంటరీ మ్యాథమెటిక్స, ఇంగ్లీష్, హిందీ సబ్జెక్టుల్లో ఒక్కో అంశంలో 20 ప్రశ్నలు చొప్పున మొత్తం 80 ప్రశ్నలు ఇస్తారు.

ఒక్కో తప్పు సమాధానానికి పావు మార్కు కోత విధిస్తారు. సమాధానం రాసేముందు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకోవాలి.

పరీక్షా కేంద్రాలు : ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని చీరాల, గుంటూరు, కాకినాడ, కర్నూలు, నెల్లూరు, రాజమండ్రి, తిరుపతి, విజయనగరం, విజయవాడ, విశాఖపట్నం, హైదరాబాద్, కరీంనగర్, వరంగల్.

అర్హతలు ఇవే...

- ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలంటే ఏదైనా గుర్తింపు పొందిన బోర్డు నుంచి మెట్రిక్యులేషన్ లేదా పదో తరగతిలో ఉత్తీర్ణులై ఉండాలి. -నోటిఫికేషన్‌లో సూచించిన విధంగా పురుష అభ్యర్థుల ఎత్తు 170 సెం.మీ.లకు, మహిళా అభ్యర్థులకు 157 సెం.మీ.లకు తగ్గకుండా ఉండాలి.
- అభ్యర్థుల వయసు తప్పనిసరిగా 18 నుంచి 23 సంవత్సరాల మధ్య ఉండాలి.
- ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు
- ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్ల చొప్పున వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.

ఆసక్తి కలిగిన వారు ఆన్‌లైన్ విధానంలో డిసెంబర్ 31 తేదీలోపు దరఖాస్తు చేసుకోవల్సి ఉంటుంది. దరఖాస్తు రుసుము కింద ప్రతి ఒక్కరూ రూ.100 చెల్లించాలి.

3 **Vacancies**: The details of vacancies are as follows:

Force	Male SC	Male ST	Male OBC	Male EWS	Male UR	Total	Female SC	Female ST	Female OBC	Female EWS	Female UR	Total	Grand Total
BSF	78	58	113	53	222	524	11	7	20	5	49	92	616
CISF	1918	1391	2958	1321	5547	13135	205	152	326	150	627	1460	14595
CRPF	870	32	1343	598	2523	5366	15	8	27	8	66	124	5490
SSB	257	167	412	176	752	1764	0	0	0	0	0	0	1764
ITBP	146	139	219	109	486	1099	24	25	38	16	91	194	1293
AR	161	302	278	157	658	1556	14	30	25	10	71	150	1706
SSF	3	2	6	2	10	23	0	0	0	0	0	0	23
Total	**3433**	**2091**	**5329**	**2416**	**10198**	**23467**	**269**	**222**	**436**	**189**	**904**	**2020**	**25487**

మహిళలు, ఎస్సీ, ఎస్టీ, మాజీ సైనిక అభ్యర్థులకు ఫీజు చెల్లింపు నుంచి మినహాయింపు ఇస్తారు. రాత పరీక్ష, ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్, మెడికల్ టెస్ట్స్, ధ్రువపత్రాల పరిశీలన, రిజర్వేషన్ తదితరాల ఆధారంగా తుది ఎంపిక ఉంటుంది. ఎంపికైన వారికి వివిధ సాయుధ బలగాల్లో ఉద్యోగాలు కల్పిస్తారు.

రాత పరీక్ష విధానం..

రాత పరీక్ష మొత్తం 80 ప్రశ్నలకు 160 మార్కులకు ఉంటుంది. ప్రతి ప్రశ్నకు రెండు మార్కులు కేటాయిస్తారు. జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్, జనరల్ నాలెడ్జ్ అండ్ జనరల్ అవేర్‌నెస్, ఎలిమెంటరీ మ్యాథమెటిక్స్, ఇంగ్లీష్, హిందీ విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. గంట వ్యవధిలో పరీక్ష రాయాలి. ప్రతి తప్పు సమాధానానికి నెగెటివ్ మార్కింగ్ ఉంటుంది.

మహిళలకూ ప్రత్యేక కోటా...

దేశంలోని వివిధ పారా మిలటరీ బలగాల్లో ఉండే ఖాళీలు. ప్రతి ఫోర్స్‌లో పురుషులు, మహిళలు వేర్వేరుగా పోస్టులు ఉన్నాయి. బిఎస్ఎఫ్, సిఐఎస్ఎఫ్, సిఆర్‌పిఎఫ్ వంటి బలగాల్లో పోస్టుల సంఖ్య ఎక్కువగా ఉండటం వల్ల ఎంపిక అవ్వడానికి అవకాశాలు ఎక్కువ. కేవలం దేశవ్యాప్త పోటీ పరీక్ష, ఫిజికల్ టెస్టులు, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ద్వారా సెలెక్షన్ జరుగుతుంది. ఏటేటా ఈ పోస్టుల భర్తీ జరుగుతోంది. పూర్తిగా పారదర్శకంగా, ఎలాంటి సిఫారసు లేకుండా ఎస్ఎస్‌సి ద్వారా ఏటా జిడి కానిస్టేబుల్ నియామకాలు కొనసాగుతున్నాయి. కానిస్టేబుల్ అంటే సైనిక విభాగాల్లో ప్రారంభ స్థాయి ఉద్యోగం అయినప్పటికీ, దీని ద్వారా తర్వాత మంచి ప్రమోషన్లు, డిపార్ట్‌మెంటల్ ఎగ్జామ్స్ ద్వారా ఉన్నత పోస్టుల్లోకి మారే అవకాశం కూడా ఉంటుంది. పోస్టుల సంఖ్య భారీగా ఉండటం వల్ల చాలామంది యువతకు ఇది మంచి అవకాశం. అన్ని విభాగాల్లోనూ మహిళలకు వేర్వేరు కోటాలు ఉండటం వల్ల ఆయా అభ్యర్థులు కూడా పెద్ద సంఖ్యలో దరఖాస్తు చేసుకోవచ్చు.

నాలుగు దశల్లో ఎంపిక

ఎస్ఎస్‌సి జిడి కానిస్టేబుల్ ఎంపిక ప్రక్రియ పూర్తిగా నాలుగు దశల్లో జరుగుతుంది.

రాత పరీక్ష: ఆన్‌లైన్‌లో సిబిటి పరీక్షలో సాధారణ బుద్ధి, సామాన్య విజ్ఞానం, రీజనింగ్, మ్యాథ్స్ వంటి నాలుగు విభాగాలు ఉంటాయి. ఈ పరీక్షలో బాగా రాస్తే తర్వాతి దశకు వెళ్తారు.

ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్ (పిఇటి) : ప్రతి ఫోర్స్‌కు వేర్వేరు రన్నింగ్ టెస్టులు, పురుషులకు, మహిళలకు వేర్వేరు ప్రమాణాలు ఉంటాయి.

ఫిజికల్ మెజర్‌మెంట్ టెస్ట్ : ఎత్తు, ఛాతీ కొలత వంటి వివరాలను పరీక్షిస్తారు. డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ పరీక్షలు పూర్తయ్యాక మెడికల్ టెస్ట్ జరుగుతుంది. ఆరోగ్యంగా ఉన్నవారినే ఎంపిక చేస్తారు.

పురుషులకు: 24 నిమిషాల్లో 5 కి.మీ. దూరం పరుగు పూర్తి చేయాలి.

మహిళలకు: 8.5 నిమిషాల్లో 1.6 కి.మీ. దూరం పరుగు పూర్తి చేయాలి.

సామాజిక మాధ్యమాల్లో పరీక్ష ప్రిపరేషన్‌కు అవసరమైన మొత్తం సిలబస్ వీడియా క్లాసులు, ప్రాక్టీస్ బిట్స్, గ్రాండ్ టెస్టులు, డౌన్‌లోడ్ మెటీరియల్ వంటివి కూడా సామాజిక మాధ్యమాల్లో అందుబాటులో ఉన్నాయి.

ముఖ్యమైన తేదీలు

దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం : డిసెంబర్ 1

ముగింపు తేదీ : డిసెంబర్ 31

ఫీజు చెల్లింపునకు ఆఖరు తేదీ : జనవరి 1, 2026

దరఖాస్తు సవరణ విండో- జనవరి 8 నుంచి 10, 2026

అభ్యర్థులు నిర్ణీత సవరణ ఛార్జీలు చెల్లించి, జనవరి 8 నుంచి 10, 2026 వరకు తమ ఫారమ్‌లను ఎడిట్ చేసుకోవడానికి వీలుంటుంది.

దరఖాస్తు చేసే విధానం

అప్లికేషన్ ప్రాసెస్ పూర్తిగా ఆన్‌లైన్‌లోనే ఉంటుంది. స్మార్ట్‌ఫోన్ ఉన్నా కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

మొదట ఎస్ఎస్‌సి అధికారిక వెబ్‌సైట్‌కు వెళ్లాలి.

అక్కడ తాజా నోటిఫికేషన్ సెక్షన్‌లో జిడి కానిస్టేబుల్ నోటిఫికేషన్ కనిపిస్తుంది.

అది ఓపెన్ చేసి పూర్తి వివరాలు చదవాలి.

తర్వాత కొత్త రిజిస్ట్రేషన్ ఆప్షన్‌పై క్లిక్ చేసి పేరు, తండ్రి పేరు, డేట్ ఆఫ్ బర్త్, మొబైల్ నెంబర్ వంటి ప్రాథమిక వివరాలు నమోదు చేయాలి.

రిజిస్ట్రేషన్ పూర్తయిన తర్వాత లాగిన్ చేసి అప్లికేషన్ ఫారమ్ ఓపెన్ చేయాలి.

వ్యక్తిగత వివరాలు, చిరునామా, అర్హత వివరాలు, కేటగిరీ వంటి సమాచారం సరిగ్గా నమోదు చేయాలి.

ఫోటో, సంతకాన్ని అప్లోడ్ చేయాలి.

ఆఖరుగా అవసరమైతే అప్లికేషన్ ఫీజు ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలి.

అన్ని వివరాలు పూర్తయ్యాక అప్లికేషన్ సమర్పించాలి.

ఇది పూర్తయ్యాక అభ్యర్థి ఒక ప్రింటౌట్ తీసుకోవడం మంచిది.

ఎన్‌సిసి వారికి బోనస్ మార్కులు

ఎన్‌సిసి సర్టిఫికెట్లు పొందిన వారికి బోనస్ మార్కులు ఉన్నాయి. ఎన్‌సిసి-ఎ,బి, సి సర్టిఫికెట్లను కలిగి ఉన్న అభ్యర్థులకు వరుసగా 2, 3, 5 శాతం బోనస్ మార్కులు లభిస్తాయి. ఈ మార్కులను వారి కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీఈ) స్కోర్‌లకు కలుపుతారు.

ఎంపిక ప్రక్రియ..

కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీఈ): ఇది 2026 ఫిబ్రవరి, ఏప్రిల్ మధ్య జరుగుతుంది. ఈ పరీక్ష ఇంగ్లీష్, హిందీతో పాటు 13 ప్రాంతీయ భాషల్లో జరుగుతుంది.



సాహిత్యం అనేది మానవ ఆత్మకు అత్యంత ఖచ్చితమైన ప్రతిబింబం. రచయిత సత్యం ప్రవక్త మాత్రమే కాకుండా జీవన నిర్మాణకర్తగా ఉండాలి. సాహిత్యం ఉద్దేశ్యం మనిషిని తనను తాను, తన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని అర్థం చేసుకునేలా చేయడమే!

– మాక్సిం గోర్కీ



హలో హలో ఎస్‌ఎఫ్‌ఐ

చదువుతూనే పోరాటం – పోరాటంతోటే చదువు
స్టడీ అండ్ స్ట్రగుల్ – ఆశయాలే రగుల్
//హలో హలో//

లక్షల కోట్ల గొప్పలు – చదువుల బడికే తిప్పలు
కాలేజీలను కట్టరు – కట్టినవైనా నిలపరు
అన్నీ ప్రైవేటు – పీపీపీ రూటు
//హలో హలో//

ర్యాంకులతో ఆర్భాటం – పిల్లలతో చెలగాటం
హోరెత్తే క్యాంపైన్లు – హడలెత్తే క్యాంపస్‌లు
హాస్టళ్లలో హాహాకారం – ప్రాణాలే నిలవని వైనం
//హలో హలో//
దేశభక్తి పేరిట నేడు ద్వేషాలే బోధిస్తారు
హిస్టరీని మిస్టరి చేసి, హిపోక్రసీ పెంచేశారు
క్యాంపస్‌లో క్యాంపులు పెట్టి కక్షలనే నింపేశారు
//హలో హలో//

కాలేజీ యూనియన్లతో నిన్న బడా లీడరైరి
ఇప్పుడొచ్చి విద్యార్థులకు పాలిటిక్సు వద్దంటారు
బూటకాలు చెల్లవ్ సారూ యువశక్తిది ఆగని జోరు
//హలో హలో//

హక్కులకై పోరాడతాం చదువుల చెలరేగుతాం
విద్యార్థుల సత్తా చూపి విజ్ఞానపు వీధులు దాటి
ఈ పతాక ఎగరేస్తాము మా లక్ష్యం సాధిస్తాము
//హలో హలో//

– తెలకపల్లి రవి

కోడ్ల కోలాటం

కొత్తగా తెచ్చిన లేబర్ కోడ్లు
జీతాలకు వాతలేసే రాడ్లు
కష్టజీవి హక్కులు కోసే బ్లేడ్లు
నాలుగైన సవరణల కోడ్లు

ఉద్యోగ కార్మికుల అణచేతల
కార్పొరేట్ల చేతి కొరడాలు
సంఘం సమ్మె నినాదాల
నోరెత్త నివ్వని ఆయుధాలు

తొలగింపులకు స్వేచ్ఛ
అక్రమమంటే ఇకపై శిక్ష
ఇప్పుడే ఎందుకీ ఉచ్చు?
సంపద దోచే రక్షకేగా?

– ఉన్నం వెంకటేశ్వర్లు

మైకం కమ్మిన హృదయాలు

అమ్మ కడుపు కొలనులో చేప పిల్లలా
హాయిగా ఈదులాడేదాన్ని
కుమ్మరించిన నిప్పుల కుంపటి లాంటి
నేల మీదికొచ్చి పడ్డాను

పుట్టి బుద్ధెరిగిన మూన్నాళ్ళకే
అల్లుకుంటున్న ఆశల పూరేకుల్ని
అర్థం పర్థం లేని సంస్కృతీ సాంప్రదాయాల
విషపు గోళ్ళతో విచక్షణారహితంగా
తుంచి పారేసి, పెరుగుతున్నకొద్దీ
పోగేసుకుంటున్న ఆకాంక్షల రెక్కల్ని
పరువూ మర్యాదల పిడి బాకుల్తో
నరికి పోగులు పెట్టడం ఎంత దారుణం!

అయినా, ఆంక్షల ముళ్ళ తీగల్ని
ఆలోచనా జ్ఞానంతో తప్పించుకుంటూ
కామోన్మాద మృగాలు తిరిగే జనారణ్యంలోనే
కాంక్రీట్ వృక్షాల గాలి కదలికల్ని
గుండె నిబ్బరంతో గమనించుకుంటూ
అడ్డు తగుల్తున్న గుంటనక్కల నడ్డి
విరగ్గొడుతూ ముందుకు సాగుతున్నాను

కాలం గంజాయి దమ్ము పీల్చి గీరెత్తిన కోడిపుంజల్లే
గిరికీలు కొడుతుతున్నప్పుడల్లా
నమ్ముకున్నవాళ్ళే నట్టింట్లో, నడి బజార్లో
ఉచ్చం నీచం మరచి వికారపు చేష్టలకు
తెగబడుతుంటే పట్టరాని క్రోధం ఒకపక్క
చెప్పుకోలేని ఖేదం ఇంకోపక్క
నిప్పుల కొలిమిలా మండే నిర్జన ఎడారిలో
కాలుగాలిన ఒంటరి ఒంటెలా
గుండె చెలమ కోసం ఎంత అలమటింత!

తట్టుకోలేక ఓరోజు అమ్మని అడిగేసాను
"ఎందుకమ్మా ఈ మృగాల మందని
కడుపు కోయించుకొని మరీ కంటారు
పురిట్లోనే పీక పిసికేస్తే పీడా పోయేది కదా..!"

అమ్మ అంది , "తప్పు తల్లీ...!
మగాళ్లే లేకపోతే మానవాళికి ఉనికేదీ..!
అయినా, అది వాళ్ళ తప్పు కాదు తల్లీ!
వాళ్లు ఇట్లా కావటం వెనుక ఒక మతం ఉంది
వేయి పడగలు విప్పి బుసలుకొడుతున్న
ఒక బూతు సంస్కృతి ఉంది
గుత్తులు గుత్తులుగా గెలలు వేస్తున్న
గుత్త పెట్టుబడి వ్యవస్థ ఉంది
మత్తు గంజాయి మార్కెట్ ఉంది

ఇదొక విష వలయం తల్లీ!
అన్యాయాన్ని ఎదిరించకుండా
అసమానతల్ని ప్రశ్నించకుండా
సంఘటితం కావలసిన పీడితుల్ని
ఒంటిపిల్లి రాకాసుల్లా మార్చి
ఒకరిపై ఒకరు కత్తులు దూసుకొని
తన్నుకుచచ్చేలా చేసే పన్నాగం వుంది

దీన్నుంచి బయట పడాలంటే...
ఈ మైకం కమ్మిన హృదయాల్లో
మానవీయ జ్యోతుల్ని వెలిగించాలి!
వారి విముక్తితోనే మన విముక్తి
ముడిపడి వుందన్న ఎరుక
మన అడుగుల్లో పిడుగుల్ని మొలిపించాలి!"

అమ్మ మాటల ప్రవాహంలో నా ఆలోచనలు
సుళ్ళుతిరుగుతూ గింగురుమంటున్నాయి!

– పతివాడ నాస్తిక్
94417 24167

పరాయి గడ్డపై వలస వేదన

చరిత్ర

కవి, అనువాదకులు, కథారచయితగా ఉన్నత శిఖరాలధిరోహించిన ప్రసిద్ధ సాహిత్యవేత్త యల్లపు ముకుంద రామారావు. వ్యక్తిగత అనుభవాలు, అనుభూతులు ఆధారంగానే కాక, అమూల్యమైన భారతీయ ఆధ్యాత్మిక, చారిత్రక అంశాల చరిత్ర వస్తువుగా ఎన్నో విలువైన రచనలు చేశారు. అయినా, తన వ్యక్తిగత జీవితానికి సంబంధించి, తన తాతతండ్రుల వలస జీవితాన్ని దాని నేపథ్యాన్ని అక్షరబద్ధం చేయాలన్న తన యవ్వన దశలోని ఆర్తితో, ఎనభయ్యవ పడిలో ఆ కర్తవ్యాన్ని పూర్తి చేసి, కార్యోన్ముఖుడైన నిబద్ధతామూర్తి అనిపించుకున్నారు.

సాధారణంగా ఒక వ్యక్తి వృత్తి, ప్రవృత్తులలో అనూహ్య విజయాలు సాధించిన తర్వాత, తన పూర్వాపరాలు, తన మూలాలు మర్చిపోవడం కద్దు. కానీ, అందుకు భిన్నంగా, తనవారు పడిన కష్టాల పీడకలను, తనదైన వ్యధగా భావించి, ఆనాటి తన పూర్వీకుల వలస వేదనను పరిశోధించే క్రమంలో, లక్షలాది మంది భారతీయుల వలసల వివరాలు, ఆ సేతు హిమాచలం ఆ బ్రిటిష్ ముష్కర పాలకుల దాష్టీకాలు సమగ్రంగా పరిశోధించి తెలుగు పాఠకులకు అందించారు.

"జీవిత చరమాంకానికి చేరుకున్నాను. మీ తాతతండ్రుల వేదనాభరిత గతాన్ని గుర్తు చేసుకుని మీరెందుకు ఆవేదనకు గురికావడం..." అనే భావనతో నా వారసులు ఒక దశలో వారించినా, నేను ఆగలేకపోయాను. ఈనాటి వరకు నా సాహిత్య కృషి ఒక ఎత్తు. అయితే నేను చిరకాలంగా భరిస్తూ వచ్చిన వలస వేదనను అక్షరబద్ధం చేసి, నా పూర్వీకులకు నివాళి అర్పించుకున్నాను. నా జీవిత పరమావధి అదే!" అని ముకుంద రామారావు గారు చెబుతుండగా ఆ గద్గద స్వరంలోని తృప్తి ఎవ్వరికైనా కదిలిస్తుంది. ఈ ప్రస్తావన అంతా ఎందుకంటే... ఆయన అపూర్వమైన కృషి చేసి, ఇటీవల రాసిన "అగమ్య గమ్యాలు" పుస్తకం రచనా నేపథ్యం గురించి.

అది మామూలు రచన కాదు. అపురూప పరిశోధనా గ్రంథం. బహుశా, దేశంలోని ఇతర ప్రాంతాల నుండి లక్షలాది మంది వలస వెళ్ళినా, ఈ చరిత్ర ఏ ఇతర భాషలోనూ రాలేదేమో? ఇతర ప్రాంతాల వారికి, తమ పూర్వీకుల వివరాలు తెలుసుకోవాలనే ఆసక్తి వున్నవారికి, విలువైన సమాచారం అందించారు.

బ్రిటిష్ వలస కాలనీలైన మారిషస్, దక్షిణాఫ్రికా (దర్బాన్, నటాల్) కరేబియన్ దీవులు, ఫిజి, కూలీట్యూడ్, ట్రినిటాడ్ వంటి ప్రాంతాలకు రెండొందల సంవత్సరాలకు పూర్వమే (1835)లో ఈ వలసలు ప్రారంభమయ్యాయి. అన్ని ప్రాంతాలకంటే, ఒక్క మారిషస్‌కే 4 లక్షల 50 వేల పైచిలుకు భారతీయులను ఒప్పంద కూలీలుగా తీసుకుపోయారు బ్రిటిష్ ఏజెంట్లు. మారిషస్‌కు వలస వెళ్ళిన వారిలో ఒక్క బీహార్ నుండే లక్షా 80 వేలమంది తమిళనాడు, కేరళ నుండి లక్షా 13 వేలమంది ఆంధ్ర, తెలంగాణ నుండి 30 వేలమందిని తరలించినట్లు లెక్కలు చూపారు. బహుశా అందుకే ఈనాటికీ మారిషస్‌లో బీహార్ మూలాలున్నవారే, రాజకీయంగా అత్యున్నత పదవులలంకరిస్తున్నారు. అనేకసార్లు ప్రపంచ హిందీ మహాసభలు అక్కడ నిర్వహించారు. తర్వాత రాజకీయ ప్రాబల్యం కలిగినవారు తెలుగువారు. అందుకే 1990లో మూడవ ప్రపంచ తెలుగు మహాసభలు మారిషస్‌లో నిర్వహించారు.

విశాఖ జిల్లా (ఈనాటి అనకాపల్లి జిల్లా) అనకాపల్లి దరి వెంకుపాలెంకు చెందిన సర్ పి.వీరాస్వామి రంగడు 1990లో మారిషస్ తొలి రిపబ్లిక్‌కు గవర్నర్‌గా ఎన్నికయ్యారు. మారిషస్‌లో ఒక ప్రాంతంలో, తొలి వలస కూలీ పాదముద్రలు కలిగిన ఫోటో హృదయాలను కదిలిస్తుంది. బ్రిటిష్ వలస కాలనీలన్నింటిలోనూ, ట్రినిటాడ్‌లో 40 శాతం వలస కూలీలు భూములు సంపాదించుకున్నారు. అలాగే ప్రస్తుతం పరిపాలన కూడా పూర్తిగా ఒకనాటి ట్రినిటాడ్ వలస కూలీల వారసులదే అన్న ముకుంద రామారావు పరిశోధనాంశం భారతీయులకు ఎంతో ఆనందకరమైనది.

ఇక భారతదేశ స్వాతంత్ర్యానికి జరిగిన పోరాటంలో, అగ్రభాగాన నిలిచిన భారత జాతీయ కాంగ్రెస్, వలస కార్మికుల రక్తమాంసాలు పీల్చుకు తిన్న బ్రిటిష్ పాలకులతో, ఈ వలసల దుర న్యాయాల గురించి పోరాటం చేసింది. ఫలితంగా కొన్ని చట్టాలు రద్దు చేయబడ్డాయి. కొన్ని బ్రిటిష్ కాలనీలలో, వలస కూలీలకు కొంత ఉపశమనం కలిగించే కొన్ని చట్టాలు రూపొందాయి.

స్వతహాగా కవి అయిన ముకుంద రామారావు, హిందీ, భోజ్‌పురి భాషలలో, ఈ వలసల హింస గురించి, కూలీలు మొదలు, కవులు కూడా రాసిన కొన్ని కవితలను ఉదహరించారు. ఆ కాలంలో తెలుగులో ఎవరూ స్పందించని వైనాన్ని వివరించారు. ఇంకా, అనేకానేక దృష్టాంతాలు, తారీఖులు, కూలీల వివరాలు తన మేధకు అందుబాటులోకి వచ్చినంత వరకూ, చాలా విలువైన సమాచారాన్ని అందించారు. ముకుంద రామారావు గారి దేహబంధువులైన కొందరు ఇంకా దర్బాన్‌లో వుండడం వలన, వారితో నిరంతరం కొనసాగిస్తున్న సంబంధాల వలన, మరిన్ని వివరాలు సేకరించగలిగారు. అయితే, తనకు చిన్నప్పటినుండీ ఆసక్తి ఉన్నప్పటికీ, తమ పెద్దలు, అక్కడి వారిని అడిగితే, వారు సరిగ్గా స్పందించేవారు కాదు. బహుశా వారు గతాన్ని తలచుకొని, మళ్ళీ ఆవేదనాభరితమైన చరిత్రను ఇతరులతో పంచుకోవడానికి ఇష్టపడేవారు కాదేమోనని రామారావు సమాధానపడేవారు.

ఈ అపురూప రచన 'అగమ్య గమ్యాలు' చదువుతుంటే కళ్ళు చెమర్చకుండా వుండవు. 'లోకంలోని బాధనంతా తన బాధగా మహాకవి శ్రీశ్రీ భావించేవారు' అన్నట్టు, ముకుంద రామారావు, మానవీయ కోణంలో మానవ జీవితాలను అధ్యయనం చేయాలనుకొనే పాఠకులకు మహోపకారం చేసినట్లే. ఇది ఒక విషాద శకం. కానీ కాలం ఎవరి కోసం ఆగదు. దానికి ఉదాహరణగా, రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యంగా విర్రవీగిన బ్రిటిష్ ఈనాడు లెక్కలోకి లేకుండా పోయింది. ఆనాడు వారి దళారీలు, ఏజెంట్లు ఎన్నో విధాలుగా మోసం చేసి, తమ కాలనీలకు తీసుకుపోయిన భారతీయులు కొంతైనా అభివృద్ధి ఫలాలు అందుకుంటున్నారు. ఆ అభివృద్ధికి హేతువు తెలుసుకోవాలంటే ప్రతి పాఠకుడు ఈ పుస్తకం చదివి తీరవలసిందే!



– బి.వి.అప్పారావు
93470 39294

రాజ్‌కుమార్‌కు వాసిరెడ్డి భాస్కరరావు స్మారక పురస్కారం

వరంగల్ ఉమ్మడి జిల్లా అభ్యుదయ రచయితల సంఘం 2025 సంవత్సరానికి ఆచార్య వాసిరెడ్డి భాస్కర రావు స్మారక సాహితీ పురస్కారం కోసం నిర్వహించిన విమర్శా గ్రంథాల పోటీలో బండారు రాజ్ కుమార్ 'తెలంగాణ కవి ముద్ర' ఎంపికైంది. ఈనెల 14వ తేదీ ఆదివారం ఉదయం హన్మకొండలో నిర్వహించు సమావేశంలో రాజ్ కుమార్‌కు రూ.5000 నగదు, జ్ఞాపిక, శాలువతో పురస్కారం ప్రదానం జరుగుతుంది. డా. కాలువ మల్లయ్య, డా. పల్లేరు వీరస్వామి, రాపోలు సుదర్శన్, నిధి (బ్రహ్మచారి), వాసిరెడ్డి కృష్ణారావు పాల్గొంటారు.

– బూర భిక్షపతి, డా. మార్క శంకర నారాయణ

తొలితరం చెస్ క్రీడాకారుడు దర్భా వెంకయ్యపై పుస్తకం

1955లో ఏలూరులో జరిగిన జాతీయ స్థాయి చదరంగ పోటీల్లో మహారాష్ట్రకు చెందిన రామ చంద్ర భార్గవ్ సప్రేతో పాటు తెలుగు వాడైన దర్భా వెంకయ్య కూడా పాల్గొని హెూరాహెూరీతో పాటు సంయుక్త విజేతలుగా నిలిచారు. అయితే రామచంద్ర జీవిత చరిత్ర ఇండియన్ చెస్ హిస్టరీ పేరుతో బయటకు వచ్చింది. వెంకయ్యకు మాత్రం ఎటువంటి గుర్తింపూ రాలేదు. ఈ ఏడాదితో తొలి జాతీయ స్థాయి చెస్ పోటీలు జరిగి 70 ఏళ్లు అయింది. దీన్ని పురస్కరించుకొని దేశంలో తొలితరం చెస్ క్రీడాకారుడైన వెంకయ్య జీవిత చరిత్రను కూడా పుస్తకం రూపంలోకి తీసుకు రావాలని అనుకుంటున్నాం. వారి గురించి తెలిసిన వారు 250 పదాలకు తగ్గ కుండా రాసి వాట్సాప్ నెంబర్‌కు పంపగలరు. వివరాలకు ఎం.రాం ప్రదీప్, తిరువూరు; వాట్సాప్ నెంబరు : 94927 12836

14న 'సోమేపల్లి' పురస్కారాల ప్రదానం

జాతీయస్థాయి చిన్న కథల పోటీలో విజేతలైన వారికి ఈ నెల 14వ తేదిన 'రమ్యభారతి' ఆధ్వర్యంలో గుంటూరు బృందావన్ గార్డెన్స్‌లో గల అన్నమయ్య గ్రంథాలయ మీటింగ్ హాల్లో పురస్కారాల ప్రదానం జరుగుతుంది. సాహితీవేత్త వేముల హజరత్తయ్య గుప్త అధ్యక్షతన జరిగే ఈ సభలో ఆంధ్రప్రదేశ్ తెలుగు, సంస్కృత అకాడమీ ఛైర్మన్ ఆర్.డి.విల్సన్ ముఖ్య అతిథిగా పాల్గొంటారు. ఇంకా చిల్లర భవానీదేవి, శ్రీకంఠస్ఫూర్తి, చిటిపోతు మస్తానయ్య ఆత్మీయ అతిథులుగా పాల్గొంటారు.

– చలపాక ప్రకాశ్, సోమేపల్లి వశిష్ట

13న కుందుర్తి పురస్కార ప్రదానం

ఫ్రీవర్స్ ఫ్రంట్, హెూరు ఆధ్వర్యంలో డిసెంబరు 13న ఉస్మానియా యూనివర్సిటీలో యంగ్ పోయెట్స్ వర్క్ షాప్ జరగనుంది. దియా విఘ్నేశ్‌కు కుందుర్తి పురస్కార ప్రదానం, ఆనవాళ్లు 2024 ఆవిష్కరణ ఉంటాయి. సీతారాం, శీలా సుభద్రాదేవి, కాశీం, శ్రీరాం, అనిల్ డ్యానీ, యాకూబ్, నందిని సిధారెడ్డి పేర్ల రాము, హాతీరాం పాల్గొంటారు. – కుందుర్తి కవిత, సమత

మాడభూషి రంగాచార్య స్మారక సభ

ఈనెల 14వ తేదీ ఆదివారం సాయంకాలం 5.30 గంటలకు హైదరాబాద్ రవీంద్రభారతి సమావేశ మందిరంలో డా. మాడభూషి రంగాచార్య స్మారక సభ జరుగుతుంది. డా. డి.చంద్రశేఖరరెడ్డి గారి అధ్యక్షతన నిఖిలేశ్వర్ 'స్మరణ' (కథా విమర్శ) గ్రంథావిష్కరణ చేస్తారు. డా.ఏనుగు నరసింహారెడ్డి, సుధామ, డా.నాళేశ్వరం శంకరం, డా. బెల్లంకొండ సంపత్ కుమార్, డా.జతిన్ కుమార్ పాల్గొంటారు.

– మాడభూషి లలితాదేవి (కన్వీనర్)

భిన్న స్వరాల ఏకరాగం

సందర్శన

ఇటీవల బోల్పూరు శాంతినికేతన్ సాహిత్య ఉత్సవానికి ఆహ్వానం అందుకోగానే ఎగిరిగంతేసింది నా మనసు. శాంతినికేతన్ అనగానే రవీంద్ర నాథ్ ఠాగూర్, జనగణమన, గీతాంజలి గుర్తుకు వచ్చాయి. గీతాంజలికి ఎన్ని అనువాదాలు వచ్చాయో లెక్కలేదు. రవీంద్రుడు రచించిన అనేక కథలను, నవలలను, కవితలను, పాటలను తెలుగీకరించి తమవిగా చేసుకొన్నాం. కాబూలీవాలా కథ చదివి, నాటకం చూసి తెలుగువారు కన్నీరు కార్చారు. నౌకాభంగం చదివి అయ్యో విధి విలాసం అనుకొన్నారు. తెలుగు వారిది విశాలమైన హదయం. బెంగాలీ సాహిత్యాన్ని, హిందీ సాహిత్యాన్ని అనువదించుకొన్నారు. శరత్ సాహిత్యాన్ని అభిమానించారు. దేవదాసు నవల చదివి తృప్తి పడలేదు. సినిమా తీసి గుండెల్లో గుడి కట్టుకున్నారు. ఇక రవీంద్రుడంటే కేవలం కావ్యాలు మాత్రమే రాసిన కవి కాదు. చదువంటే పుస్తకాల మోతలు. సజనాత్మకత లేని బట్టీ పట్టడాలు, గాలాడని నాలుగు గోడలు, నల్లబల్లలు కాదని ప్రపంచానికి ఆచరణాత్మకంగా చూపేలా పచ్చని చెట్ల మధ్య శాంతినికేతన్ స్థాపించారు. ఆకుపచ్చని తరువులు, ఆనందంగా పాటలు పాడే పిట్టలు, విచ్చుకొంటున్న పూలు, ప్రకతి పాఠశాలలో చదువుకోవడమే అదృష్టం.

అవన్నీ తలచుకుంటూ ఆరోజు నా ప్రయాణం మొదలైంది. విజయవాడలో ఎక్కాల్సిన కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ మధ్యాహ్నం ఒంటిగంటకు రావాల్సింది సాయంత్రం 6 గంటలకు వచ్చింది. మర్నాడు సాయంత్రం 6 గంటలకు హౌరా చేరింది. ఫలితంగా రిజర్వు చేయించుకున్న బోల్పూర్ రైలు తప్పిపోయింది. రాత్రి 8 గంటలకు వేరే రైలెక్కి, గమ్యస్థానం చేరేసరికి రాత్రి 11 గంటలైంది. నా ప్రయాణ వివరాలను ఎప్పటికప్పుడు సభా నిర్వాహకులు అరిందం రాయ్ గారికి చెప్తూనే ఉన్నాను. స్టేషన్లో దిగేసరికి డ్రైవర్‌నిచ్చి టోటో పంపించారు. టోటో అంటే మన ఆటో లాంటిది. ఆ రాత్రి వేళ అపరిచిత వీధుల్లో నక్షత్రాల ఆకాశం కింద ప్రయాణం. ఎట్టకేలకు రిసార్ట్‌లో దింపి వెళ్ళిపోయాడు డ్రైవర్. నేను వచ్చానని అరిందమ్ రాయ్ గారికి చెప్పగానే మీటింగ్ జరిగే రిసార్ట్ అది కాదన్నారు. మళ్ళీ డ్రైవర్ వచ్చి ఆనంద రిసార్ట్‌లో దింపేసరికి కేలండర్లో తేదీ మారిపోయింది. తిని పడుకొనేసరికి ఒంటి గంట కొట్టింది.

మర్నాడు పొద్దున్నే తొమ్మిదింటికి గణేష్ వందన దీపం వెలిగించి సాహిత్యోత్సవాన్ని ప్రారంభించారు. డిఫరెంట్ ట్రూత్స్ పత్రిక ఎడిటర్ అరిందమ్ రాయ్ కార్యక్రమం గురించి వివరించారు. ఈ సభలకు దేశం నలుమూలల నుంచే కాకుండా విదేశాల నుంచి కూడా కవులు, కళాకారులు వచ్చి పాల్గొంటున్నారని చెప్పారు. ఉదయం కార్యక్రమంలో కలకత్తా హిందీ యూనివర్సిటీ ప్రొఫెసర్ నందిని సాహు చేసిన కీలకోపన్యాసం ముఖ్యమైనది. ఆమె మాట్లాడుతూ "ఈ 21వ శతాబ్దంలో కూడా స్త్రీల పరిస్థితి మారలేదు. వంట పని, ఇంటి చాకిరీ వాళ్ల జీవితాల్లో నుంచి ఇంకా తప్పిపోలేదు. ఎంత చదువుకున్నా, ఉద్యోగాలు చేస్తున్నా ఇంటి చాకిరీ వెన్నాడుతూనే ఉంది." అని చెప్పారు. ఆలోచనాత్మకమైన ఆమె ఉపన్యాసం అందరినీ అలరించింది. ఆ తర్వాత అద్భుతమైన చిత్రకళా ప్రదర్శన జరిగింది. డ్రాయింగ్ బోర్డు మీద రెండు గీతలు గీసినా, రెండు అక్షరాలు రాసినా వాటిని ఓ అద్భుత చిత్రంగా చిత్రించి సౌమిక్ కుమార్ డే సభికులను ఆనందపరవశులను చేశారు.



కలకత్తాలోని సెంట్రల్ లైబ్రరీ వద్ద వ్యాసకర్త

తరువాత ఒరియా సాహిత్యంలో రవీంద్రుని రచనల అనువాదం గురించి ప్రొఫెసర్ భాగ్యశ్రీ అధ్యక్షతన రాజేంద్రపధి మాట్లాడారు. రవీంద్రుని బాల సాహిత్యం గురించి, ఠాగూర్ వైదిక సిద్ధాంతం గురించి మరొక సదస్సు జరిగింది. తర్వాత రంగామతి పుస్తకాన్ని అరిందం రాయ్ ఆవిష్కరించారు. రంగామతి పుస్తకం కిందటి సంవత్సరం సభలో చదివిన కవితల సంకలనం. సభ అనంతరం మర్నాడు ఉదయం విశ్వ భారతి చూడటం అని చెప్పారు. ఆ ప్రకటన గొప్ప ఆనందోద్వేగాన్ని కలిగించింది. తెల్లారి చూడబోయే విశ్వ భారతి గురించి ఊహలు చేస్తూ, కనురెప్పలు మూతపడలేదు. అయితే, తెల్లారి సరదాగా మొదలైన మా ప్రయాణం అంతలోనే నీరు కారిపోయింది. విశ్వభారతి లోపలికి అనుమతించలేదు. రవీంద్రుడి జయంతికి, వర్ధంతికి మాత్రమే తలుపులు తెరుస్తారట. ఆ పచ్చని చెట్ల మధ్య ఆ విశ్వ భారతిని బయట నుంచి చూసి ఆనందించాము. రెండోరోజు కామినే బోడే అధ్యక్షతన జరిగిన సభలో సంగీత డే రవీంద్రుని తాత్వికత గురించి ప్రసంగించారు. మహెజబీన్ హుస్సేన్, సంధ్య జేన్, డా.మనీషా సక్సేనా, మెహర్ పెస్తొంజి, నేనూ పత్ర సమర్పణ చేశాం. నేను రవీంద్రుడు 'నెలవంక'లో రాసిన "అనంత లోకాల సముద్రతీరంలో పిల్లలు కలుసుకుంటారు. ఆకాశంలో మెరుపులు మెరుస్తాయి. తుపాన్ కెరటం హెూరెత్తుతుంది. నీటిలో దారి తప్పి ఓడలు ముక్కలవుతాయి. చావు అపరిచితురాలు. పిల్లలు ఆడుతూనే ఉంటారు తన్మయత్వంలో" వాక్యాలు చదివి, అందులోని తాత్వికతను వివరించాను. ఆనాటి కార్యక్రమంలో గురుదత్ సాహిత్యం గురించి జరిగిన చర్చ అలరించింది. సత్యశ రణ్, శైలజ గంగూలీ గురుదత్ సినిమాల్లో జన రంజకమైన ఎన్నో పాటలు పాడి శ్రోతలను మంత్రముగ్ధులను చేశారు.

ఆనంద రిసార్ట్‌లో జరిగిన ఈ రెండు రోజుల కార్యక్రమం కేవలం సాహిత్యానికి సంబంధించినది మాత్రమే కాదు. కుటుంబ సభ్యులతో వచ్చి తన గిటార్ వాయిద్యంతో సభికులను పరవశింప చేసిన గాయకుడు జర్మనీ నుంచి వచ్చారని తెలుసుకోగానే అంతులేని ఆశ్చర్యం. మరొక రచయిత్రి జపాన్ నుంచి వచ్చారనగానే – కవిత్వానికి, కళలకు ఎల్లలు లేవు అనిపించింది. ఆ తర్వాత విభిన్న ప్రాంతాల నుంచీ వచ్చిన వివిధ భాషా కవులు మహె జబీన్, శరణ్య ఫ్రాన్సిస్, హరి శ్రీనివాస్, భాగ్య శ్రీ, బీనా పాణి మిశ్రా, డా. మనీషా సెక్సేనా, కేతకీ దత్, దేవదూత్, హేమ శ్రీ తదితరులు తమ కవితలను వినిపించారు. నేను "అనగా అనగా ఒక రాజు కథలే ఎప్పుడూ/ అనగా అనగా ఒక రాణి కథ ఎప్పుడు?" అనే కవితను వినిపించాను. ఆ తర్వాత సంధ్యా జేన్ ముగింపు వాక్యాలతో శాంతినికేతన్ సాహిత్య ఉత్సవం ముగిసింది.

ఈ ఉత్సవంలో అస్సాం, ఆంధ్రప్రదేశ్, గుజరాత్, ఒరిస్సా, బెంగాల్, ఢిల్లీ, బెంగళూరు తదితర రాష్ట్రాల నుంచి వచ్చిన ఎందరో కవులను కలుసుకోవటం చాలా ఆనందాన్ని కలిగించింది. ఎవరికివారు అంతకుముందు అపరిచితులైనా ఈ సాహిత్య సమావేశంలో పాల్గొన్నప్పుడు అందరూ ఎంతో కాలం నుంచి పరిచయమైన మిత్రుల్లా కలిసిపోయారు. అందరూ కలిసి ఫోటోలు దిగటం ఫోన్ నెంబర్లు తీసుకోవటం, చివరి రోజు వెళ్ళలేక వెళ్ళటం ఎప్పటికీ మరిచిపోలేను. నిజంగా కులమతాలు మనుషులను విడదీసి గీతలు గీస్తాయి. సాహిత్యం మాత్రం అందర్నీ కలుపుతుంది. ఒకే గూటి పక్షుల్ని చేస్తుంది. ఒకే రాగాన్ని ఆలపిస్తుంది. బోల్పూర్ సాహిత్యోత్సవం తరువాత నేను కలకత్తా వెళ్లాను. అక్కడ విక్టోరియా మ్యూజియం, ఇండియన్ లైబ్రరీ, బిర్లా ప్లానెటోరియం, సైన్స్ సిటీ, కలకత్తా యూనివర్సిటీ చూశాను. ఆ యూనివర్సిటీ గోడల బయట వరుసగా ఉన్న పుస్తకాల షాపుల్ని చూశాను. అక్కడ ఓ షాపులో దొరికిన కమలాదాస్ మై స్టోరీ పుస్తకం చూడగానే ఎగిరి గంతేసాను. అంతకుముందు అది నా దగ్గర ఉండేది కానీ ఆ తరువాత కనిపించలేదు. మళ్లీ కొనాలని ఎన్నో ప్రయత్నాలు చేశాను. ఎక్కడా దొరకలేదు. కె.సచ్చిదానందన్ ముందు మాటలతో కమలాదాస్ ఫోటోతో ఉన్న ఆ పుస్తకాన్ని చూడగానే కలిగిన ఆనందాన్ని మాటల్లో చెప్పలేను. ఇంకా హౌరా వంతెన దగ్గర, బాబూ ఘాట్ దగ్గర ఇంకా అనేక ప్రాంతాల్లో కనిపించిన గంగా నది, పడవల్ని ఒడ్డున కట్టేసిన నది, పెద్ద పెద్ద నౌకలు కొలువుతీరిన విశ్వ మోహిని గంగా నది నా వెంట వస్తున్నట్టే అనిపించింది. అక్కడి నుంచి వచ్చి ఎన్ని రోజులైనా ఇంకా ఇంకా ఎర్రని రంగులో ఆ అందమైన హౌరా స్టేషన్, ప్రశాంతంగా ప్రవహించే గంగానది ఇంకా నా కళ్ళలోనే మెదులుతుంది. ఈ అపురూపమైన సమావేశంలో పాల్గొనడానికి ఆహ్వానించిన అరిందం రాయ్ గారికి, ఈ సమావేశం గురించి తెలిపిన డా. పెరుగు రామకృష్ణ గారికి, కలకత్తాలో చూడాల్సిన వివిధ ప్రదేశాల గురించి చెప్పిన బాలాజి (కలకత్తా) గారికి ధన్యవాదాలు.

– మందరపు హైమవతి
94410 62732

సవరించాల్సిన స్వర కల్పన

కుట్ర దారుల బుల్లెట్లు
కొన్ని శరీరాలను పిల్లనగ్రోవులుగా మార్చేస్తున్నాయి
గాయపడిన ఆది జీవ నాభి
ఊపిరి అందిస్తోంది..
వెదురు పెదాల మీద వెలుతురు సంగీతం!
రక్తనాళాల్లో నుంచి వేడి గాలులు
రాగాలుగా విరజిమ్ముతున్నాయి
పరితపిస్తున్న పత్ర హరితాలు
ప్రకాశించడం ప్రారంభించాయి
దిగుళ్ల నుంచి కొత్త చిగుళ్ళు
మెలమెల్లగా.. తలెత్తుకోవడం!
ధర్మం తప్పని రుతుపవనాలు..
అడవి గర్భం వికసిస్తోంది!
తొలకరి మట్టి పరిమళం నిండా
తొణికిలాడుతున్న ప్రాణవాయువు!
మౌన పొరల్లో బీజాలకు ఒళ్ళు జలదరింపు!
మొలకెత్తడానికి తహ తహ
ఊపిరితిత్తుల కొలిములు
ఉద్యమ కత్తులను సష్టిస్తున్నాయి!
చేత బట్టాల్సిన వాళ్లకి అర్థమైంది
తరతరాల అడవి గాలులకు
దూరం చేస్తున్న వాళ్ళు ఎవరో!
పర్వత చరియలకు
పరాయి వాళ్ళగా మార్చేస్తున్నది ఎవరో!
మూల కణాలను, సజీవ గుణాలను అంతం చేసే కుట్ర,
అర్థమయిపోతోంది!
భాష భగ్నమైపోతోంది!
శ్వాస కలుషితమైపోతోంది!
తుడుం.. విల్లూ.. డప్పూ
పిల్లన్న గ్రోవి.. ధింసా అడుగు..
కొడవలి.. గొడ్డలి.. పార.. బొరిగ.. గోచీలకు
ఒక మ్యూజియం కట్టి
తననే, కాపలాదారులుగా నియమిస్తారని
అర్థమయిపోతోంది!
అడవి, ఇక మన గూడేలకు రక్షించే కంచె కాదు..
వాళ్లకు, కొండలు తప్ప అడవుల అవసరం లేదు
ఖనిజాల అండ పిండ బ్రహ్మాండాల గర్భస్రావాలకు
బాంబులు మోసుకొస్తున్నారని,
మోసపోతున్నామని అర్థమయిపోయింది!
గిరిజనులను పరజనులను చేసే.. పరిపాలక
ఎత్తుగడలను
కొత్త తరానికి అక్షరాలుగా దిద్దించి చెప్పాలి!
పాటలుగా, పాఠాలుగా నేర్పించాలి!
తప్పదు.. తప్పదు
పిల్లనగ్రోవిని ఎలక్ట్రానిక్ పరికరంగా మార్చేస్తున్నప్పుడు..
పోడుమంటల గానం
వేకువ జామునే వినిపించాలి!
సవరించాలి తప్పదు
అనాది స్వరకల్పన!

– నల్లి ధర్మారావు
76609 67313

రైతులకు నష్టం కలిగించే చట్టాలు చేయొద్దు

- రైతు సంఘాల నేతల డిమాండ్
- విత్తన, విద్యుత్ బిల్లుల ప్రతులను దహనం చేసి నిరసన

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

కేంద్ర ప్రభుత్వం రైతులకు నష్టం కలిగించే చట్టాలు చేయరాద్దని, పార్లమెంట్‌లో విత్తన, విద్యుత్ బిల్లుల ప్రతిపాదనలు చేసే ఆలోచనలు విరమించుకోవాలని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఏ.రాజశేఖర్, టి.రామ చంద్రుడు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో విద్యుత్ బిల్లు-2025, విత్తన బిల్లు-2025ను ఆమోదించేందుకు తెచ్చిన ప్రతిపాదనలను వ్యతిరేకిస్తూ అఖిల భారత కిసాన్ సభ, సంయుక్త కిసాన్ మోర్చ పిలుపు మేరకు ఆదివారం నంద్యాల జిల్లా కేంద్రంలో రైతు సంఘాల ఆధ్వర్యంలో బిల్లుల ప్రతులను దహనం చేసి నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఏ.రాజశేఖర్, టి.రామ చంద్రుడు, ఎఐకెఎస్ జిల్లా కార్యదర్శి సోమన్న, రైతు కూలీ సంఘం నాయకులు చౌడప్పలు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన విత్తన బిల్లు-2025 పూర్తిగా ప్రైవేటు, కార్పొరేట్ విత్తన కంపెనీలకు అనుకూలంగా, రైతులకు, రైతుల ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఉందన్నారు. ఈ బిల్లు చట్టం రూపంలోకి వస్తే భారత వ్యవసాయానికి కీలకమైన విత్తనాలపై ప్రైవేట్, కార్పొరేట్ కంపెనీల పెత్తనం పెరుగుతుందని తెలిపారు.




హరికిషన్ సింగ్ సుర్జీత్ 17వ వర్ధంతి సభకు హాజరైన జనం, సభలో మాట్లాడుతున్న ఎంఎ బేబీ, వేదికపై క్యూబా రాయబారి తదితరులు

హరికిషన్ సింగ్ సుర్జీత్ వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లాలి

- ఎంఎ బేబీ పిలుపు

చండీగఢ్ : హరికిషన్ సింగ్ సుర్జీత్ పోరాట వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లాలని సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబీ పిలుపునిచ్చారు. పంజాబ్ జలంధర్ సమీపంలోని బుందేల్‌లో ఆదివారం నిర్వహించిన హరికిషన్ సింగ్ సుర్జీత్ 17వ వర్ధంతి సభలో బేబీ ప్రసంగించారు. కార్మికుల, గ్రామీణ పేదల, రైతుల జీవనోపాధి సమస్యలపై సమరశీల పోరాటాలకు సుర్జీత్ నాయకత్వం వహించారని, ఈ వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో సుర్జీత్ పాత్రను బేబీ తన ప్రసంగంలో ప్రముఖంగా ప్రస్తావించారు. భారత్‌లో క్యూబా రాయబారి జువాన్ కార్లోస్ మార్సన్ అగ్యిలేరా, సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు నీలోత్పల్ బసు, పంజాబ్ పార్టీ కార్యదర్శి సుఖ్‌విందర్ సింగ్ సెఖోన్, ఇతర సీనియర్ నాయకులు, వేలాదిమంది ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పంజాబ్ రాష్ట్ర కమిటీ తరుపున క్యూబా సంఘీభావ నిధి కోసం ఆ దేశ రాయబారికి రూ.5 లక్షల చెక్కును బేబీ అందజేశారు.

మహారాష్ట్రలో రోడ్డు ప్రమాదం

- ఆరుగురు మృతి



ముంబయి : మహారాష్ట్రలోని నాసిక్ జిల్లాలో ఆదివారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు మృతి చెందారు. సప్తశృంగీ ఆలయానికి వెళుతుండగా, ఘాట్ రోడ్డులో అదుపు తప్పిన ఇన్నోవా కారు 800 అడుగుల లోయలో పడిపోయింది. దీంతో ఘటనాస్థలంలోనే ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. సాయంత్రం 4 గంటలకు భవారి వాటర్స్ సమీపంలో ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు వెల్లడించారు. ఇరుకైన ఘాట్‌లో ఓవర్‌టేక్ ప్రయత్నంలో కారు డ్రైవర్ వాహనంపై నియంత్రణ కోల్పోవడంతోనే ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు ప్రాథమిక విచారణలో తెలిపారు. మృతులంతా పటేల్ కుటుంబానికి చెందినవారని, అత్యంత దగ్గర బంధువులని పేర్కొన్నారు. ఘటనపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు.

పనిగంటలు ముగిసిన తర్వాత... నో కాల్స్... ఇ మెయిల్స్

- లోక్‌సభలో ప్రయివేటు బిల్లు



న్యూఢిల్లీ : ఆఫీసు పనివేళలు దాటిన తర్వాత ఉద్యోగులకు ఫోన్ కాల్స్ చేయడం, ఇ మెయిల్స్ పంపడం వంటి పనులు చేయకుండా నిరోధించేందుకు ఉద్దేశించిన ప్రయివేటు బిల్లు లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఏ అంశం పైన అయినా ప్రభుత్వ చట్టం అవసరమని భావించే లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు ఎవరైనా ప్రయివేటు బిల్లును ప్రవేశపెట్టవచ్చు. ప్రతిపాదిత చట్టంపై ప్రభుత్వం స్పందించిన తర్వాత అలాంటి బిల్లులను చాలా వరకూ ఉపసంహరించుకుంటారు. తాజాగా ఎన్‌సిపి సభ్యురాలు సుప్రియా సూలే 'రైట్ టు డిస్‌కనెక్ట్' బిల్లును లోక్‌సభలో శుక్రవారం ప్రవేశపెట్టారు. ఉద్యోగుల సంక్షేమం కోసం ఓ సంస్థను ఏర్పాటు చేయాలని ఆమె ఆ బిల్లులో కోరారు. ఆఫీసు పనివేళలు ముగిసిన తర్వాత, సెలవు దినాలలో పనికి సంబంధించిన కాల్స్, ఇ మెయిల్స్‌కు ఉద్యోగులు స్పందించనక్కరలేదని ఈ బిల్లు చెబుతోంది.

ఇదే తరహా బిల్లును ఆస్ట్రేలియా గత సంవత్సరం ఆమోదించింది. మన దేశంలో కూడా పనిని, కుటుంబ జీవితాన్ని సమతూకం చేసుకోవాల్సిన అవసరం ఉన్నదని పలు సంస్థలు సూచిస్తున్నాయి. పూనేకు చెందిన 26 ఏళ్ల యువ ఉద్యోగి అన్నా సెబాస్టియన్ పెరయిల్ గత సంవత్సరం జులైలో తీవ్రమైన పని ఒత్తిడిని భరించలేక ఆత్మహత్యకు పాల్పడిన సంగతి తెలిసిందే. దీనిపై ఉద్యోగ, కార్మిక సంఘాల నుంచి తీవ్ర ఆందోళన వ్యక్తమైంది. ఆస్ట్రేలియాలో గత ఏడాది ఆమోదించిన చట్టం ప్రకారం పనిగంటలు ముగిసిన తర్వాత ఉద్యోగులు కాల్స్, ఇ మెయిల్స్‌ను నిరాకరించవచ్చు.

సర్వేలో ఏం తేలిందంటే...

మన దేశంలో కూడా ఈ విధానాన్ని అవలంబించాలన్న డిమాండ్ ఊపందుకుంటోంది. గత సంవత్సరం గ్లోబల్ జాబ్ వేదిక నిర్వహించిన సర్వేలో దీనికి పెద్ద ఎత్తున మద్దతు లభించింది. 79 శాతం మంది ఉద్యోగులు ఈ చర్యకు మద్దతు తెలిపారు. పనివేళలు ముగిసిన తర్వాత కూడా తమకు తరచూ పనికి సంబంధించిన కాల్స్ వస్తున్నాయని 88 శాతం మంది ఉద్యోగులు చెప్పారు. ఆరోగ్య కారణాలతో సెలవులో ఉన్నప్పు డు, సెలవు దినాలలో సైతం మెసేజ్‌లు వస్తాయని 85 శాతం మంది అన్నారు. ఒకవేళ ఆ కాల్స్‌ను పట్టించుకోని పక్షంలో తమ కెరీర్ అవకాశాలు, భవిష్యత్తులో ప్రమోషన్లు దెబ్బతినే ప్రమాదం ఉందని 79 శాతం మంది ఆందోళన వ్యక్తం చేశారు.

ధాన్యం రైతులను దోచేస్తున్నారు

క్వింటాలుకు 5 నుంచి 10 కిలోలు డిమాండ్
కానరాని కస్టోడియన్ అధికారులు
ఆందోళనలో అన్నదాతలు

ప్రజాశక్తి- డెంకాడ, బొబ్బిలి, జామి

ఈ ఏడాది కూడా ధాన్యం రైతులను మిల్లర్లు దోచుకుంటున్నారు. మిల్లర్ల ఆగడాలు అరికట్టే విధంగా రైతులకు, మిల్లర్లకు సంబంధం లేకుండా చేసి పండించిన ప్రతి ధాన్యపు గింజా కొంటామని, రైతులు మిల్లర్లకు అదనంగా ఒక్క కేజీ కూడా ఇవ్వాల్సిన పని లేదని ప్రభుత్వ పెద్దలతోపాటు అధికారులు చెప్పినా, ఆచరణలో అదనపు ధాన్యం బెడద వెంటాడుతోంది. కస్టోడియన్ అధికారులే దగ్గరుండి చూసుకోవాలని ఉన్నతాధికారులు చెబుతున్నా క్షేత్ర స్థాయిలో వారి జాడ కనిపించడం లేదు. ఫలితంగా మిల్లర్లు రైతులతో బేరసారాలు పెట్టి, క్వింటాలుకు ఐదు నుంచి పది కిలోలు అదనపు ధాన్యాన్ని గుంజుతున్నారు. తాజాగా జరిగిన డిఆర్‌సిలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రే ఈ విషయమై ప్రస్తావించడం గమనార్హం. ఎవరైనా అదనపు ధాన్యం తీసుకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించినా పరిస్థితి యథాతథంగానే ఉంది.

విజయనగరం జిల్లాలో ఈ ఏడాది సుమారు 2.80 లక్షల ఎకరాల్లో వరి సాగైంది. నాలుగు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. అదే స్థాయిలో పంట పండింది. ఇప్పటికే జిల్లా



వ్యాప్తంగా కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. ఈ ఏడాదైనా కొనుగోలు దోపిడీ ఆగుతుందని భావించిన రైతులకు ఆడియాశలే మిగిలాయి. రైతు సేవా కేంద్రాల్లో ట్రక్ షీట్ జనరేట్ అయ్యాక, ఎఫ్‌టిఒ (రవాణాకు అనుమతి) తీసుకొని మిల్లుకు వెళితే, అక్కడ ధాన్యం దించి, ఎకనాలెడ్జ్‌మెంట్ చేస్తే 24 గంటల్లో రైతు ఖాతాలో డబ్బులు పడాలి. ఈ వ్యవహారమంతా మిల్లుల వద్ద కస్టోడియన్ అధికారిలే దగ్గరుండి చూసుకోవాలి. కానీ, జిల్లాలో ఎక్కడా కస్టోడియన్ అధికారులు కానరావడం లేదు. జామి మండలంలో 15 వేల టన్నులు కొనుగోలు లక్ష్యం కాగా, ఇప్పటి వరకు దాదాపు 1800 మెట్రిక్ టన్నులు కొనుగోలు జరిగినట్లు అధికారులు చెబుతున్నారు. కస్టోడియన్ అధికారులు ఎక్కడా కానరావడం లేదని రైతులు వాపోతున్నారు. జామి గ్రామానికి చెందిన చలుమూరి మహేష్ అనే రైతు 60 మెట్రిక్ టన్ను ధాన్యాన్ని గంట్యాడ మండలం శ్రీలక్ష్మి వెంకటేశ్వర మోడరన్ రైస్‌మిల్లుకు తీసుకెళ్లి మూడు రోజులు కావస్తున్నా నేటికీ మిల్లర్లు ఎకనాలెడ్జ్ చేయలేదు. రైతును మిల్లు యజమానితో మాట్లాడుకోవాలని ఒత్తిడి తెస్తున్న పరిస్థితి. ఈ విషయమై జామి సిఎస్‌డిటి మూర్తిని 'ప్రజాశక్తి' వివరణ కోరగా, జిల్లాలో మిల్లుల వద్ద సాంకేతిక లోపం కారణంగా, ఎకనాలెడ్జ్ చేయడంలో కొంత జాప్యం జరుగుతోందని, అయినప్పటికీ సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని చెప్పారు.

క్వింటాలుకు పది కిలోలు అదనం

బొబ్బిలి నియోజకవర్గంలో మిల్లర్లు ధాన్యం రైతులను నిలువునా దోపిడీ చేస్తున్నారు. ధాన్యం మిల్లింగ్ చేస్తే బియ్యం ముక్కలు అవుతున్నాయని సాకుగా చూపి ఈ చర్యకు పాల్పడుతున్నారు. క్వింటాలు ధాన్యానికి పది కిలోల వరకు అదనంగా ఇస్తేనే రైతులు నుంచి సేకరిస్తున్నారు. రైతు సేవా కేంద్రంలో ట్రక్ షీక్ తీసుకుని మిల్లుకు ధాన్యం తీసుకెళ్లిన రైతులు తిరిగి వెనక్కి రాలేక, మిల్లర్లు అడిగిన ధాన్యం అదనంగా ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది. బొబ్బిలి మండలంలోని కింతలివానిపేట, కోమటిపల్లి, కలవరాయి మిల్లులకు ధాన్యం తరలిస్తే క్వింటాలుకు పది కిలోల వరకు అదనంగా ధాన్యం తీసుకుంటున్నారని,గోనె సంచులను తామే సమకూర్చుకోవాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు.

మిల్లరుతో మాట్లాడితేనే తూకం వేస్తారట

నేను జామి నుంచి ఈ నెల రెండో తేదీన శ్రీలక్ష్మి వెంకటేశ్వర మోడరన్ రైస్ మిల్లుకు ధాన్యం తీసుకెళ్లాను. కాటా స్లిప్ ఇవ్వలేదు. ఇప్పటికీ నాలుగు రోజులవుతున్నా తూకం వేసి నాకు రశీదు ఇవ్వలేదు. మిల్లరుతో మాట్లాడుకోవాలని ఫోన్లు వస్తున్నాయి.

సిహెచ్ మహేష్, రైతు, జామి

కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాం

మిల్లర్లు అదనపు ధాన్యాన్ని డిమాండ్ చేస్తున్న వ్యవహారంపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాం. ధాన్యం కొనుగోలులో దోపిడీని అరికట్టే విధంగా అదేశాలు జారీ చేయాలి. లేకుంటే రైతులను సమీకరించి, మిల్లర్ల దోపిడీపై ఉద్యమిస్తాం.

బుద్ధరాజు రాంబాబు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి

అహోబిలం సిఇఒగా రామానుజన్

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ప్రముఖ పుణ్యక్షేత్రమైన అహోబిలం దేవస్థానం చీఫ్ అడ్మిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా విఎల్ఎన్ రామానుజన్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆయన అహోబిలం దేవస్థానం ఇఒగా పని చేశారు. అహోబిలం మఠం 46వ పీఠాధిపతి శ్రీవన్ శఠగోప రంగనాథ యతీంద్ర మహాదేశికన్ స్వామి ఆదేశాల మేరకు ఆయన బాధ్యతలు చేపట్టారు. కార్యక్రమంలో అహోబిలం దేవస్థానం ముద్రకర్త, ప్రధాన అర్చకులు కిడాంబి వేణుగోపాలన్, దేవస్థాన సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

13, 14 తేదీల్లో జెన్ ఎఐ హ్యాకథాన్

ప్రజాశక్తి- విజయనగరంటౌన్

జెఎన్‌టియుజివి, జెన్ యూనివర్సిటీ సంయుక్త ఆధ్వర్యాన ఈ నెల 13, 14వ తేదీల్లో జెన్‌ఎఐ హ్యాకథాన్ ఫర్ నెక్ట్స్ జనరేషన్ జాబ్స్ పేరుతో పోటీలు నిర్వహిస్తున్నట్లు జెఎన్‌టియుజివి వైస్ ఛాన్సలర్ వివి.సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు. జనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో విద్యార్థుల నైపుణ్యాలను పెంపొందించేందుకు హైదరాబాద్‌కు చెందిన జెన్ యూనివర్సిటీతో కలిసి జెఎన్‌టియు క్యాంపస్‌లో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విజేతలకు రూ.లక్ష విలువైన బహుమతులు అందజేస్తామని తెలిపారు.

విద్వేష ఛానళ్లపై ఎన్‌బిడిఎస్‌ఎ మౌనం

- ఐదేళ్లలో 416 ఫిర్యాదులు
- 12 జరిమానాలతో సరి!
- సంస్థ పనితీరుపై సర్వత్రా ఆందోళన

భారత్‌లో టివి న్యూస్ ఛానెళ్ల ప్రవర్తన, తీరుపై గత ఐదేళ్లలో 400కు పైగా ఫిర్యాదులు వచ్చినా.. 12 సందర్భాల్లోనే జరిమానాలు విధించబడ్డాయి. న్యూస్ బ్రాడ్‌కాస్టింగ్ డిజిటల్ స్టాండర్డ్స్ అథారిటీ (ఎన్‌బిడిఎస్‌ఎ) ప్రభావం తగ్గిందనడానికి ఇది ఒక ఉదాహరణ. నిబంధనలను ఉల్లంఘించాయని పలు ప్రధాన వార్తా ఛానెళ్ల ప్రసారాలపై ఎన్‌బిడిఎస్‌ఎ ముందుకు ఫిర్యాదులు వచ్చినా.. తప్పు చేసిన ఛానెళ్లపై సంస్థ తీసుకున్న చర్యలు నియమాలను గుర్తు చేయడానికే పరిమితమయ్యాయి. కఠినమైన శిక్షలు అరుదుగా కనిపించాయి. దీంతో సంస్థ పనితీరుపై మేధావులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



న్యూఢిల్లీ : భారత్‌లో టెలివిజన్ న్యూస్ రంగానికి స్వీయ నియంత్రణ సంస్థగా ఏర్పడిందే ఎన్‌బిడిఎస్‌ఎ. నిబంధనలను ఉల్లంఘిస్తూ, విద్వేష, విభజన విషాలను చిమ్ముతున్న వార్తా కథనాలను ప్రసారం చేస్తున్న న్యూస్ ఛానెళ్లపై ఈ సంస్థ ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై మేధావులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో సంస్థ తీరు కొన్ని న్యూస్ ఛానెళ్లకు బలాన్నిస్తున్నదనీ, తమకిష్టమైన రీతిలో అడ్డగోలుగా వార్తా కథనాలను ప్రసారం చేస్తున్నాయని విమర్శిస్తున్నారు.

ఎన్‌బిడిఎస్‌ఎ ట్రాక్ రికార్డ్ ఆందోళనకరంగా ఉంది. 2019 నుంచి ఐదేండ్లలో భారత్‌లోని పలు ఛానెళ్లపై 416 ఫిర్యాదులు నమోదయ్యాయి. నిబంధనలను ఉల్లంఘిస్తూ, ద్వేషాన్ని రగిలేచ్చేలా, మత విద్వేషాలు పెంచేలా, మైనారిటీలను లక్ష్యంగా చేసుకుంటూ ప్రసారాలు చేస్తున్నాయంటూ భారత ప్రధాన టివి ఛానెళ్లపై ఈ ఫిర్యాదులు అందాయి. వీటిలో 12 సందర్భాల్లోనే ఎన్‌బిడిఎస్‌ఎ జరిమానాలు విధించటం గమనార్హం. ఇక ఈ ఏడాది సెప్టెంబర్ వరకు ఈ సంస్థ ముందుకు 26 ఫిర్యాదులు వచ్చాయి. ఇందులో తొమ్మిది కేసుల్లో స్పష్టమైన కోడ్ ఆఫ్ ఎథిక్స్ ఉల్లంఘనలు ఉన్నాయని ఎన్‌బిడిఎస్‌ఎ గుర్తించింది.

హెచ్చరికలకే పరిమితం

తమ ముందుకు వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి, అడ్డగోలుగా ఉన్న వాటికి కఠిన శిక్షలు విధించకుండా ఎన్‌బిడిఎస్‌ఎ హెచ్చరికలకే పరిమితమవుతున్నది. మదర్సాలను ఉగ్రవాద సంస్థలుగా పేర్కొనడం, ముస్లింలపై దుష్ప్రచారాలు, వారిపై ద్వేషం పెరిగేలా ప్రసారాలు, 'థూక్ జిహాద్' అంటూ చర్చలు, ఓటర్లను మత కోణంలో ఆలోచించేలా ప్రోత్సహించే కథనాలు.. ఇవన్నీ ఎన్‌బిడిఎస్‌ఎ దృష్టికి వచ్చాయి. వీడియోలు, కథనాలను తొలగించాలంటూ ఆర్డర్లను (టేక్‌డౌన్ ఆర్డర్స్) జారీ చేయటం వరకే ఇది పరిమితమవుతున్నది. మరికొన్ని సందర్భాల్లో వీడియోలను ఎడిట్ చేయాలంటూ ఆదేశించింది. మిగతావన్నీ నియమాలను గుర్తు చేయడం వరకే పరిమితమైంది. తప్పులను పునరావృతం చేసిన ఛానెళ్లు కూడా జరిమానాలు తప్పించుకున్నాయి.


కఠిన నిబంధనలున్నా...

స్వీయ నియంత్రణ వ్యవస్థకు విశ్వసనీయతను తీసుకురావటం కోసం ఎన్‌బిడిఎస్‌ఎకు కఠినమైన అధికారాలు ఉన్నాయి. రూ.25 లక్షల వరకు జరిమానా, ఒక వారం ప్రోగ్రామ్ సస్పెన్షన్, యాంకర్‌ను ఒక నెల పాటు 'ఆఫ్-ఎయిర్' చేయడం, క్షమాపణల కోరటం వంటివి ఇందులో ఉన్నాయి. ఇవేవీ అమలు కావడం లేదని, ఇది ఎన్‌బిడిఎస్‌ఎ తన బాధ్యతల నుంచి వైదొలగడమేనని మేధావులు విమర్శిస్తున్నారు.

రెండే గేట్లు.. కలప ఫర్నీచర్

- గోవా క్లబ్ ప్రమాద తీవ్రతకు అవే కారణమన్న పోలీసులు
- కూల్చివేయాలన్న పంచాయతీ నిర్ణయాన్ని అడ్డుకున్నారన్న ప్రెసిడెంట్

గోవా : గోవాలోని ది బిర్చ్ బై రొమియో లేన్ నైట్ క్లబ్‌లో ప్రమాద తీవ్రత పెరగడానికి, 25 మంది ప్రాణాలు కోల్పోవడానికి రెండే గేట్లు ఉండటం, కలప ఫర్నీచర్ వాడటమే కారణమని పోలీసులు తెలిపారు. వీరిలో 23 మంది మృతదేహాలపై కాలిన గాయాలు లేవని, ఇద్దరి మృతదేహాలే బాగా కాలిపోయాయని చెప్పారు. ఆక్సిజన్ కొరత, ఊపిరాడకపోవడం కారణంగానే వీరంతా మరణించారని పేర్కొన్నారు. 17 మృతదేహాలకు పోస్ట్‌మార్టం నిర్వహించామని, ఆరుగురి మృతదేహాలను అంత్యక్రియల కోసం వారి కుటుంబసభ్యులకు అప్పగించామని వెల్లడించారు. ఈ ఘోర ప్రమాదానికి భద్రతా వైఫల్యం కూడా కారణమని దర్యాప్తులో తేలింది. దాంతో.. భద్రతా నియమాలను ఉల్లంఘించినందున నెట్ క్లబ్ చీఫ్ జనరల్ మేనేజర్ రాజీవ్ మోదక్, జనరల్ మేనేజర్ వివేక్ సింగ్, బార్ మేనేజర్ రాజీవ్ సంఘానియా, గేట్ మేనేజర్ రియాన్షు ఠాకుర్‌లను పోలీసులు అరెస్టు చేశారు. క్లబ్ యజమానులు సౌరభ్ లూథ్రా, గౌరవ్ లూథ్రాలను త్వరలో అరెస్టు చేస్తామని తెలిపారు. క్లబ్‌లో డ్యాన్సర్ల ప్రదర్శన సమయంలో బాణసంచా పేల్చారని, దానివల్లే మంటలంటుకొని ఉండొచ్చని ఒక ప్రత్యక్ష సాక్షి తెలిపారు. ప్రాంగణంలో తొక్కిసలాట లాంటి పరిస్థితి ఏర్పడిందన్నారు. ఆ సమయంలో దట్టమైన పొగ కమ్ముకుందని, అక్కడున్నవారు ఇరుకైన ద్వారాల నుంచి బయటకు పరుగులు తీసినట్లు చెప్పారు. కాగా, 'ఎలక్ట్రిక్ బాణసంచా'ను పేల్చడం వల్ల మంటలు చెలరేగినట్లు ప్రాథమిక విచారణలో తేలిందని పోలీసులు చెబుతున్నారు.



త్రుటిలో తప్పించుకున్నా : వ్యాపార వేత్త మనోచా

నైట్ క్లబ్‌లో శనివారం రాత్రి జరిగిన బాలివుడ్ మ్యూజికల్ నైట్ పార్టీకి హాజరు కావాల్సి ఉందని, తన స్నేహితులతో కలిసి వేరొక ప్రదేశానికి వెళ్లడంతో ప్రాణాలతో బయటపడ్డానని గోవాలో నివసిస్తున్న న్యూఢిల్లీకి చెందిన వ్యాపార వేత్త మనోచా తెలిపారు. ఈ ప్రమాదం నుంచి బయటపడిన మహిళను కలిసానని, ఆమె ఇద్దరు అక్కచెల్లెల్లు మరణించారని చెప్పారు. రెండు రోజుల క్రింతం నైట్ క్లబ్‌లో హౌస్ కీపింగ్ కార్మికుడిగా చేరిన జార్ఖండ్‌కు చెందిన యువకుడు ప్రాణాలు కోల్పోయాడు.

యాజమాన్యం నిర్లక్ష్యమే కారణం...

క్లబ్ యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని ప్రమాదం నుంచి బయటపడిన వారు, స్థానికులు విమర్శించారు. అగ్ని మాపక యంత్రాలు లేవని, సహాయం లేదని, భద్రతా చర్యలేవీ తీసుకోలేదని స్థానికులు చెప్పారు.

కూల్చివేత నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం తోసిపుచ్చింది : పంచాయతీ ప్రెసిడెంట్

అర్పోరా పంచాయతీ ప్రెసిడెంట్ రోషన్ రెడ్‌కర్ మాట్లాడుతూ క్లబ్‌ను కూల్చివేయాలన్న పంచాయతీ నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం తోసిపుచ్చడం వల్లే ప్రమాదం జరిగిందని అన్నారు. భద్రతా నిబంధనలను ఉల్లంఘించి అడ్డగోలుగా నైట్ క్లబ్‌ను నిర్మించారని చెప్పారు.

పెద్దోళ్ల జోలికి వెళ్లరు...

చేపల పెంపకం చేపట్టాల్సిన ప్రాంతంలో నైట్ క్లబ్ నిర్మించారని స్వచ్ఛంద సంస్థ కలంగూట్ కలెక్టివ్ సభ్యుడు గ్లెన్ ఫెర్నాండెజ్ చెప్పారు. గోవా నిబంధనల ప్రకారం వ్యవసాయేతర ప్రయోజనాలకు అక్కడి భూములు ఉపయోగించకూడదని, నిబంధనలను ఉల్లంఘించి నైట్ క్లబ్ ఏర్పాటు చేశారని చెప్పారు. పేదలు చిన్న పాటి ఇల్లు కట్టుకున్నా కూల్చేస్తారని, పెద్దవాళ్ల జోలికి వెళ్లరని విమర్శించారు.

జాతీయ స్థాయి ఈత పోటీలకు జోత్స్నశ్రీ

ప్రజాశక్తి - వీరవాసరం

ఈనెల 27వ తేదీన హైదరబాద్‌లో జరుగుతున్న జాతీయ స్థాయి ఈత పోటీలకు వీరవాసరం మండలానికి చెందిన కోరశిఖ జోత్స్న ఎంపికైనట్లు ఆమె తండ్రి కోరశిఖ వీర్రాజు ఆదివారం తెలిపారు. ఎపి స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధర్యాన నరసారావుపేట స్విమ్మింగ్‌పూల్‌లో 7వ తేదీన నిర్వహించిన వాటర్‌పోల్‌లో పాల్గొని ఆమె అర్హత సాధించనట్లు ఆమె తండ్రి తెలిపారు. తనతో పాటు మరో పదకొండు మంది ఆంధ్రప్రదేశ్ నుండి ఎంపికైనట్లు జోత్స్న తెలిపింది. వీరంతా సౌత్‌జోన్ తరుపున జాతీయ స్థాయి ఈత పోటీల్లో పాల్గొనడం జరుగుతుందని జోత్స్న తెలిపింది. జోత్స్న స్వస్థలం వీరవాసరం మండలం పెర్కిపాలెం గ్రామం. ప్రస్తుతం జోత్స్న భీమవరం తిరుమల కళాశాలలో మొదటి సంవత్సర బైపిసి చదువుతుంది.

బహుజన టీచర్స్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

బహుజన టీచర్స్ అసోసియేషన్ (బిటిఎ) నూతన కార్యవర్గం ఎన్నికైంది. ఆ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా బి రామారావు, చిట్టేటి రమేష్ ఎన్నికయ్యారు. గౌరవాధ్యక్షులుగా కె మోహనరావు, అసోసియేట్ అధ్యక్షులుగా పి వెంకటరావు, పల్లం వేణుగోపాల్, బి మనోజ్‌కుమార్, ట్రెజరర్‌గా ఎంఆర్ చక్రవర్తి, మహిళా కార్యదర్శిగా వి మేరీ స్టెల్లా, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎం ముసలయ్య, పి ఆదినారాయణ, ఎల్ ఆంటోని తదితరులు ఎన్నికైనట్లు అసోసియేషన్ ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించింది. సంఘం వ్యవస్థాపకులు ఎన్ రమణయ్య ఎన్నికల అధికారిగా, జాతీయ ప్రధాన కార్యదర్శి జి ఆంజనేయులు ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించారని పేర్కొంది.

జలపాతంలో పడి యువకుడు మృతి

ప్రజాశక్తి- సాలూరు (పార్వతీపురం మన్యం జిల్లా)

మండలంలోని కురుకూటి సమీపంలో ఆదివారం అడపరాయి జలపాతంలో పడి యువకుడు దుర్మరణం చెందాడు. రామభద్రపురంలోని మారుతీనగర్‌కు చెందిన గర్భాపు హరి(24) మరి కొంతమంది యువకులతో కలిసి జలపాతానికి వచ్చారు. అక్కడ విపరీతమైన రద్దీ ఉండడంతో జలపాతం దిగువున యువకులంతా కలిసి స్నానం చేస్తున్నారు. హరి లోతు ఎక్కువ ఉన్న ప్రాంతానికి వెళ్లడంతో బయటకు రాలేకపోయారు. నీటిలో మునిగి అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న సాలూరు రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికి తీశారు. పోస్టుమార్టం నిమిత్తం సాలూరు ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు రూరల్ ఎస్ఐ నరసింహమూర్తి తెలిపారు.

అంతరాష్ట్ర నేరస్తుడు అరెస్టు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: వరుస అత్యాచారాలు, హత్యాయత్నాలు, డ్రగ్స్ అక్రమ వ్యాపారంలో నిందితుడైన మోస్ట్ వాంటెడ్ అంతరాష్ట్ర నేరస్తుడిని గుడిపాల పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. యువతులను, భయబ్రాంతులకు గురిచేసి, బలవంతపు అపహరణ చేసి లైంగిక దాడులకు పాల్పడేవాడు. పెప్పర్ స్ప్రే, ఇనుప రాడ్ వంటి ప్రమాదకర ఆయుధాలతో దాడులు చేస్తాడు. గంజాయి, డ్రగ్స్ అక్రమ వ్యాపారస్తుల నుంచి నెల మామూలు వసూలు, బెదిరింపులు, సెటిల్మెంట్లు వంటివి నిర్వహిస్తూ ఉంటాడు. అంతరాష్ట్ర నేరస్తుడు జాన్ అలెగ్స్‌పై తమిళనాడు రాష్ట్రంలో 50కి పైగా కేసులు, చిత్తూరులో 1 కేసులు ఉన్నాయి. 2025వ సంవత్సరం డిసెంబర్ 3న గుడిపాల పోలీస్ స్టేషన్‌లో గుడిపాల మండలం అనుపు ఎస్టీ కాలనీకి చెందిన ఒక మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అలెక్స్ అనే వ్యక్తిపై అత్యాచారం కేసుతో పాటు ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయడం జరిగింది. దర్యాప్తులో భాగంగా గాయపడిన బాధితురాలిని చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. జిల్లా ఎస్‌పి ఆదేశాల మేరకు చిత్తూరు సబ్ డివిజన్ డిఎస్‌పి సాయినాథ్, వెస్ట్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ నాయుడు, గుడిపాల ఎస్ఐ రామ్మోహన్ సిబ్బంది సంయుక్తంగా చేపట్టిన ప్రత్యేక ఆపరేషన్‌లో ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు తొమ్మిదిన్నపాలెం క్రాస్ వద్ద నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. 2010 సంవత్సరంలో తొలి నేరంతో జైలుకు వెళ్లిన నిందితుడు అప్పటి నుంచి దొంగతనాలు, రాబరీలు, దారిదోపిడీలు, హత్యలు, హత్యాయత్నాలు, గంజాయి, డ్రగ్స్, కొట్లాట కేసుల్లో పాల్గొంటూ కరుడుగట్టిన నేరస్తుడిగా మారాడు. కాట్పాడి పోలీస్ స్టేషన్‌లో ఇతనిపై రౌడీషీట్ కూడా ఉన్నట్లు విచారణలో వెల్లడైంది. 2018లో గ్యాంగ్ వార్ నేపథ్యంలో హత్యాయత్నం నుంచి తప్పించుకున్న ఇతడు నాలుగు రోజులకే ప్రత్యర్థి గ్యాంగ్‌కు చెందిన వ్యక్తిని హతమార్చాడు. ప్రస్తుతం ఇతనిపై తమిళనాడు రాష్ట్రంలోని వివిధ పోలీస్ స్టేషన్లలో 50కు పైగా కేసులు, చిత్తూరు జిల్లాలో ఒక కేసు ఉన్నట్లు నిర్ధారణ అయింది. 2023లో జైలు నుంచి విడుదలైన తరువాత, పోలీసుల నుంచి తప్పించుకునేందుకు గుడిపాల మండలానికి చేరుకున్న ఇతడు, అనుపు ఎస్టీ కాలనీకి చెందిన దీపక్ కుటుంబంతో పరిచయం పెంచుకొని, అతని కుమార్తెపై బలవంతపు ప్రేమపేరుతో బెదిరింపులకు పాల్పడి, అడవిలోకి తీసుకెళ్లి గత సంవత్సరం కాలంగా అత్యాచారాలకు పాల్పడినట్టు వెల్లడైంది. కరుడుగట్టిన నేరస్తుడిని ప్రాణాలకు తెగించి పట్టుకున్న గుడిపాల ఎస్ఐ రామ్మోహన్ వారి సిబ్బందిని జిల్లా ఎస్పీ తుషార్ డూడి ప్రత్యేకంగా అభినందించారు.

రెవెన్యూలో తిష్టవేసిన సమస్యలు

- పిజిఆర్‌ఎస్‌కు ఫిర్యాదుల వెల్లువ
- టిడిపి కార్యాలయంలోనూ విన్నపాలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో రెవెన్యూ శాఖను ప్రక్షాళన చేసి భూ సమస్యల పరిష్కారానికి విశేష కృషి చేస్తున్నామని ప్రభుత్వ పెద్దలు చెబుతున్నా..క్షేత్రస్థాయిలో సమస్యలు 'ఎక్కడ వేసిన గొంగడి..' చందాన తిష్టవేశాయి. ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్ఎస్) ద్వారా ప్రభుత్వానికి చేరుతున్న ఫిర్యాదులోల అత్యధికం రెవెన్యూ శాఖకు సంబంధించినవే కావడం పరిస్థితికి అద్దం పడుతోంది. దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలు సైతం క్షేత్రస్థాయిలో పరిష్కారం కావడం లేదంటూ రైతుల్లో ఆందోళన నెలకొంది. భూములు రీసర్వే జరిగిన గ్రామాల్లో సైతం భూ వివాదాలు తగ్గకపోవడానికి ప్రధానంగా జాయింట్ ఎల్‌పిఎమ్‌లే కారణమని అన్నదాతలు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో పెండెన్సీని తగ్గించేందుకు సాధా బైనామా (అన్ రిజిస్టర్డ్ సేల్ డీడ్స్) భూముల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం గడువును మరోసారి పొడిగించింది. ఫారం -10 ద్వారా దరకాస్తులు చేసుకునేందుకు చిన్న, సన్నకారు రైతులకు 2027 డిసెంబరు 31 వరకు గడువు తేదీని పెంచింది. ఈ దరకాస్తులను రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండల తహసీల్దార్ కార్యాలయాల్లో స్వీకరించనున్నారు. చిన్న చిన్న విషయాలను అడ్డుపెట్టుకుని క్షేత్రస్థాయిలో ఫైళ్లను క్లియర్ చేయకపోవడమే కారణమని ప్రభుత్వానికి నివేదికలు



అందాయి. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం సాదాబైనామాలోపై గడువును పెంచక తప్పని పరిస్థితి ఏర్పడింది. భూములు రీ సర్వే జరిగిన గ్రామాల్లో భూ విస్తీర్ణంలో తేడాలను సరిదిద్దాలని రైతులు పదేపదే మొరపెట్టుకుంటున్నా..పరిష్కరించే నాధుడే కనిపించడం లేదు. పిజిఆర్ఎస్ ఫిర్యాదులకు సైతం పరిష్కారాలు లభించకపోవడంతో బాధిత రైతులు ఇప్పుడు అధికార టిడిపి, కూటమి భాగస్వామ్య పక్షం జనసేన కార్యాలయాల చుట్టూ తిరుగుతుండటం గమనార్హం.

గుంటూరు జిల్లా మంగళగిరిలోని టిడిపి కేంద్ర కార్యాలయంలో ప్రజా వినతుల దినోత్సవం రోజున కూడా పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు రెవెన్యూశాఖకు సంబంధించినవే. అలా అందిన ఫిర్యాదుల్లో కొన్ని ఇలా ఉన్నాయి. తమ గ్రామంలోని సర్వే నెంబరు 210లో 0.85 సెంట్ల భూమి తనకు ఉంది. 2001లో పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరు చేసినప్పటికీ రీ సర్వేలో ఈ భూమి 0.85 సెంట్లు మాత్రమూ చూపించారని, సరిచేయమని ఎన్ని సార్లు రెవెన్యూ అధికారుల చుట్టూ తిరిగిన ఫలితం లేక పోయిందంటూ ఎన్‌టిఆర్ జిల్లా కంచికచర్ల మండలం చెవిటికల్లు గ్రామానికి చెందిన రంగమ్మ మంత్రి కొల్లు రవీంద్రకు ఫిర్యాదు చేసింది. పశ్చిమగోదావరి జిల్లా పాలకోడేరు మండలం భీమవరానికి చెందిన త్రివేణి మాట్లాడుతూ తన తల్లిదండ్రులు సర్వే నెంబరు 799/1ఎలో 20 సెంట్ల భూమి తనకు రాసి ఇచ్చారని అందులో 10 సెంట్లు మాత్రమే ఆన్‌లైన్ చేశారని మిగిలిన 10 సెంట్లు ఆన్‌లైన్ చేయమని అడుగుతున్నా పట్టించుకునే వారే లేక పోయారని ఆమె వాపోయారు.

భూముల సమస్యలు పరిష్కరించకపోవడం, వెబ్‌ల్యాండ్‌లో పూర్తి స్థాయి విస్తీర్ణం నమోదు చేయకపోడంతో రైతులు బ్యాంకుల నుంచి రుణాలు తీసుకోవడానికి నానా ఇబ్బందులు పడుతున్నారు. జాయింట్ ఎల్‌పిఎమ్‌ల సమస్య పూర్తిస్థాయిలో పరిష్కరించకపోవడంతో ఆయా భూ యజమానులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. ఇకనైనా భూ సంబంధిత సమస్యలను తక్షణమే పరిష్కరించేలా ఏర్పాట్లు చేయాలని ప్రజలు విన్నవిస్తున్నారు.

విద్యార్థులను చితకబాదిన ఉపాధ్యాయుడు

ప్రజాశక్తి - ఓజిలి : తిరుపతి జిల్లా, ఓజిలి మండలం, వాకాటివారికండ్రిగ, ఆదర్శ ఏకలవ్య గురుకుల పాఠశాలలో కొంతమంది ఉపాధ్యాయులు విలువలు మరిచి విచక్షణ రాహితంగా ప్రవర్తిస్తూ, గౌరవప్రదమైన ఉపాధ్యాయ వత్తికి కళంకంగా మారుతున్నారు. చిన్నపిల్లలని కూడా చూడకుండా ఒక్కరిద్దరు చేసిన తప్పిదానికి కోపోధృక్తుడైన ఒక ఉపాధ్యాయుడు హాస్టల్‌లో ఉంటూ చదువుతున్న పిల్లలందరినీ చితకబాదిన సంఘటన గురుకుల పాఠశాలలో చోటుచేసుకుంది.

ఏడవ తరగతి చదువుతున్న 20 మంది విద్యార్థులను డ్రిప్ పైపుతో ఓ ఉపాధ్యాయుడు చితకబాది పిల్లలను గాయాల పాలు చేశాడు. ఆదివారం విద్యార్థులను చూసేందుకు వచ్చిన వారి తల్లిదండ్రులకు ఈ విషయం తెలియడంతో పాఠశాల వద్ద ఆందోళన చేశారు. ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఓజిలి పోలీస్ స్టేషన్లో ఉపాధ్యాయుడు అరుణ్ కుమార్, హిందీ టీచరు హరికృష్ణపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఓజిలి ఎస్సై తెలిపారు. ఈ సంఘటనపై ప్రజాసంఘాలు తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తూ తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ట్రైబల్ వెల్ఫేర్ కార్యదర్శి గౌతమ్ మేనన్, వైస్ ప్రిన్సిపల్ అరుణ్ కుమార్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు ప్రిన్సిపల్ ద్వారా తెలియజేశారు.

ఉపాధ్యాయులతోనే శాస్త్రీయ సమాజ నిర్మాణం

- మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ ఎం.గేయానంద్



ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

శాస్త్రీయ దృక్పథం కలిగిన సమాజ నిర్మాణం ఉపాధ్యాయులతోనే సాధ్యమవ ౖతుందని జెవివి రాష్ట్ర గౌరవ సలహాదారులు, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ ఎం.గేయానంద్ అన్నారు. జన విజ్ఞాన వేదిక నగర కమిటీ ఆధ్వర్యంలో నగరంలోని కెఎస్ఎన్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ సాకే భాస్కర్ అధ్యక్షతన ఉపాధ్యాయులతో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథం, శాస్త్రీయ ఆలోచన పెంపొందించడమే లక్ష్యంగా జన విజ్ఞాన వేదిక పని చేస్తుందన్నారు. అందుకు ఉపాధ్యాయుల సహకారం ఎంతో అవసరమన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా ప్రతి సంవత్సరం జెవివి నిర్వహించే చెకుముకి సైన్స్ సంబరాల్లో నాలుగు లక్షలకుపైగా విద్యార్థులు పాల్గొంటారని, ప్రభుత్వం అధికారికంగా నిర్వహించే పరీక్షల తర్వాత అధికంగా పాల్గొనేది చెకుముకి సైన్స్ కార్యక్రమంలోనని తెలిపారు. ఉపాధ్యాయుల సహకారంతోనే ఇది సాధ్యమైందన్నారు. శాస్త్రీయ దృక్పథంతో ఆలోచించిన దేశాలే అభివద్ధిలో ముందు స్థానంలో ఉన్నాయని అన్నారు. విద్యార్థులలో మార్పు తీసుకురాగల సామర్థ్యం ఒక ఉపాధ్యాయులకే సాధ్యమని, ఆ మార్పు శాస్త్రీయ దృక్పథం వైపు ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మానవ హక్కుల వేదిక రాష్ట్ర నాయకులు ఎ.చంద్రశేఖర్, జెవివి రాష్ట్ర కమిటీ సభ్యులు డాక్టర్ పి.ప్రసూన, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వీరరాజు, జిల్లా కోశాధికారి మహమ్మద్ జిలాన్, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ శ్రీనివాసరావు, మ్యాజిక్ కన్వీనర్ ప్రసాద్, నగర అధ్యక్ష కార్యదర్శులు ప్రసాద్ రెడ్డి, తిరుపాల్, నగర కోశాధికారి రామిరెడ్డి, నాయకులు రామకృష్ణ, లక్ష్మీనారాయణ, రాధాకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఐదువేలు ఇస్తేనే పోస్టుమార్టం

- ఏలూరు జిజిహెచ్‌లో అమానుషం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

'ఏలూరు సర్వజన ఆసుపత్రి పోస్టుమార్టం విభాగంలో అత్యంత దారుణమైన పరిస్థితి కొనసాగుతోంది. తమ ధన దాహానికి మృతదేహాలను సైతం వదలని పరిస్థితి నెలకొంది. జాలి, దయ అనేది లేకుండా నిబంధనలకు విరుద్ధంగా చనిపోయిన వ్యక్తికి పోస్టుమార్టం చేసేందుకు అక్కడి వైద్యులు భారీగా డబ్బులు వసూలు చేస్తున్నారంటూ ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పుట్టెడు బాధలో ఉన్న కుటుంబీకులు వైద్యుల తీరు చూసి ఇదేం దారుణమంటూ కన్నీరుమున్నీరవుతున్నారు. నిరుపేదల కుటుంబీకులైతే అడిగినంత డబ్బు సమకూర్చలేక నానాయాతన పడుతున్న పరిస్థితి కొనసాగుతోంది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఎంతో పేరుగాంచిన ఏలూరు జిల్లా ఆసుపత్రి బోధనా ఆసుపత్రి (మెడికల్ కాలేజీ)గా మారిన తర్వాత అక్కడి పరిస్థితులు అత్యంత దారుణంగా మారాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రోడ్డు ప్రమాదాలు, పురుగుల మందు తాగిన కేసులు ఎక్కువగా ఏలూరు సర్వజన ఆసుపత్రికి వస్తుంటాయి. చికిత్స అందించినప్పటికీ ఒక్కోసారి పరిస్థితి వికటించి మరణిస్తున్నారు. అలా మృతి చెందిన కేసుల్లో పోస్టుమార్టం తప్పనిసరి అవుతోంది. మృతుడు స్వస్థలానికి సంబంధించిన విఆర్ఒ, సంబంధిత మండలానికి చెందిన పోలీసులు వచ్చి శవ పంచనామా చేసి రిపోర్ట్‌ను తయారు చేస్తారు. అనంతరం ఆసుపత్రిలోని వైద్యులు పోస్టుమార్టం చేయడం జరుగుతోంది. జిల్లా ఆసుపత్రిగా ఉన్నప్పుడు పోస్టుమార్టానికి సంబంధించి ఎటువంటి ఇబ్బందీ ఉండేది కాదు. బోధనా ఆసుపత్రిగా మారిన తర్వాత పరిస్థితి ఘోరంగా తయారైందంటూ విమర్శలు వినిపిస్తున్నాయి. పోస్టుమార్టం చేసేందుకు చనిపోయిన వ్యక్తి కుటుంబం నుంచి రూ.ఐదు వేల వసూలు చేయడం అంతటా



హాట్‌టాపిక్‌గా మారింది. అడిగినంత డబ్బులు ఇవ్వకపోతే పోస్టుమార్టం చేసేందుకు రాకుండా వైద్యులు మొరాయిస్తున్నట్లు మృతుని బంధువులు చెబుతున్న పరిస్థితి. ఆసుపత్రి లెక్కల ప్రకారం ప్రతినెలా 45 నుంచి 50 వరకూ పోస్టుమార్టాలు జరుగుతున్నాయి. ఒక్కో మృతదేహానికి రూ.ఐదు వేలు వసూలు అంటే దాదాపు రూ.2.50 లక్షలకుపైగా వసూళ్ల ప్రక్రియ సాగుతోంది. ఇదంతా యథేచ్ఛగానే సాగిపోతోంది. మామూలుగా అయితే పోస్టుమార్టం చేసిన తర్వాత మృతదేహాన్ని ప్యాక్ చేయడానికి చాప వంటి కొన్ని వస్తువులు కొనుగోలు చేయాల్సి ఉంటుంది. అందుకు సంబంధించి రూ. 1500 వరకూ ఖర్చవుతోంది. అక్కడి వరకూ ఇవ్వడానికి పెద్దగా ఇబ్బంది లేదు. పోస్టు మార్టం చేసే వైద్యులకు రూ.ఐదు వేలు ఎందుకివ్వాలన్న ప్రశ్న అందరినీ వెంటాడుతోంది. డబ్బులు ఇవ్వకపోతే పోస్టుమార్టం ఆలస్యం కావడం, తర్వాత డెత్ సర్టిఫికెట్ ఇవ్వరన్న భయంతో డబ్బులు ఇస్తున్న పరిస్థితి నెలకొంది.

పోలీసులతో ఒత్తిడి చేసి వసూలు

పోస్టుమార్టం చేసే వద్ద వసూలు అంతా అక్కడికొచ్చిన పోలీసులతోనే వైద్యులు చేయిస్తున్నారంటూ చర్చ సాగుతోంది. ఏదైనా మృతదేహానికి సంబంధించిన ప్రక్రియలో ఎస్ఐ, లేకపోతే ఎఎస్ఐ, హెడ్‌కానిస్టేబుల్ ఎవరో ఒకరు హాజరు కావాల్సి ఉంటుంది. అనేక పని ఒత్తిళ్ల కారణంగా కొన్నిసార్లు ఎస్ఐలు రాలేకపోతున్న పరిస్థితి కొనసాగుతోంది. చనిపోయిన కుటుంబం నుంచి డబ్బులు వసూలు చేసి ఇచ్చే బాధ్యత పోలీసులకే వైద్యులు అప్పగిస్తున్న పరిస్థితి నెలకొంది. ఒకవేళ పోలీసులు నిరాకరిస్తే ఎస్ఐను తీసుకురండని, లేకపోతే ఏదో ఒక కాగితం లేదంటూ ఇబ్బంది పెడుతున్నట్లు తెలుస్తోంది. దీంతో పోలీసులకు సైతం ఏంచేయాలో తెలీక పోస్టుమార్టం చేసే వైద్యులకు డబ్బులు ఇవ్వాలంటూ చనిపోయిన కుటుంబ సభ్యులపై ఒత్తిడి చేస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. డబ్బులు ఇవ్వపోతే పోస్టుమార్టం ప్రక్రియ నిలిచిపోతుందన్న భయం కుటుంబీకులను వెంటాడుతోంది. ఏలూరు సర్వజన ఆసుపత్రిలో పనిచేసే వైద్యులకు రూ. లక్షల్లో వేతనాలు ఉంటాయి. అయినప్పటికీ మృతదేహాలకు పోస్టుమార్టంలో డబ్బులు వసూలు చేయడం అందరినీ తీవ్ర ఆవేదనకు గురిచేస్తోంది. మృతదేహం ప్యాక్ చేయడానికి రూ. రెండు వేలు, పోస్టుమార్టం చేసినందుకు రూ.ఐదు వేలు తప్పనిసరిగా కట్టాల్సిన పరిస్థితి ఉంటుందని చెబుతున్నారు. పోస్టుమార్టం చేసేవద్ద ఎవరికీ డబ్బులు ఇవ్వక్కర్లేదని బోర్డులు పెట్టి, ఎవరైనా డబ్బులు అడిగితే ఈ నెంబర్‌కు ఫిర్యాదు చేయండని అక్కడి అధికారులు ఎందుకు చేయడంలేదో అర్ధంకావడం లేదు. సామాన్య కుటుంబీలకు చెందిన వారైతే డబ్బులు కట్టలేకపోతున్నారు. దీంతో ఊళ్లో గ్రామ పెద్దలు డబ్బులు చెల్లించి మృతదేహాన్ని తీసుకెళ్తున్న పరిస్థితులు కొనసాగుతున్నాయి. దీనిపై జిల్లా ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకోవాలని అంతా కోరుతున్నారు. దీనిపై ఏలూరు సర్వజన ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ హనుమాన్ నాయక్‌ను డబ్బులు వసూలుపై వివరణ కోరగా సూపరింటెండెంట్ వచ్చాక తెలియపరుస్తామని, పోస్టుమార్టానికి డబ్బులు కట్టనవసరం లేదని ఆయన తెలిపారు.

నిబంధనల ప్రకారం కొనుగోలు చేపట్టాలి : కలెక్టర్

- తప్పుడు తూనికల పట్ల ఆగ్రహం
- విజయలక్ష్మి రైస్ మిల్లుకు షోకాజ్ నోటీసు

ప్రజాశక్తి- సీతానగరం (పార్వతీపురం మన్యం జిల్లా)

రైతు నుంచి నిబంధనల ప్రకారం ధాన్యం కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి సిబ్బందికి సూచించారు. పార్వతీపురం మన్యం జిల్లా సీతానగరం మండలం కోట సీతారాంపురం గ్రామాన్ని ఆకస్మికంగా పర్యటించి, ధాన్యం కొనుగోలు ప్రక్రియను, రైతులకు ఎదురవుతున్న సమస్యలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ముందుగా ధాన్యం నూర్పిడి జరుగుతున్న ప్రాంతాన్ని సందర్శించి రైతులు, సిబ్బందితో మాట్లాడారు. ధాన్యాన్ని నిబంధనల ప్రకారం తూకం వేయాలని ఆదేశించారు. గోనె సంచులు, రవాణా సౌకర్యం రైతు సేవా కేంద్రాల నుంచి కల్పిస్తున్నామని అధికారులు వివరించారు. రవాణా ఖర్చు రైతులకే చేరుతోందా, లేదా అని కలెక్టర్ పరిశీలించారు. అనంతరం రైతు సేవా కేంద్రానికి వచ్చి ధాన్యంలో తేమ శాతాన్ని పరిశీలించారు. తేమ శాతం 17 శాతం కంటే తక్కువగా ఉందని, ఎటువంటి సమస్య రాలేదని సిబ్బంది తెలిపారు. ధాన్యం కొనుగోలు అంశం తర్వాత, కలెక్టర్ రైతులతో వ్యవసాయానికి సంబంధించిన అంశాలపై చర్చించారు.

ఈ ప్రాంతం డ్రై ఏరియా కావడంతో రైతులు ఎక్కువ ఇబ్బంది పడకుండా, అధిక ఆదాయం కోసం రబీలో ఉద్యాన పంటల వైపు మొగ్గు చూపాలని సూచించారు. ఈ పంటల వల్ల ఆదాయం పెరుగుతుందని, ఇబ్బంది పడాల్సిన అవసరం ఉండదని వివరించారు. రైతులు తమ బోర్ వెల్స్ సరిగా పడడం లేదని, కాలువ సౌకర్యం కావాలని కలెక్టర్‌ని కోరారు.

రైస్ మిల్లు యాజమాన్యం అవకతవకలపై ఆగ్రహం

బలిజిపేట : మండలంలోని విజయలక్ష్మి రైస్ మిల్లును కలెక్టర్ సందర్శించారు. ఈ మిల్లులో అవకతవకలకు పాల్పడుతున్నట్లు కలెక్టర్ నిర్ధారించారు. ఒక బస్తా 85 కేజీలు వస్తున్నట్లు, రైతులను మోసగిస్తున్నట్లు గుర్తించారు. ట్రక్ షీట్ వాహనానికి మధ్య వ్యత్యాసాలు ఎక్కువగా కనిపిస్తున్నాయని అధికారులపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ రైస్ మిల్లుకు షోకాజ్ నోటీసు ఇవ్వాలని, నిబంధనలను అతిక్రమించిన వారిపై చర్య తీసుకోవాలని ఆదేశించారు. సకాలంలో రైతులకు బిల్లు అకౌంట్లో జమయ్యేలా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా..!

ప్రజాశక్తి-శింగనమల

శింగనమల మండలంలోని తరిమెల గ్రామ సమీపంలో ఉన్న పెన్నానది నుంచి ఇసుక అక్రమ రవాణా ఆగలేదు. రోజూ పదుల సంఖ్యలో ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా ఇసుకను తరలిస్తూ కొంతమంది అక్రమార్కులు దోచుకుంటున్నారు. భారీగా ఇసుక తరలిస్తుండటంతో భూగర్భజలాలు అడుగంటి పోవడంతో నదీ పరీవాహక ప్రాంతాల ప్రజలు, రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఇసుక అక్రమ రవాణాను అరికట్టాల్సి అధికారులు, పోలీసు శాఖ మిన్నకుండిపోవడంతో పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాగా ఆదివారం రాత్రి మైనింగ్ అధికారులు దాడి చేసి హిటాచీని స్వాధీనం చేసుకున్నారు. అయితే స్వాధీనం చేసుకున్న హిటాచీని తరలించకపోవడంతో పలు అనుమా నాలకు తావిస్తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మండలంలో ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

మైనింగ్, పోలీసు శాఖ జాయింట్ ఆపరేషన్

పోలీసులు, మైనింగ్ అధికారులు కలిసి మండలంలోని తరిమెల గ్రామంలో ఇసుక అక్రమ రవాణాపై జాయింట్ ఆపరేషన్ నిర్వహించారు. ఇందులో భాగంగా ఒక హిటాచీ, టిప్పర్‌ను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేసినట్లు సిఐ కౌలుట్లయ్య, ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు.



సైకిల్ ర్యాలీలో పాల్గొన్న అధికారులు

గుంటూరులో మాదక ద్రవ్యాల వ్యతిరేక ర్యాలీ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, వాటిని దరిచేరనివ్వద్దని ఈగల్ విభాగం ఐజి ఆకె రవికృష్ణ కోరారు. 'డ్రగ్స్ వద్దు బ్రో–సైకిల్ తొక్కు బ్రో' పేరుతో గుంటూరులో పోలీసు శాఖ అవగాహన కార్యక్రమం నిర్వహించింది. జిల్లా పోలీసు యంత్రాంగం, ఈగల్ విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీలో పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ర్యాలీ అగ్రభాగాన రవికృష్ణ, జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, జిల్లా ఎస్‌పి వకుల్ జిందాల్, ఈగల్ ఎస్‌పి నగేష్‌బాబు, గుంటూరు కమిషనర్ పులి శ్రీనివాసులు సైకిల్ తొక్కుతూ విద్యార్థులను ఉత్సాహపరిచారు. మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే దుష్ప్రభావాల గురించి ప్రజల్లో అవగాహన కల్పించడానికి "డ్రగ్స్ వద్దు బ్రో – సైకిల్ తొక్కు బ్రో పేరుతో ఈ ర్యాలీ నిర్వహిస్తున్నట్టు అధికారులు తెలిపారు. ప్రజలందరికీ మాదక ద్రవ్యాల దుష్ప్రభావాల గురించి ఒక మేల్కొల్పులా ఇలాంటి అవగాహన ర్యాలీలు రాష్ట్రంలో నిర్వహిస్తున్నట్టు రవికృష్ణ తెలిపారు. నల్లపాడు పోలీస్ స్టేషన్ సమీపంలోని టిడ్కో గృహాల వద్ద నుండి ప్రారంభమైన ర్యాలీ స్వర్ణభారతి నగర్, జెకెసి కళాశాల,గుజ్జనగుండ్ల సర్కిల్, స్వామి థియేటర్ సెంటర్, టిజెపిఎస్ కళాశాల, పట్టాభిపురం ఫైఓవర్ మీదుగా పోలీస్ పరేడ్ మైదానం వరకు సాగింది.

మూడు రోజులుగా తాగునీటి కష్టాలు

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి పట్టణంలోని సుప్రీం పేటలో మూడు రోజులుగా తాగునీరు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మోటార్ మరమ్మతులకు గురైందని, నాలుగు రోజులు గడుస్తున్నా ఇప్పటివరకు మరమ్మతులు చేయకపోవడంతో తాగునీటి కోసం అల్లాడిపోతున్నామని స్థానికులు వాపోతున్నారు. రాత్రి 12 గంటలకు కూడా బిందులు పట్టుకుని నీళ్లు వస్తాయని పంపుల దగ్గరే పడిగాపులు కాస్తున్నామని చెబుతున్నారు. మోటార్‌కు మరమ్మతులు చేయడానికి ఇన్ని రోజులు ఏంటని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

నూజివీడులో స్క్రబ్ టైఫస్?

- లక్షణాలతో ఉన్న వ్యక్తిని విజయవాడ తరలింపు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు పట్టణానికి చెందిన ఓ వ్యక్తి జ్వరంతో నూజివీడు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో శుక్రవారం చేరాడు. అయితే శుక్ర, శనివారం కూడా వైద్య సేవలందించినా జ్వరం తగ్గుముఖం పట్టకపోవడంతో స్క్రబ్ టైఫస్ అనే అనుమానంతో అతనిని మెరుగైన వైద్య సేవల కోసం అతనిని శనివారం రాత్రి విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా నూజివీడు ఏరియా ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్ ఉదయ్ మాట్లాడుతూ.. మొదటగా దద్దుర్లు, జ్వరం, దగ్గు, వాంతులు, కడుపునొప్పి, విరోచనాలు వంటి లక్షణాలు స్క్రబ్ టైఫస్‌లో కనిపిస్తాయని తెలిపారు. ఇవే లక్షణాలు సాధారణ జ్వరాలకు కూడా ఉంటాయని, ల్యాబ్ పరీక్షల అనంతరం నిర్ధారించి తగు వైద్య సేవలు అందించటం జరుగుతుందని తెలిపారు. మెరుగైన వైద్య సేవల కోసం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తామని చెప్పారు. స్క్రిప్ టైఫస్‌పై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని, ఆందోళన వద్దని సూచించారు. లక్షణాలు ఉంటే సమీపంలోని ఆసుపత్రిని సంప్రదించాలని సూచించారు.



సండే సందడి...

ప్రజాశక్తి- సీతంపేట (పార్వతీపురం మన్యం జిల్లా)

సీతంపేటలోని ఎన్‌టిఆర్ అడ్వెంచర్ పార్క్ పర్యాటకులతో పోటెత్తింది. పార్కు అందాలను ఆశ్వాదించడానికి జిల్లా నలుమూలల నుండే కాకుండా ఇతర జిల్లాల నుంచి పర్యాటకులు తరలివచ్చారు. జల విహార్ వద్ద పర్యాటకులు హాయిహాయిగా బోటు షికారు చేశారు. యువతీ యువకులు హ్యాంగింగ్ బ్రిడ్జిపై నడిచి వెళ్లారు. అడ్వెంచర్ పార్క్‌లో ఉన్న సాహసోపేతమైన క్రీడ నిర్వహించారు. స్కై సైకిల్ ఎక్కి ఆకాశంలో విహరించారు అనంతరం మెట్టుగూడ జలపాతం వద్ద జలకాలాడారు.

పప్పుశనగకు 'కడి' తెగుళ్లు

ప్రజాశక్తి-పత్తికొండ

పత్తికొండ వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో రబీ సీజన్‌లో పత్తికొండ 3452, దేవనకొండ 700, కృష్ణగిరి 281, వెల్దుర్తి 55 ,తుగ్గలి 787, మద్దికేర 7,102 హెక్టార్లలో శనగ సాగు చేశారు. గతేడాదితో పోల్చుకుంటే ఈ ఏడాది శనగ సాగువిస్తీర్ణం పెరిగినట్లు పెరిగినట్లు అధికారుల అంచనా.. ఎకరా శనగ సాగు చేయడానికి రూ.20,000 పెట్టుబడి పెట్టాలని రైతులు చెబుతున్నారు. శనగ పైరుకు కడి తెగుళ్లు సోకడంతో పైర్లను కాపాడుకోవడానికి రైతులు నానా అవస్థలు పడుతున్నారు. ప్రయివేటు ఫర్టిలైజర్ యాజమాన్యాలు ఈ పరిస్థితిని ఆసరా చేసుకుని పిచికారి మందులపై నిలువు దోపిడి చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రైతన్న మీకోసం కార్యక్రమం ద్వారా పంటలపై సలహాలు ,సూచనలు అవగాహన కల్పించాలని చెప్పారు. డివిజన్ కేంద్రంలో ఎడిఎ అధికారి కార్యాలయానికే పరిమితం అవుతున్నారని రైతు సంఘ నాయకులు మండిపడుతున్నారు. రైతులు సాగుచేసిన పైర్లకు తెగుళ్లు వచ్చి నష్టపోతుంటే వ్యవసాధికారులు క్షేత్రస్థాయిలో పంట పొలాలను పరిశీలించిన దాఖలు లేవని రైతులు చెబుతున్నారు.

ఆయా మండలాలలో రైతు సేవా సిబ్బంది పంటలపై సూచనలు, సలహాలు ఇవ్వడం లేదంటూ రైతులు మొరపెట్టుకుంటున్నారు. పంట సాగు చేయడానికి చేసిన అప్పులు తీరుతాయో లేదో అని కన్నీరు మున్నీరవుతున్నారు. రైతును కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. ప్రతి సందర్భంలో రైతే రాజు, రైతన్య మీకోసం, పొలం పిలుస్తోంది వంటి కార్యక్రమాలు నిర్వహించి ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తున్నారు. ప్రచార ఆర్భాటం తప్ప నిర్దిష్టంగా రైతు సమస్యలను ప్రజాప్రతినిధులు , అధికారులు ప్రధానంగా పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

ఏమి చేయాలో తెలియడం లేదు...

ఆరు ఎకరాలలో శనగ పంటను సాగు చేశాను. దాదాపు రూ.1.50 లక్షలు పెట్టుబడి పెట్టాను. పైరుకు కడి తేగుళ్ళు సోకడంతో కాయదశకు రాకముందే ముడుకు పోతున్నాయి. దిగుబడి తగ్గే అవకాశం ఉంది. ఏం చేయాలో తెలియడం లేదు.

- రైతు ముల్ల మాబు, హోసూర్ గ్రామం, పత్తికొండ మండలం.

రైతులకు అందుబాటులోనే ఉన్నాం..

గత వారం రోజులుగా రైతన్న మీకోసం కార్యక్రమం ప్రజల్లోకి తీసుకెళ్లాం. ప్రతి బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహిస్తున్నాం. ఆఫీస్ కార్యక్రమాలపై ఆఫీసులోనే ఉంటున్నాం. ఎల్లవేళలా రైతులకు అందుబాటులోనే ఉన్నాం. రైతుకు తగిన సూచనలు, సలహాలు ఇస్తాం.

- పత్తికొండ ఎడిఎ మోహన్ విజయ్ కుమార్.

ఎనిమిదేళ్ల జైలు జీవితం తరువాత..

- పోక్సో కేసులో నిర్దోషిగా విడుదల

ముంబయి : లైంగిక నేరాల నుంచి చిన్నారుల రక్షణ చట్టం (పోక్సో) కేసులో అరెస్టయి ఎనిమిదేళ్ల జైలు జీవితం అనుభవించిన తరువాత ఒక 56 ఏళ్ల వ్యక్తిని ట్రయల్ కోర్టు నిర్దోషిగా విడిచిపెట్టింది. ఈ కేసులో నిందితుడికి వ్యతిరేకంగా సరైన సాక్ష్యాలు లేవని, మేథో వైకల్యంతో బాధపడుతున్న బాధితురాలి వాంగ్మూలం ఇతర ఆధారాలకు భిన్నంగా ఉందని కోర్టు పేర్కొంది. నవంబర్ 28న ఇచ్చిన తీర్పులో ఈ విషయాన్ని తెలిపింది. 'ప్రాసిక్యూషన్ సమర్పించిన సాక్ష్యాలు సరిపోవు. నిందితుడే నేరాన్ని చేసినట్లు సహేతుకంగా, సందేహం లేకుండా నిరూపించడానికి సరిపోవు' అని తీర్పులో పోక్సో ప్రత్యేక కోర్టు జడ్జి ఎన్‌డి ఖోస్ తెలిపారు. ఈ కేసులో ఇచ్చిన ఇతర ఆధారాలు బాధిత బాలిక ఇచ్చిన సాక్ష్యాలకు విరుద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. నిందితుడ్ని మరొక కేసులో అరెస్టు చేయకపోతే తక్షణమే అతన్ని విడుదల చేయాలని ఆదేశించారు. ప్రాసిక్యూషన్ ప్రకారం ఈ కేసు ఘటన ముంబయిలోని మలాడ్ (తూర్పు)లోని కురార్ ప్రాంతంలో 2017, ఆగస్టు 23న జరిగింది. మేథో వైకల్యంతో బాధపడుతున్న బాలిక (అప్పుడు ఆమె వయస్సు 17 ఏళ్లు) ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో నిందితుడు లైంగిక దాడి చేయడంతోపాటు ఆమె కుటుంబాన్ని అంతం చేస్తానని బెదిరించాడు. బాలిక తల్లి ఫిర్యాదు చేయడంతో 2017 ఆగస్టు 24న నిందితుడ్ని అరెస్టు చేశారు.

విమాన సంక్షోభంపై న్యాయవిచారణ

- పౌర విమానయాన సేవల్లో అంతరాయంపై ప్రధానికి సిపిఎం ఎంపి జాన్ బ్రిట్టాస్ లేఖ



న్యూఢిల్లీ : పౌర విమానయాన సేవల్లో అసాధారణ అంతరాయం పైన, భారీగా విమాన ఛార్జీల పెరుగుదల పైన దర్యాప్తు జరిపేందుకు సంయుక్త పార్లమెంటరీ కమిటీని (జెపిసి) ఏర్పాటు చేయాలని లేదా న్యాయ విచారణ జరిపించాలని సిపిఎం ఎంపి జాన్ బ్రిట్టాస్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన శనివారం ప్రధాని నరేంద్ర మోడీకి ఓ లేఖ రాశారు. పౌర విమాన సేవలు అసాధారణ రీతిలో నిలిచిపోవడంతో గత కొన్ని రోజులుగా లక్షలాది మంది ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని, విమాన ఛార్జీలు అపరిమితంగా పెరగడంతో ఆర్థిక దోపిడీకి గురవుతున్నారని ఆయన ఆ లేఖలో వివరించారు. పైలట్లు, సిబ్బంది విమాన ప్రయాణ సమయాన్ని పరిమితం చేస్తూ సవరించిన నిబంధనల అమలు నియంత్రణకు సంబంధించిన సన్నద్ధతలో, ప్రయాణికుల రక్షణలో తీవ్రమైన సంస్థాగత వైఫల్యాన్ని బయటపెట్టిందని, దీంతో సాధారణ ప్రయాణికులు బాగా ఇబ్బంది పడ్డారని తెలిపారు.

'దేశీయ మార్కెట్‌లో 63 - 65 శాతం వాటా ఉన్న ఇండిగో విమానాలను ఆకస్మికంగా రద్దు చేయడం, ప్రయాణాలు అస్తవ్యస్తంగా దేశవ్యాప్తంగా విమాన ప్రయాణాలను స్తంభింపజేసింది. ఒక ప్రయివేటు ఆపరేటర్ వైఫల్యం మొత్తం వ్యవస్థ వైఫల్యానికి దారితీసింది. వేలాదిమంది ప్రయాణికులు ఎక్కడికక్కడే చిక్కుకుపోయారు. బెంగళూర్ నేల పైనే నిద్రపోవాల్సి వచ్చింది. అత్యవసర వైద్య సేవలకు దూరమయ్యారు. సవరించిన నిబంధనలు భద్రతను పెంచడానికి ఉద్దేశించినవే అయినప్పటికీ వాటి అమలులో కార్యాచరణ ప్రణాళిక లోపించింది. నిబంధనలను పాటించడానికి అవసరమైన సంసిద్ధత కూడా కరువైంది. దూరదృష్టి లోపించింది. ఊహించదగిన ఒత్తిడిలో వ్యవస్థ కుప్పకూలిపోయిన తర్వాత భద్రతా నిబంధనలను సడలించారు. కొన్నింటిని వెనక్కి తీసుకున్నారు. ప్రయాణికుల భద్రత వాణిజ్య ప్రయోజనాలకు లోబడి ఉన్నదనే ఆందోళన వ్యక్తమైంది' అని ప్రధానికి రాసిన లేఖలో బ్రిట్టాస్ తెలియజేశారు. దేశీయ విమాన ఛార్జీలు ఆకాశాన్ని అంటాయని, దీనిని లాభదాయక అవకాశంగా మార్చుకుని సంస్థలు దోపిడీ చేశాయని బ్రిట్టాస్ విమర్శించారు. ఛార్జీల పెరుగుదలను ఇండిగోకు మాత్రమే పరిమితం కాలేదని, ఇతర విమాన సంస్థలు కూడా ఛార్జీలను బాగా పెంచేశాయని తెలిపారు. ఇండిగో వేలాది సర్వీసులను రద్దు చేసిన తర్వాత అనేకమంది అంతర్జాతీయ విమాన ప్రయాణికులు తమ ఎయిర్ ఇండియా టిక్కెట్లను రద్దు చేసుకోవాల్సి వచ్చిందని, రద్దు - ఛార్జీల పెరుగుదలతో వారిపై రెట్టింపు భారం పడిందని తెలిపారు.

'చైనాలో మూడు పెద్ద విమాన సంస్థల మార్కెట్ వాటా కలిపినా 60 శాతం దాటలేదు. అమెరికాలో ఏ దేశీయ విమానయాన సంస్థ వాటా కూడా ఇరవై ఐదు శాతానికి మించదు. ఇది భారతదేశ ద్వంద్వ రాజకీయ నిర్మాణం ఎంత తీవ్రమైనదో, అసాధారణమైనదో తెలియజేస్తోంది. ప్రధాన విమానాశ్రయాలను ఏకకాలంలో కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టడంతో కొత్త లేదా ప్రాంతీయ విమానాశ్రయాల ఏర్పాటు అవకాశాలు తగ్గిపోయాయి. కేరళలోని కన్నూర్ అంతర్జాతీయ విమానాశ్రయం పూర్తిస్థాయిలో పనిచేస్తున్నప్పటికీ విదేశీ క్యారియర్లకు పాయింట్ - ఆఫ్ - కాల్ హోదాను తిరస్కరించారు. అదే గోవాలో కొత్తగా నిర్మించిన మోపా విమానాశ్రయానికి ఆ అవకాశం కల్పించారు' అని బ్రిట్టాస్ తన లేఖలో ఎత్తిచూపారు. పైలట్లను తగినంత సంఖ్యలో నియమించుకోకపోవడాన్ని ఆయన ప్రశ్నించారు. విమాన ఛార్జీలు తమ నియంత్రణలో లేవని ప్రభుత్వం చేస్తున్న వాదనలపై బ్రిట్టాస్ ఆందోళన వ్యక్తం చేశారు.

ప్రభుత్వానికి తెలిసే వ్యవస్థీకృత దోపిడీ

ప్రభుత్వానికి తెలిసే వ్యవస్థీకృత దోపిడీ జరుగుతోందని బ్రిట్టాస్ విమర్శించారు. ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ లక్షలాది మంది నిస్సహాయులైన ప్రయాణికులు దోపిడీకి గురవుతున్నారని, రెండు విమానయాన సంస్థలు సొమ్ము చేసుకున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆశీర్వాదంతో ఈ పరిస్థితి నెలకొందని, దీని వెనుక ఓ కుట్ర ఉన్నదని చెప్పారు. సంయుక్త పార్లమెంటరీ కమిటీ లేదా జ్యుడీషియల్ కమిషన్‌తో విచారణ జరిపిస్తేనే డిజిసిఎ ఆదేశాల ఉపసంహరణ తర్వాత పౌర విమానయాన 'సేవల్లో' అంతరాయం, ఛార్జీల 'పేరిట దోపిడీ వెనుక దాగి ఉన్న కుట్రను ఛేదించడం సాధ్యమవుతుందని తెలిపారు.

షాంఘైలో నూతన భారత రాయబార కార్యాలయం

- 32 ఏళ్ల తర్వాత ప్రారంభం



బీజింగ్ : చైనా ప్రధాన వాణిజ్య కేంద్రం షాంఘైలో భారత్ నూతన రాయబార కార్యాలయాన్ని ఆదివారం ప్రారంభించింది. 32 ఏళ్ల తర్వాత దీన్ని ప్రారంభించడం విశేషం. షాంఘై నగరంలోని చాంగ్నింగ్ జిల్లాలోని డానింగ్ సెంటర్‌లో చైనా భారత రాయబారి ప్రదీప్ కుమార్ రావత్ అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత్, చైనా మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడి 75 ఏళ్లు అయిన సందర్భంగా నూతన కార్యాలయాన్ని ప్రారంభించామని తెలిపారు. వ్యాపార సామర్థ్యానికి కేంద్రమైన షాంఘైలో భారతీయులకు ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. ఇప్పుడంతి అంతర్జాతీయ మార్కెట్‌తో అనుసంధానం సులభమవుతుందని తద్వారా భారత వాణిజ్యం పెరుగుదలకు దోహదపడుతుందని తెలిపారు. కాన్సుల్ జనరల్ ప్రతీక్ మాథుర్ మాట్లాడుతూ.. భారతీయులకు, చైనా ప్రజలకు ఈ కార్యాలయం నిబద్ధతతో సేవలందిస్తుందని తెలిపారు. ఇరు దేశాల సంబంధాలు పెరగటానికి, సాంస్కృతిక, వాణిజ్య, పరిపాలనా విధులను విస్తృతం చేస్తుందన్నారు. దీనికి తోడ్పడిన విదేశాంగ మంత్రిత్వ శాఖ, స్థానిక చైనా అధికారులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యాలయం ప్రారంభం సందర్భంగా చైనా ప్రభుత్వ అధికారులు, విదేశీ దౌత్యవేత్తలు స్థానికంగా ఉన్న భారతీయులు హాజరయ్యారు.



యూనివర్సిటీ ఎదుట నిరసన తెలుపుతున్న ఐద్వా, ఎస్ఎఫ్ఐ నాయకులు

తిరుపతి జాతీయ సంస్కృత యూనివర్సిటీలో కీచక పర్వం

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్రానికి చెందిన వారు. లక్ష్మణ్ కుమార్ గతంలోనూ యువతుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించారనే ఆరోపణలు ఉన్నట్లు యూనివర్సిటీ వర్గాల సమాచారం. ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లను ఈ నెల ఒకటిన సస్పెండ్ చేశామని, 2వ తేదీ నుంచి వారు విధులకు రావడం లేదని యూనివర్సిటీ ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ రజనీకాంత్ శుక్ల మీడియాకు ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఆ విద్యార్థిని గర్భవతి అనేది నిజం కాదని, ఆమె ఇచ్చిన ఫిర్యాదులో ఈ విషయం ఎక్కడా లేదని ఈ ప్రకటనలో ఆయన పేర్కొనడం పట్ల ఇవి తీవ్ర అవమానకరమైన, బాధ్యతారాహిత్యమైన వ్యాఖ్యలంటూ తోటి విద్యార్థినులు, విద్యార్థి సంఘాల నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధిత విద్యార్థినికి న్యాయం చేయాలని ఎస్ఎఫ్ఐ, ఐద్వా ఆదివారం యూనివర్సిటీ ద్వారం ఎదుట ఆందోళనకు దిగాయి. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి సాయిలక్ష్మి మాట్లాడుతూ జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో మహిళలకు సంబంధించి ప్రత్యేకమైన లైంగిక వేధింపుల నిరోధక కమిటీని కూడా ఏర్పాటు చేయలేదన్నారు. వర్సిటీలో ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోగా విద్యార్థి సంఘాల నేతలను, మీడియాను యూనివర్సిటీలోకి అనుమతించపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఇదే అదునుగా వర్సిటీలోని కొందరు అసిస్టెంట్ ప్రొఫెసర్లు, కొందరు సీనియర్ విద్యార్థులు రెచ్చిపోతున్నారని, ర్యాగింగ్‌కు, విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారని విమర్శించారు. గంజాయి అమ్మకాలు కూడా జరుగుతున్నాయన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి యూనివర్సిటీలో జరుగుతున్న అసాంఘిక కార్యక్రమాలపై ప్రత్యేక శ్రద్ధ దృష్టి సారించాలని, క్రమశిక్షణ కమిటీల ద్వారా చర్యలు తీసుకోవాలని, లైంగిక వేధింపులకు గురైన విద్యార్థినికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అక్బర్, రవి, రాష్ట్ర గర్ల్స్ కో-కన్వీనర్ పవిత్ర, జిల్లా ఉపాధ్యక్షులు వినోద్, అశోక్, ఐద్వా నాయకులు జయంతి పాల్గొన్నారు.

నిందితులపై కేసు నమోదు

యూనివర్సిటీ ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ రజనీకాంత్ శుక్ల ఫిర్యాదు మేరకు తిరుపతి వెస్ట్ పోలీసులు లక్ష్మణ్ కుమార్, శేఖర్ రెడ్డిలపై లైంగిక వేధింపుల కేసు నమోదు చేశారు. నిందితులను ఇద్దరినీ అదుపులోకి తీసుకొని వారి ఫోన్లు స్వాధీనం చేసుకుని ఫోను కాల్స్, మెసేజ్‌లను పరిశీలిస్తున్నారు. ఇద్దరు నిందితులపై 183/2025 సెక్షన్ కింద కేసు నమోదు చేశారు. విద్యార్థినిని అసిస్టెంట్ ప్రొఫెసర్లు లైంగికంగా వేధించిన ఘటనపై తిరుపతి ఎంపి డాక్టర్ గురుమూర్తి స్పందించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, నేషనల్ ఎస్‌సి కమిషన్, నేషనల్ మహిళా కమిషన్‌కు లేఖ ద్వారా దీనిపై ఫిర్యాదు చేశారు. విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఈ లేఖలో కోరారు.

నిర్బంధ సైనిక నియామకం వద్దు

- జర్మనీలో వెల్లువెత్తిన నిరసనలు
- ఆయుధాలు వద్దు.. విద్య కావాలంటూ నినాదాలు



బెర్లిన్ : సైన్యంలో జర్మనీ యువత తప్పనిసరిగా సర్వీస్ చేయాలన్న నిర్ణయాన్ని నిరసిస్తూ దేశంలోని పలు నగరాలలో వేలాది మంది జర్మన్లు పెద్ద ఎత్తున ప్రదర్శనలు నిర్వహించారు.. జర్మనీ ఛాన్సలర్ ఫ్రెడ్రిచ్ మెర్జ్ సైన్యాన్ని ప్రక్షాళన చేస్తున్నామని, దానికి సంబంధించిన మిలిటరీ సర్వీసుల చట్టం మార్పులు బిల్లును జర్మనీ పార్లమెంట్ శుక్రవారం ఆమోదించిందని తెలిపారు..అయితే సైన్యాన్ని పెంచేందుకు, సంఖ్య తగ్గిన పక్షంలో యువతను నిర్బంధంగా సైన్యంలో చేర్చుకునేందుకు ఈ చట్ట సవరణలు వీలు కల్పిస్తుంది. ఈ బిల్లును వ్యతిరేకిస్తూ శనివారం బెర్లిన్, హాంబర్గ్, మ్యూనిచ్, కొలోగ్న్ సహా జర్మనీలోని సుమారు 90 నగరాలలో భారీ ర్యాలీలు జరిగాయి. నిరసనకారులు యుద్ధ వ్యతిరేక నినాదాలు చేస్తూ 'నిర్బంధ సైన్యానికి నో', 'మేము ఫిరంగి దళంలో చేరం', 'మేము లేకుండానే యుద్ధం చేయండి' అని రాసి ఉన్న బ్యానర్లను ప్రదర్శించారు. ప్రభుత్వం తీసుకొస్తున్న సంస్కరణల్ని 'మరణ నియామకాలు'గా అభివర్ణించారు. ఆయుధాలకు బదులు విద్యను, సంక్షేమాన్ని అందించాలని కోరారు.. సైన్యాన్ని పెంచుకొని రష్యాపై యుద్ధానికి జర్మనీ సిద్ధమవుతుందని నిరసనకారులు ఆందోళనవ్యక్తం చేశారు. లెఫ్ట్ పార్టీ నేత డిజైరీ బేకర్ మాట్లాడుతూ ఈ చట్ట సవరణతో ప్రజలకు ఒరిగేదేమీ లేదని, ఇది ఆయుధ కంపెనీలకే ప్రయోజనకరమన్నారు. దీనికి వ్యతిరేకంగా దేశవ్యాప్త సమ్మెకు సన్నద్ధంకావాలన్నారు..

ఏం జరిగిందంటే...

దేశ ప్రజలు వ్యతిరేకించిన తరువాత నిర్బంధ సైనిక సేవను జర్మనీ 2011లో రద్దు చేసింది. అయితే ప్రస్తుతం తీసుకువచ్చిన బిల్లులో ఇది స్వచ్ఛందం అని చెబుతూనే భద్రతాపరమైన కారణాలు చెప్పి నిర్బంధం చేస్తుంది. అటు నాటో కూడా తన సభ్య దేశాలకు సైన్యాన్ని పెంచుకోవాలని సూచించింది. నాటో సభ్యదేశం పైకి రష్యా 2028లో దాడి చేయవచ్చునని జర్మనీ రక్షణ మంత్రి బోరిస్ పిస్టోరియస్ ఇటీవల పేర్కొన్నారు..

దీన్ని అర్థం లేని వాదనగా, అనుమానంగా రష్యా ఖండించింది. అయితే తాజా చట్టంలో 18 సంవత్సరాలు దాటిన యువకులందరూ వచ్చే సంవత్సరం నుంచి ప్రశ్నావళిని పూర్తి చేసి, వైద్య పరీక్షలు చేయించుకోవాలి. తద్వారా వారు సైన్యంలో చేరేందుకు అంగీకరించినట్లే.. గతంలో రద్దు చేసిన నిర్బంధ సైనిక శిక్షణను తిరిగి తీసుకువస్తున్నారని, బలవంతంగానైనా యువతను సైన్యంలో చేర్చడానికి బెర్లిన్ కుంటిసాకులు చెబుతూ భయాందోళనలకు గురిచేస్తోందని జర్మన్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



బెనిన్‌లో సైనిక తిరుగుబాటు

కొటోనా (బెనిన్) : పశ్చిమ ఆఫ్రికా దేశం బెనిన్‌లో సైనిక తిరుగుబాటు సంభవించింది. అధ్యక్షుడు ప్యాట్రిస్ టాలోన్‌ను, అన్ని ప్రభుత్వ సంస్థలను తొలగిస్తున్నట్లు సైన్యం ప్రకటించింది. ఈ విషయాన్ని ప్రభుత్వ టివి ఛానెల్‌లో ఆదివారం ప్రకటించింది. లెఫ్టినెంట్ కల్నల్ పాస్కల్ టిగ్రిని సైనిక కమిటీ అధ్యక్షుడిగా నియమితులైనట్లు తెలిపింది. 1960లో బెనిన్ ఫ్రాన్స్ నుంచి స్వాతంత్ర్యం పొందింది. ఈ స్వాతంత్ర్యం పొందిన తొలి దశాబ్దాల్లో అనేక సైనిక తిరుగుబాట్లను చవిచూసింది. 1991లో పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ బెనిన్‌గా పేరు మార్చుకున్న తరువాత దేశంలో రాజకీయంగా స్థిరంగా ఉంది. ప్రస్తుత అధ్యక్షులు టాలోన్ 2016 నుంచి అధికారంలో ఉన్నారు. వచ్చే ఏప్రిల్‌లో అధ్యక్ష ఎన్నికల వరకూ ఆయన పదవిలో కొనసాగాల్సి ఉంది. గత నెలలోనే అధ్యక్షుడి పదవీ కాలాన్ని ఐదు నుంచి ఏడు ఏళ్లకు చట్టసభ పొడిగించింది. ఒక వ్యక్తి రెండు సార్లు కంటే ఎక్కువసార్లు అధ్యక్ష పదవిలో ఉండకుండా నిరోధించింది. గతవారమే మరో పశ్చిమ ఆఫ్రికా దేశం గినియా - బిస్సావులోనూ సైనిక తిరుగుబాటు జరిగింది. అధ్యక్షుడు ఉమారో ఎంబాలోను పదవీచ్యుతుడ్ని చేసింది.

బలవంతపు భూ సేకరణకు వ్యతిరేకంగా 'మా ఊరు-మా భూమి-మా హక్కు'

(మొదటిపేజీ తరువాయి)

పరిస్థితి నెలకొందన్నారు. విజయనగరం జిల్లాలో 1,200 ఎకరాల్లో స్టీల్ ప్లాంట్ ఏర్పాటుచేసి అందులో 700 ఉద్యోగాలు ఇస్తామంటున్నారని, ఈ భూములు తీసుకోవడం వల్ల 5 వేల రైతు కుటుంబాలు నష్టపోతాయన్నారు. ఇలాంటి దుర్మార్గాన్ని ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం హరిబాబు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని చంద్రబాబు ప్రభుత్వం 2013 భూ సేకరణ చట్టాన్ని తుంగలో తొక్కేసి తనవారికి భూములు కట్టబెడుతున్నారని విమర్శించారు. రాజధానిలో గతంలో తీసుకున్న భూముల్లో నిర్మాణాలు చేపట్టకుండానే, రెండవ దశలో మరో 30 వేల ఎకరాలను భూసమీకరణ చేయడం, రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో చేస్తున్న భూసేకరణ దుర్మార్గమైనదన్నారు. 2013 భూసేకరణ చట్టంలో భూములు తీసుకున్నప్పుడు రైతులకే కాకుండా, కౌలుదారులు, వ్యవసాయ కూలీలకు నష్టపరిహారం ఇవ్వాల్సి ఉందని, ఈ ప్రభుత్వం రైతులకే సరైన నష్టపరిహారం ఇవ్వడం లేదని, ఇతరుల పరిస్థితి మరీ దారుణమన్నారు. భూ సేకరణ, భూ సమీకరణలకు వ్యతిరేకంగా దశలవారీ గ్రామాల్లో సభలు, సమావేశాలు నిర్వహిస్తూ.. రైతులను, కూలీలను, వ్యవసాయ కూలీలను చైతన్య పరుస్తూ రాష్ట్ర వ్యాప్త ఉద్యమం చేపడతామని తెలిపారు.

వందేమాతరంపై నేడు లోక్‌సభలో చర్చ

- ప్రారంభించనున్న ప్రధాని

న్యూఢిల్లీ : వందేమాతర గీతం 150వ వార్షికోత్సవంపై లోక్‌సభలో సోమవారం జరిగే చర్చను ప్రధాని నరేంద్ర మోడీ ప్రారంభిస్తారు. రాజ్యసభలో మంగళవారం చర్చ జరగనుండగా దానిని హోం మంత్రి అమిత్ షా ప్రారంభిస్తారు. ఆ తర్వాత ఆరోగ్యశాఖ మంత్రి జెపి నడ్డా మాట్లాడతారు. లోక్‌సభలో చర్చకు పది గంటల సమయం కేటాయించారు. తీర్మానంపై లోక్‌సభలో ప్రధాని తర్వాత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడతారు. ప్రతిపక్ష కాంగ్రెస్ పక్షాన ఆ పార్టీ ఉప నేత గౌరవ్ గొగోయ్, ప్రియాంక గాంధీ వాద్రా ప్రసంగిస్తారు. బంకించంద్ర ఛటర్జీ సంస్కృతంలో రాసిన వందేమాతర గీతంపై పార్లమెంటులో చర్చ జరపాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ గీతంలోని కీలక భాగాన్ని 1937లో కాంగ్రెస్ తొలగించిందని, అది దేశ విభజనకు కారణమైందని మోడీ ఆరోపించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ సహా ఎన్నికల సంస్కరణలపై లోక్‌సభలో మంగళ, బుధ వారాలలో చర్చ జరుగుతుంది. ఈ అంశాన్ని ఎగువసభ బుధ, గురువారాలలో చేపడుతుంది.

గుత్తాధిపత్యం వల్లే సంక్షోభం

(మొదటిపేజీ తరువాయి)

అందజేసే అవకాశం ఉంది. వారి నుంచి వివరణ కోరవచ్చునని సంబంధిత వర్గాలు తెలిపాయి. రవాణా, పర్యాటకం, సంస్కృతిపై జెడి(యు) ఎంపి సంజయ్ ఝూ నేతృత్వంలో గతంలోనే ఒక పార్లమెంటరీ ప్యానెల్‌ను కేంద్రం ఏర్పాటు చేసింది. ఈ ప్యానెల్ సభ్యుడు ఒకరు ఆదివారం మాట్లాడుతూ విమాన సర్వీసుల రద్దు కారణంగా వేలాది మంది ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్యానెల్ తీవ్రంగా పరిగణించిందని తెలిపారు. ఈ అంశంపై ప్యానెల్ వివరణ కోరే అవకాశం ఉందని చెప్పారు.

గుత్తాధిపత్యంపై ప్రజలు ఆలోచించాలి : చిదంబరం

భారత ఆర్థిక వ్యవస్థలోని అనేక రంగాలలో గుత్తాధిపత్యం పేరుకుపోతోందని, దేశంలోని విమానయాన రంగాన్ని ఇద్దరికే ఎందుకు కట్టబెట్టారో ప్రజలు ఆలోచించాలని కేంద్ర మాజీ ఆర్థిక మంత్రి పి.చిదంబరం ఎక్స్‌లో పోస్టు చేశారు. కార్పొరేట్లు అడ్డగోలుగా తమ కార్యకలాపాలను నిర్వహించేందుకు ఎన్నికల బాండ్లు ఉపయోగపడుతున్నాయనడానికి ఇండిగో ఉదంతమే ఉదాహరణ అని లోక్‌సభ సభ్యుడు శశికాంత్ సెంథిల్ విమర్శించారు. 2024లో జారీ చేసిన నిబంధనలను ఇప్పటికీ అమలు చేయకపోయినా పౌరవిమానయాన శాఖ ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు.

ఇప్పటికీ అమలుకాని కేంద్ర మంత్రి ఆదేశాలు

రద్దు చేసిన సర్వీసులకు సంబంధించిన మొత్తాన్ని రిఫండ్ చేయాలన్న కేంద్ర మంత్రి ఆదేశాలు ఇప్పటికీ పూర్తిస్థాయిలో అమలు కాలేదు. ఆదివారం రాత్రికి రూ.610 కోట్లు ఇండిగో ప్రయాణికులకు రిఫండ్ చేసినట్లు పౌర విమానయాన శాఖ మంత్రిత్వశాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఆదివారం మరో 650 సర్వీసులను ఇండిగో రద్దు చేసింది. ఆదివారం 1,650 విమాన సర్వీసులను నిర్వహించింది. పరిస్థితులు క్రమంగా మెరుగుపడుతున్నాయని తెలిపింది. ఈ నెల 10 నాటికి పరిస్థితి సాధారణ స్థితికి వస్తుందని భావిస్తున్నట్లు ఇండిగో తెలిపింది. తమ సంస్థ ఆన్-టైమ్ ఫెర్ఫార్మెన్స్ (ఒటిపి) పనితీరు ఆదివారం 75 శాతానికి మెరుగుపడినట్లు ఇండిగో ప్రకటించింది.

శనివారం ఇండిగో దాదాపు 800 సర్వీసులను రద్దు చేసింది. సుమారు 1,500 సర్వీసులను నిర్వహించింది. సాధారణంగా దేశంలో అతిపెద్ద పౌరవిమానయాన సంస్థ అయిన ఇండిగో రోజుకు సుమారు 2,300 దేశీయ, అంతర్జాతీయ సర్వీసులను నిర్వహిస్తుంది. కొన్ని రోజుల నుంచి వందలాది విమాన సర్వీసులను ఇండిగో రద్దు చేయడంతో వేలాది మంది ప్రయాణికులు అనేక అగచాట్లు పడ్డారు. శుక్రవారం సుమారు 1800 సర్వీసులు రద్దు చేయడంతో దేశీయ ఎయిర్‌లైన్స్ చరిత్రలోనే అత్యంత దారుణమైన రోజుగా విమర్శకులు భావిస్తున్నారు. ఆదివారం ఇండిగో ప్రతినిధి విడుదల చేసిన ప్రకటనలో 'విమాన షెడ్యూల్స్‌ను పునరుద్ధరించడంలోనూ, కస్టమర్ సపోర్ట్ వ్యవస్థను బలోపేతం చేయడంలోనూ తమ సంస్థ కీలకమైన పురోగతి సాధిస్తోంది' అని తెలిపారు. ఆదివారం సర్వీసుల రద్దుకు సంబంధించిన సమాచారాన్ని ముందుగానే తెలియజేశామని పేర్కొన్నారు. రద్దయిన సర్వీసుల ప్రయాణికులకు సాధ్యమైనంత త్వరగా రిఫండ్ చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. సంస్థ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు సమావేశమై, సమస్యకు కారణమైన అంశాలపై చర్చలు జరిపినట్లు ఇండిగో తెలిపింది. సిఇఒ, బోర్డు సభ్యులు కలిసి క్రైసిస్ మేనేజ్‌మెంట్ గ్రూప్ (సిఎంజి)ను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు పేర్కొంది. సంక్షోభం నుంచి బయటపడ్డానికి, విమాన సర్వీసుల పునరుద్ధరణకు ఈ గ్రూప్ చర్యలు తీసుకుంటుందని తెలిపింది.

గోవా నైట్‌క్లబ్‌లో ఘోరం

(మొదటిపేజీ తరువాయి)

కూడా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

ప్రధాని, రాష్ట్రపతి ప్రభృతుల విచారం

ప్రమాద ఘటనపై రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోడీ ఎక్స్ వేదికగా స్పందించారు. రాష్ట్రపతి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు సానుభూతి తెలిపారు. ఈ ఘటనపై విచారం వ్యక్తం చేసిన మోడీ.. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ప్రధాన మంత్రి జాతీయ సహాయ నిధి (పిఎంఎన్ఆర్ఎఫ్) నుంచి మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు, గాయపడిన వారికి రూ.50 వేల చొప్పున పరిహారాన్ని ప్రకటించారు.

ప్రభుత్వ నేరపూరిత వైఫల్యం : రాహుల్‌గాంధీ

అగ్నిప్రమాదంపై లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఘటనపై విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ ఘటన ప్రమాదం మాత్రమే కాదనీ, భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వల్ల జరిగిన ప్రభుత్వ నేరపూరిత వైఫల్యం (క్రిమినల్ ఫెయిల్యూర్) అని విమర్శించారు. ఈ ఘటనలో స్పష్టమైన, పారదర్శక విచారణ జరగాలని ఆయన డిమాండ్ చేశారు.

సమగ్ర దర్యాప్తు జరపాలి : ఎంఎ బేబీ

గోవాలోని అర్పోరా అగ్ని ప్రమాదంలో 25 మంది మృతి పై సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో గాయపడిన వారికి ప్రభుత్వం తక్షణమే వైద్య చికిత్స అందించాలని, మృతుల కుటుంబాలకు పరిహారం అందించాలని సోషల్ మీడియా ఎక్స్‌లో కోరారు. ఇది మాటలకందని విషాదమని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. అగ్నిమాపక భద్రతా చర్యలు తీసుకోవడంలో తీవ్ర నిర్లక్ష్యం స్పష్టంగా కనబడుతుందన్నారు. దీనికి ఎవరు జవాబుదారీ అని ప్రశ్నించారు. ఈ దుర్ఘటనపై సమగ్ర దర్యాప్తు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

పశ్చిమ నేపాల్‌లో భూకంపం

ఖాట్మాండు : నేపాల్‌లో స్వల్ప భూకంపం సంభవించింది. పశ్చిమ నేపాల్‌లోని సుదర్‌పాశ్చిమ్ ప్రావిన్స్‌లో ఆదివారం ఉదయం 8.28 గంటలకు ప్రకంపనలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. దీంతో ప్రజలు ఇళ్ల నుండి బయటకు పరుగులు తీశారు.. రిక్టర్‌స్కేలుపై భూకంప తీవ్రత 4.6గా నమోదైందని జాతీయ భూకంప పర్యవేక్షణ, పరిశోధన కేంద్రం తెలిపింది. దార్చులా జిల్లాలోని ఘనా ప్రాంతంలో భూకంప కేంద్రం ఉన్నట్లు వెల్లడించింది. అయితే ప్రాణ, ఆస్తినష్టానికి సంబంధించిన వివరాలు తెలియాల్సి వుంది. పశ్చిమ నేపాల్ తరచుగా భూకంపాలకు గురవుతుంది.

జెఫ్రీ ఫైల్స్ కేసులో కీలక పరిణామం

- గ్రాండ్ జ్యూరీ రికార్డులు విడుదల చేయండి
- అమెరికా కోర్టు అనుమతి

వాషింగ్టన్ : అమెరికాలో సంచలనం రేపిన జెఫ్రీ ఎప్‌స్టీన్ ఫైల్స్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకున్నది. అశ్లీల కార్యకలాపాలకు సంబంధించిన జెఫ్రీ ఎప్‌స్టీన్ కేసులో గ్రాండ్ జ్యూరీ రికార్డులను బయటకు విడుదల చేసేలా అమెరికా న్యాయశాఖకు యూఎస్‌లోని ఓ కోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అమెరికా కోర్టు అనుమతితో.. ఎప్‌స్టీన్ ఫైల్స్‌ను బహిర్గతం చేయాలంటూ కొన్నేళ్లుగా వినిపిస్తున్న డిమాండ్‌కు కీలక ముందడుగు పడినట్టు విశ్లేషకులు భావిస్తున్నారు. ముఖ్యంగా ప్రస్తుత అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌నకు ఎప్‌స్టీన్‌తో సంబంధాలున్నాయన్న పలు కథనాల నేపథ్యంలో ఈ కేసు మరింత ప్రాధాన్యతను సంతరించుకున్నది. 2003లో ట్రంప్, ఎప్‌స్టీన్‌లకు పరిచయం ఏర్పడిందని నివేదికలు చెప్తున్నాయి. ట్రంప్.. ఎప్‌స్టీన్‌కు పంపినట్టు చెప్తున్న ఒక అశ్లీల శుభాకాంక్ష నోట్, ఫొటో కూడా గతంలో బయటకు వచ్చాయి.

హౌజ్ ఓవర్‌సైట్ కమిటీ ప్రత్యేక దర్యాప్తులో ఎప్‌స్టీన్ ఎస్టేట్ నుంచి వేల పేజీల ఈ-మెయిల్స్, పత్రాలు బయటపడ్డాయి. ది ఫస్ట్ ఫిఫ్టీ ఇయర్స్ అనే బర్త్‌డే బుక్ స్కాన్ కాపీ కూడా లభ్యమైంది. ఇందులో పలువురు ప్రముఖుల శుభాకాంక్షల సందేశాలు ఉన్నాయి. శుభాకాంక్షలు పంపినవారిలో ప్రసిద్ధ వ్యక్తుల పేర్లు కూడా ఉన్నాయని కొన్ని నివేదికలు చెప్తున్నాయి. వీరిలో అమెరికా మాజీ అధ్యక్షుడు బిల్ క్లింటన్, బిలియనీర్ లియాన్ బ్లాక్‌తో పాటు పలువురు ప్రముఖులు ఉన్నారని వివరిస్తున్నాయి. జెఫ్రీ ఎప్‌స్టీన్ 2006లో మొదటిసారి అరెస్ట్ కాగా.. 2019 ఆగస్టు 10న జైలులో మరణించారు.

సరుకు రవాణా రంగంపై ఫిట్‌నెస్ పిడుగు


(మొదటిపేజీ తరువాయి)

సామాన్యులకు అందుబాటులో లేని నేటి తరుణంలో లారీల యజమానుల వాహనాలను నిలిపివేసి సమ్మెలోకి వెళితే రవాణా భారం అధికమవ్వనుంది. దీంతో నిత్యావసర వస్తువుల ధరలు మరికొంత పెరగడం ఖాయం. రాష్ట్రంలో 15 ఏళ్లు దాటిన వాహనాల శాతం తక్కువగా ఉందని, కేంద్రం విడుదల చేసిన నోటిఫికేషన్‌ను యథాతథంగా అమలు చేస్తే పాత లారీ యజమానులు అందరూ ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందని వారు వాపోతున్నారు. అనేక మంది పాత లారీల వారు స్వయం ఉపాధితో సాగిస్తున్న జీవనానికి ఇబ్బందులు ఎదురవుతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పెంచిన గూడ్స్ వాహనాల ఫిట్‌నెస్ ఛార్జీలు

కేంద్ర ప్రభుత్వం.. 10 ఏళ్ల నుంచి 20 ఏళ్లు దాటిన మోటారు వాహనాలను నాలుగు విభాగాలుగా కుదించి ఫిట్‌నెస్ ఛార్జీలు, టెస్టింగ్ ఫీజు, జిఎస్‌టిల ఛార్జీలను ఖరారు చేసింది. 15 ఏళ్లలోపు కార్లు (క్యాబ్)కు గతంలో ఫీజులన్నీ కలిపి రూ.800, 15 నుంచి 20 ఏళ్లు దాటిన కార్లకు రూ.4,500, 20 ఏళ్లు దాటితే రూ.9 వేలు ఉండేవి. ప్రస్తుతం ఈ మూడింటినీ కలిపి ఒకే విభాగం కిందకు తీసుకొచ్చి రూ.9 వేలుగా నిర్ణయించారు. లైట్ గూడ్స్ వెహికల్/లైట్ మోటారు వెహికల్‌కు 15 ఏళ్లలోపు ఉంటే వాటికి రూ.800, 15 నుంచి 20 ఏళ్ల వాహనానికి రూ.8,500, 20 ఏళ్లు దాటిన వాహనానికి రూ.17 వేలు ఉండగా, ప్రస్తుతం ఈ మూడింటినీ కలిపి రూ.17 వేలుగా నిర్ణయించారు. మీడియం గూడ్స్ వెహికల్ 10 ఏళ్ల లోపు రూ.1200, 10 నుంచి 13 ఏళ్ల వాహనాలకు రూ.2 వేలు, 13 నుంచి 15 ఏళ్ల వాహనాలకు రూ.6 వేలు, 20 ఏళ్లు దాటిన వాహనాలకు రూ.11,300 ఉండగా, వీటన్నిటినీ కలిపి ఒకే ఛార్జీగా రూ.22,600గా నిర్ణయించారు. హెవీ మోటారు వాహనానికి సంబంధించి 10 ఏళ్లకు సంబంధించి రూ.1200, 10 నుంచి 13 ఏళ్లకు రూ.2 వేలు, 13 నుంచి 15 ఏళ్లకు రు.6 వేలు, 15 నుంచి 20 ఏళ్ల వాహనాలకు రూ.14 వేలు, 20 ఏళ్లు దాటిన హెవీ వాహనాలకు రూ.28 వేలు ఛార్జీలు వసూలు చేస్తుండగా, ప్రస్తుతం వీటన్నిటినీ ఒకే విభాగం కిందకు తీసుకొచ్చి రూ.28 వేలుగా కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు అదనంగా జిఎస్‌టి రూ.5040తో ఒక్కో పాత వాహనానికి ఫిట్‌నెస్ ఛార్జీల కింద రూ.33.040 ఆయా వాహనదారులు చెల్లించాలి.

పాత ఫిట్‌నెస్ ఛార్జీలు అమలు చేయాలి



కేంద్రం విడుదల చేసిన నోటిఫికేషన్‌ను యథాతథంగా అమలు చేయాల్సిన అవసరం రాష్ట్ర ప్రభుత్వానికి లేదని, ఈ విషయంలో సిఎం చంద్రబాబు జోక్యం చేసుకుని పాత లారీ యజమానులను ఆదుకోవాలని ఎపి లారీ ఓనర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ వైవి ఈశ్వరరావు విజ్ఞప్తి చేశారు. లేని పక్షంలో ఈ నెల 9న అర్ధరాత్రి నుంచి రాష్ట్రంలోని 10 వేల పాత లారీలను ముఖ్యంగా రైల్వే గూడ్స్ షెడ్లు, షిప్ యార్డులు, పౌరసరఫరాలశాఖకు పెట్టిన లారీలు, ధాన్యం కొనుగోలులో ఉపయోగిస్తున్న లారీలను నిలుపుదల చేస్తామన్నారు. ఈ విషయంపై ముఖ్యమంత్రిని కలిసి సమస్య తీవ్రతను వివరించేందుకు ప్రయత్నిస్తున్నట్లు పేర్కొన్నారు. అమాంతం పెంచిన ఫిట్‌నెస్ ఛార్జీలు పాత లారీ యజమానులకు గుదిబండగా మారాయన్నారు. తాము సమ్మెలోకి వెళ్లకముందే ప్రభుత్వం స్పందించి గూడ్స్ రవాణాకు వినియోగిస్తున్న పాత లారీలకు పాత విధానంలో ఫిట్‌నెస్ ఫీజులు చెల్లించే దిశగా ఉత్తర్వులివ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు.


- ఎపి లారీ ఓనర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ వైవి ఈశ్వరరావు

జీవన సౌరభం
ఆపదలు ఎదురైనప్పుడు ధైర్యంగా ఉంటే దాని నుంచి సగం బయటపడినట్టే..

మీకోసం
సాక్సుల్ని రెండు గంటల పాటు నిమ్మరసం వేసిన నీటిలో నానబెడితే, చెడువాసన రాకుండా ఉంటుంది.



నడతను మార్చుకుందాం



అక్క అక్క ఏం చేద్దాం
చక్కగా ఆట ఆడేద్దాం
మంచి మాట పలికేద్దాం
అందరితో హాయిగుందాం
సెల్ ఫోన్ పక్కన పెట్టేద్దాం
కబుర్లు బాగా చెప్పేద్దాం
మంచి చెడు పంచుకుందాం
ఐకమత్యాన్ని పెంచుకుందాం
బడినే గుడిగా మలిచేద్దాం
గురువులను పూజిద్దాం
పుస్తకాలను ప్రేమిద్దాం
జ్ఞానం మస్తుగా పెంచేద్దాం
నడవడికలను మార్చేద్దాం
నలుగురిలో కలిసిపోదాం
సత్యం నిండుగా పాటిద్దాం
గొప్ప పేరును సాధించుదాం
ఆవేశాన్ని తరిమికొడదాం
ఆలోచనకు పదును పెడదాం
సహనంతో అడుగులు వేద్దాం
సహవాసం మంచిగా చేద్దాం
స్నేహానికి విలువ చేకూర్చుదాం
ఆపదలో కలిసి ఆదుకుందాం
చాడీలు చెప్పడం మానేద్దాం
సంస్కారమే గొప్పని చెబుదాం
అక్షరమాలతో దోస్తీ కడదాం
పదాలతోటి కలిసి నడుద్దాం
వాక్యాలతో మమేకమౌదాం
కథలు గేయాలు రాసేద్దాం
అమ్మ భాషకు విలువనిద్దాం
అమ్మ మాటకు కట్టుబడుదాం
అమ్మ పలుకును ఆచరిద్దాం
అవనిలో మనం మేటిగుందాం

- నరెద్దుల రాజారెడ్డి,
96660 16636.


ప్రశ్నిస్తాం!

తూర్పు ఉషోదయాన్ని
పడమర అస్తమయాన్ని
భూభ్రమణాన్ని
భూపరిభ్రమణాన్ని
అమావాసను పున్నాన్ని
గ్రహాలను నవగ్రహాలను
గ్రహణాలను కట్టు కథలను
ప్రశ్నించటం మా వాదం
ప్రశ్నించడం మా వేదం
ప్రశ్న లేనిది మేము లేము
ప్రశ్నయే ప్రగతికి మూలము
ఎందుకు? ఏమిటి?
ఎలా? ఎప్పుడు? లాంటి
పదాలు మా పాదాలు
మానవ ఉనికికి కారణాలు
ప్రశ్నయే ఉదయం
అభ్యుదయం
ప్రశ్నయే మేము
ప్రశ్నించడమే జగము
జగతిన ప్రశ్న వెల్లువిరియు
లోకాన ధన రాసులు కురియు
ప్రశ్నించుదాము రండి
ప్రగతి బాట పడదాము లెండి
ప్రశ్నయే జీవితము
అభివృద్ధి ఊపిరే ప్రశ్న!

- రాళ్లబండి సంగం నాయుడు,
94909 35258.

లెక్క చేయండి

పిల్లలూ, ఇక్కడ కనిపిస్తున్న బొమ్మలను అంకెలుగా గణించి లెక్క చేయాలి. ట్రై చేయండి చూద్దాం.



జవాబు : 10

నేను గీసిన బొమ్మ





వేల్పుల శ్రావ్య,
6వ తరగతి, జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల, మునుకుళ్ళ, తిరువూరు మండలం.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ఆ వ్యసనం నుంచి బయటపడొచ్చు ...

కొంత సమయం వెచ్చిస్తే

మీకు తెలిసిన వారెవ్వరైనా మత్తు పదార్థాల మహమ్మారికి బానిసలయ్యారా? ఈ వ్యసనం వల్ల వారు చెడు మార్గాల్లో నడుస్తున్నారా? మానసికంగా, శారీరకంగా, ఆర్థికంగా, సామాజికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారా? చదువు, సామర్థ్యం, నైపుణ్యం, సర్వస్వం కోల్పోయామని చింతిస్తున్నారా? కొత్త జీవితాన్ని పొంది మళ్లీ మామూలు మనిషిగా మారాలని వారు భావిస్తున్నారా? అయితే అలాంటి వారికి డి-ఎడిక్షన్ సెంటర్లు కౌన్సిలింగ్ ద్వారా పునరావాసాన్ని కల్పిస్తున్నాయి. కౌన్సిలింగ్, చికిత్సల ద్వారా నయం చేసేలా చేస్తున్నాయి.




ప్రతి వ్యక్తీ నిత్య జీవితంలో ఎన్నో సవాళ్లు, మరెన్నో ఒత్తిళ్లను ఎదుర్కొంటున్నారు. వాటి నుంచి తాత్కాలికంగా ఉపశమనం పొందే పేరుతో చాలామంది డ్రగ్స్‌ను ఆశ్రయిస్తున్నారు. స్నేహితులు బలవంతం చేయడం, సులభంగా డ్రగ్స్ దొరకడం, పబ్ సంస్కృతి పెచ్చుమీరడం వంటివి యువతను మత్తు పదార్థాల వైపు మళ్లిస్తున్నాయి. సినిమాలు, వెబ్ సిరీస్‌లు, వినోద కార్యక్రమాల్లో ధూమపానం, మద్యపానంతో పాటు డ్రగ్స్ వినియోగాన్ని సాధారణ అంశంగా, ఫ్యాషన్‌గా చూపుతున్నారు. అత్యంత ప్రజాదరణగల కొందరు సినీ హీరోలు సైతం పొగాకు ఉత్పత్తులను ప్రకటనల ద్వారా పరోక్షంగా ప్రోత్సహిస్తున్నారు. మత్తు పదార్థాల వినియోగాన్ని బహిరంగంగా ప్రోత్సహించే ఇలాంటి ధోరణులు సరికాదు. సిగరెట్, పొగాకు ఉత్పత్తుల నియంత్రణ చట్టం- సినిమాలు, టివి కార్యక్రమాల్లో పొగాకును ఉపయోగించే సన్నివేశాలు వచ్చినప్పుడు ఆరోగ్యానికి హానికరమనే హెచ్చరిక చూపిస్తున్నారు. పేరుకు హానికరం అని చూపిస్తూ, దానిని ఉపయోగించటం ఒక గొప్పగా, మజాగా, సాధారణ అంశంగా ప్రదర్శించటం వల్ల అది తప్పు కాదనే భావన యువతలో కలుగుతోంది.

మత్తు పదార్థాలు సేవించటం సరదాగా మొదలై.. వ్యసనంగా మారుతోంది. పల్లె, పట్నం తేడా లేకుండా ఎక్కడ పడితే అక్కడ వీటిని విక్రయిస్తుండడంతో ఎక్కువమంది బానిసలవుతున్నారు. డ్రగ్స్‌లో ఏముందో తెలుసుకోవాలనే ఆత్రుత.. బ్యాక్‌లాగ్స్, కెరీర్‌పై ఆందోళన.. పార్టీలకు వెళ్లినపుడు మిత్రులు, ప్రేమికుల ఒత్తిడి.. అమ్మాయిలు, అబ్బాయిలు మత్తుపదార్థాలకు అలవాటు పడేందుకు ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయి. ఆడపిల్లల్లోనూ ఈ వ్యసనపరులు అధికశాతం ఉన్నత విద్యావంతులే ఉంటున్నారు. పనిఒత్తిడి నుంచి బయటపడేందుకు నెలకోసారి మత్తుమాత్రలు, గంజాయి తీసుకుంటున్నారు.

తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్ర కీలకం

కరోనా తర్వాత సోషల్ మీడియా వినియోగం పెరిగిన తరవాత సమకాలీన విషయాలు, సామాజిక సమస్యల గురించి విద్యార్థులకు పెద్దగా ఆసక్తి ఉండటం లేదు. దాంతో వాస్తవ ప్రపంచంతో వారికి సంబంధం తెగిపోతోంది. మరోవైపు- ఇంటిపనులు, ఉద్యోగభారం కారణంగా తల్లిదండ్రు లు పిల్లలతో గడిపే సమయం తగ్గిపోతోంది. విద్యాలయాల్లో ఉపాధ్యాయులు, అధ్యాపకులకు తెలిసినా పట్టించుకోలేని పరిస్థితులు. ఈ మత్తులో ఏమి చేస్తారోననే భయం. ఇంట్లో తల్లిదండ్రులు కూడా ఏమి చేయలేని దుస్థితి. పిల్లలు మానసిక ఆనందం కోసం సామాజిక మాధ్యమాలను అతిగా వినియోగించడం, ధూమపానం, మద్యపానం, అశ్లీల చిత్రాల వీక్షణ, డ్రగ్స్ వినియోగం వైపు మళ్లుతున్నారు. మంచి ఉద్యోగం వస్తుందన్న ఆశతో చాలామంది తల్లిదండ్రులు తమ పిల్లల ఇష్టాయి ష్టాలతో సంబంధం లేకుండా వారిని మేథ్స్, సైన్స్ గ్రూపుల్లో చేర్పిస్తున్నారు. అభిరుచి ఉన్న రంగాల్లో వారిని ప్రోత్సహించే దృక్పథం ఇటు తల్లిదండ్రు ల్లోనూ, అటు పాఠశాలల్లోనూ ఉండటం లేదు.



డేంజర్‌జోన్‌లో పిల్లలు

చదువు సంధ్యలతో, ఆటపాటలతో గడపాల్సిన బాల్యాన్ని కొందరు పిల్లలు మత్తు పదార్థాలకు బలి చేస్తున్నారు. బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాల్సిన వయసులో సిగరెట్లు, గంజాయితో దారి తప్పుతున్నారు. మత్తు పదార్థాలు కొనుక్కొనేందుకు వారి ఇళ్లలోనే చోరీలు చేస్తున్నారు. ఇంట్లో డబ్బులు దొరక్కపోతే సామాన్లు తాకట్టు పెట్టడం, అప్పులు చేయడంతో పాటు సెల్‌ఫోన్, బైక్‌ల దొంగతనాలకూ తెగబడుతున్నారు. మత్తులో చేసే నేరాలు, మత్తు దిగిపోయే లోపు వారి జీవితాలను తలకిందులు చేస్తున్నాయి. గతంలో 15 ఏళ్ల పైబడి పిల్లలు మాత్రమే డ్రగ్స్ బారినపడిన వారిలో ఉన్నారు. గడిచిన కొన్నేళ్లుగా 12 ఏళ్ల పిల్లలు సైతం ఈ మత్తులో జోగుతుండటం ఆందోళన కల్గించే విషయం. 12 నుంచి 45 సంవత్సరాలవారిలో ఎక్కువమంది మత్తుబారిన పడి కుటుంబాలను చిన్నాభిన్నం చేసుకుంటున్నారు.

మానసిక వికాసం ముఖ్యమే

పిల్లల ఆసక్తి మేరకు వారికి ఇష్టమైన రంగాల్లో ప్రోత్సహించాలి. అంతర్గత సంతృప్తిని చవిచూసిన పిల్లల దృష్టి వ్యసనాలవైపు, తాత్కాలిక ఆనందాలవైపు మళ్లే అవకాశం చాలా తక్కువ. మన బడులు, కళాశాలల్లోనేమో ఎంతసేపు పుస్తకాలు, పరీక్షలు, ర్యాంకులు తప్పితే పిల్లల మానసిక వికాసానికి తోడ్పడే ఆటలు, సంగీతం, అభినయం, నృత్యం వంటి అభిరుచుల ఊసే ఉండటం లేదు. ఎక్స్‌ట్రా-కరిక్యులర్ తరగతులను మొక్కుబడిగానే నిర్వహిస్తున్నారు. బడి విడిచిపెట్టిన తరవాత చాలామంది పిల్లలకు ఆటవిడుపు ఉండటమే లేదు. ఆ వెంటనే వారు ట్యూషన్లు, కోచింగ్ సెంటర్లకు వెళ్తున్నారు. ఇలాంటి వాతావరణంలో అంతగా చదువరులు కాని విద్యార్థులు తీవ్రస్థాయిలో విసుగు చెందడం, ఒత్తిడికి గురికావడం సహజం. మార్కులు, ర్యాంకులు, ప్రవేశ పరీక్షలు, తమపై తల్లిదండ్రులు పెట్టుకున్న ఆశల గురించిన ఆలోచనలతో పిల్లలు సతమతమవుతున్నారు.

త్వరగా గుర్తిస్తేనే ఫలితాలు

మాదక ద్రవ్యాలను నిరోధించే చర్యలతో పాటు పిల్లల మానసిక ఆరోగ్యానికి బలమైన పునాదులు వేస్తేనే డ్రగ్స్ సమస్యకు అసలైన పరిష్కారం లభిస్తుంది. ఈ వ్యసనాన్ని వదులుకోవడానికి చికిత్స అందించే పునరావాస కేంద్రాలు (డీ-అడిక్షన్ సెంటర్లు) పనిచేస్తున్నాయి. సమస్య తీవ్రమైనప్పుడు కాకుండా తెలిసిన వెంటనే ఇక్కడికి తీసుకొస్తే ఎంతోకొంతమేర కౌన్సిలింగ్, చికిత్సలు ద్వారా కొత్తమేరకైనా తగ్గించేందుకు అవకాశం ఉంటుంది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా ప్రభుత్వాసుపత్రుల్లో డీ-అడిక్షన్ కేంద్రాలున్నాయి. తమ వద్దకు వచ్చే వారి పరిస్థితిని బట్టి చికిత్స, కౌన్సెలింగ్ అందిస్తూ మార్పు తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నాం. పలు స్వచ్ఛంద సంస్థలు, ఎన్‌జిఒలు కూడా పునరావాస కేంద్రాలు నిర్వహిస్తున్నాయి. వ్యక్తిగత, గ్రూప్ కౌన్సిలింగ్‌లు, కుటుంబ సలహాదారుల సేవల ద్వారా ఫ్యామిలీ కౌన్సిలింగ్ దుర్వ్యసనాలపై ఆసక్తి తగ్గించటం, సైకోథెరపీ (మానసికంగా ఉత్తేజితుల్ని చేయటం) ఉపన్యాసాలు (ఆల్కాహాల్ ఎనానిమిస్ మీటింగ్), ఆక్యుపేషనల్ థెరపీ వంటి కార్యక్రమాలతో పరివర్తన తీసుకురావటానికి కృషి చేస్తుంటాం.

- డాక్టర్ టి.వి.పవన్ కుమార్
ప్రొఫెసర్, సైక్రియాట్రీ విభాగం హెచ్ఒడి, ఎన్ఆర్ఐ మెడికల్ కాలేజ్ అండ్ జనరల్ హాస్పిటల్



డిసెంబరు విడుదలలు.. వాయిదాలు..!

ఏడాది చివరికి వచ్చేశాం. తెలుగు సినీ అభిమానులకు ఈ సంవత్సరం మంచి ఉత్సాహనిచ్చిందనే చెప్పొచ్చు. ఎప్పటినుండో ఎదురుచూస్తున్న పెద్ద హీరోల సినిమాలు వరుసగా విడుదలై హుషారునిచ్చాయి. పవన్ కళ్యాణ్ నటించిన 'ఓజీ', వెంకటేష్ నటించిన 'సంక్రాంతికి వస్తున్నాం', రామ్‌చరణ్ నటించిన 'గేమ్ ఛేంజర్' బాలకృష్ణ నటించిన 'డాకు మహారాజ్', నాగచైతన్య 'తండేల్', నాని 'హిట్ : ద థర్డ్ కేస్', 'కుబేర', 'కన్నప్ప', 'హరి హర వీరమల్లు', 'కింగ్‌డమ్', 'ఘాటీ', 'కిష్కింధపురి', 'మాస్ జాతర', 'గర్ల్ ఫ్రెండ్' వంటి చాలా సినిమాలు అభిమానులని ఖుషీ చేశాయి. వీటి మధ్య విడుదలైన చిన్న చిత్రాలు 'కోర్టు', 'సింగిల్', 'లిటిల్ హార్ట్స్', 'రాజు వెడ్స్ రాంబాయి' వంటివి కూడా మంచి కథనంతో నడిచి ప్రేక్షకుల ఆదరాభిమానులు చూశాయి.

ఈ డిసెంబరు నెల బాలకృష్ణ నటించిన 'అఖండ 2' చిత్రంతో ప్రారంభం కావాలి. కానీ అనుకోని అవాంతరాలు తలెత్తి గంటల వ్యవధిలో ఆ సినిమా వాయిదా పడింది. ఆర్థిక కారణాలతో నిర్మాతలు, ఫైనాన్స్ సంస్థలు కోర్టు గుమ్మం వరకు వెళ్లడంతో సినిమా విడుదలపై హైకోర్టు స్టే విధించిందని వార్తలు వస్తున్నాయి. విడుదల తేదీపై ఇంకా సందిగ్ధత వీడలేదు. ఈ నేపథ్యంలో ఈ నెలలో విడుదలకి సిద్ధంగా ఉన్న ఇతర చిత్రాలను ఒకసారి చూద్దాం. రోషన్ కనకాల నటించిన 'మౌగ్లీ' చిత్రం డిసెంబరు 12న విడుదలకానుంది. కార్తీ నటించిన 'వాతియర్' మూవీ తెలుగు వర్షెన్ 'అన్నగారు వస్తారు' కూడా ఆ తేదీనే విడుదలవుతోంది. శ్రీకాంత్ కొడుకు రోషన్ నటిస్తున్న 'ఛాంపియన్' కూడా ఈ నెలలోనే 25న విడుదలకి సిద్ధంగా ఉంది. అలాగే ఆది సాయికుమార్ చిత్రం 'శంబాల', శివాజీ ప్రధాన పాత్రలో తెరకెక్కిన 'దండోర' కూడా ఈ నెల 25న ప్రేక్షకుల ముందుకు రానున్నాయి.

ఫారెస్ట్ బ్యాక్‌డ్రాప్‌తో..

పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌లో టీజీ విశ్వ ప్రసాద్ నిర్మించిన 'మౌగ్లీ' చిత్రాన్ని సందీప్ రాజ్ తెరకెక్కించారు. సాక్షి సాగర్ మదోల్కర్ హీరోయిన్‌గా, వైవా హర్ష ముఖ్య పాత్రలో కనిపించనున్నారు. కాలభైరవ సంగీతం అందిస్తున్న ఈ చిత్రం ఫారెస్ట్ బ్యాక్ డ్రాప్‌లో సాగే ప్రేమకథగా రూపొందింది.



స్పోర్ట్స్ డ్రామాగా..

శ్రీకాంత్ కొడుకు రోషన్ నటించిన 'ఛాంపియన్' చిత్రం ఫుట్‌బాల్ నేపథ్యంలో సాగుతుంది. ఆనంది ఆర్ట్ క్రియేషన్స్, జీ స్టూడియోస్, స్వప్న సినిమాస్ బ్యానర్లపై నిర్మితమవుతోంది. ప్రదీప్ అద్వైత్ దర్శకత్వంలో అనస్వర రాజన్ హీరోయిన్‌గా తెరకెక్కింది.




సందేశాత్మకంగా..

శివాజీ ప్రధాన పాత్రలో నటిస్తున్న 'దండోర' చిత్రం తెలంగాణ గ్రామీణ నేపథ్యంలో సాగే సందేశాత్మక చిత్రంగా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. బిందుమాధవి, నవదీప్, రవికృష్ణ, నందు ఈ చిత్రంలో కీలక పాత్రలు పోషించారు. మురళీకాంత్ దర్శకత్వంలో లౌక్య ఎంటర్‌టైన్‌మెంట్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది.



'అన్నగారు..' వస్తారా!?


వీటిన్నింటి మధ్య విడుదలకి సిద్ధమైన తమిళ చిత్రం 'వా వాతియర్' తెలుగు రీమేక్ 'అన్నగారు వస్తారు' కూడా వివాదాల్లో ఉంది. నిర్మాత జ్ఞానవేల్ రాజాతో, ఫైనాన్షియర్‌కి తలెత్తిన ఆర్థిక వివాదాలు కోర్టు గుమ్మం వరకు చేరాయి. నలన్ కుమార్ స్వామి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాని జ్ఞానవేల్ నిర్మించారు. కృతిశెట్టి హీరోయిన్‌గా చేశారు.





ఆది 'శంబాలా'..

ఆది సాయికుమార్ నటించిన 'శంబాల' చిత్రం రాజశేఖర్ అన్నభిమోజు, మహీధర్ రెడ్డి కలిసి షైనింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై నిర్మించారు. యుగంధర్ ముని దర్శకత్వం వహించారు. అర్చన అయ్యర్ కథానాయికగా, శ్వాసిక కీలక పాత్రలో కనిపించనున్నారు. రవివర్మ, మీసాల లక్ష్మణ్, మధునందన్ ఇతర పాత్రలు చేస్తున్నారు.



బరిలో చిన్న చిత్రాలు..

ఈ నెలలోనే నందు నటించిన 'సైక్ సిద్ధార్థ', ప్రణీత్ ప్రత్తిపాటి దర్శకత్వంలో 'పతంగ్', 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' వంటి చిన్న బడ్జెట్ చిత్రాలు కూడా విడుదలకి సిద్ధంగా ఉన్నాయి.

సిమ్రన్‌జిత్ పసిడి గురి

- **ఐశ్వరీ ప్రతాప్‌కు రజతం**

దోహా : ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్‌కప్ ఫైనల్స్‌లో భారత యువ షూటర్ సిమ్రన్‌జిత్ కౌర్ పసిడి పతకం సాధించింది. ఆదివారం జరిగిన మహిళల 25 మీటర్ల పిస్టల్ ఈవెంట్‌లో సిమ్రన్‌జిత్ కౌర్ బంగారు పతకం గెల్చుకుంది. పతక పోరులో 41 పాయింట్లు సాధించిన సిమ్రన్‌జిత్.. అర్హత రౌండ్‌లో అంచనాలు లేకుండా బరిలోకి దిగి 585 స్కోరుతో పతక పోరుకు చేరుకుంది. ఫైనల్లో సిమ్రన్‌జిత్‌కు ఆశించిన ఆరంభం దక్కలేదు. వేగంగా పుంజుకున్న సిమ్రన్‌జిత్ మూడుసార్లు పర్‌ఫెక్ట్ గురితో రేసులోకి వచ్చింది. యావో (36 పాయింట్లు) సిల్వర్, డోరిన్ (30 పాయింట్లు) బ్రాంజ్ మెడల్స్ దక్కించుకున్నారు. ఫైనల్లో హైదరాబాదీ స్టార్ షూటర్ ఇషా సింగ్ ఏడో స్థానానికి పరిమితమైంది.

ఒలింపిక్ మెడలిస్ట్ మను భాకర్ అర్హత్ రౌండ్‌లోనే నిష్క్రమించింది. పురుషుల 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్స్ విభాగంలో ఐశ్వరీ ప్రతాప్ సింగ్ సిల్వర్ మెడల్ సాధించాడు. ఫైనల్లో 413.3 స్కోరు చేసిన ప్రతాప్ సింగ్..0.9 పాయింట్ల తేడాతో స్వర్ణం చేజార్చుకున్నాడు.





పింక్ టెస్టు ఆసీస్‌దే

బ్రిస్బేన్ : డేనైట్ పింక్ బాల్ టెస్టులో ఆతిథ్య ఆస్ట్రేలియా అదిరే విజయం సాధించింది. 65 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని ఆస్ట్రేలియా 10 ఓవర్లలో ఊదేసింది. ట్రావిశ్ హెడ్ (22), స్టీవ్ స్మిత్ (23 నాటౌట్), జేక్ వెథర్‌లాండ్ (17) మెరవటంతో 60 బంతుల్లోనే 69/2తో లాంఛనం ముగించింది. అంతకుముందు, మైకల్ నెసర్ (5/42) ఐదు వికెట్ల ప్రదర్శనతో ఇంగ్లాండ్ రెండో ఇన్నింగ్స్‌లో 241 పరుగులకే కుప్పకూలింది. జాక్ క్రాలీ (44), బెన్ స్టోక్స్ (50), విల్ జాక్స్ (41)లు మెరిసినా.. ఇతర బ్యాటర్లు నిరాశపరిచారు. ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 334 పరుగులు చేయగా.. ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 511 పరుగుల భారీ స్కోరు చేసిన సంగతి తెలిసిందే. తొలి ఇన్నింగ్స్‌లో ఆరు వికెట్లు సహా రెండో ఇన్నింగ్స్‌లో రెండు వికెట్లు పడగొట్టిన ఆసీస్ పేసర్ మిచెల్ స్టార్క్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. ఐదు టెస్టుల యాషెస్ సిరీస్‌లో ఆస్ట్రేలియా 2-0తో ఆధిక్యంలో నిలిచింది. ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ మూడో టెస్టు ఈ నెల 17 నుంచి ఆడిలైడ్‌లో జరుగనుంది.

అవును.. పెండ్లి రద్దు

- **క్రికెటర్ స్మృతీ మంధాన ప్రకటన**

ముంబయి : భారత మహిళల క్రికెట్ స్టార్ స్మృతీ మంధాన తన వివాహంపై ఎట్టకేలకు స్పందించింది. సంగీతకారుడు పలాశ్ ముచ్చల్‌తో నవంబర్ 23న స్మృతీ మంధాన వివాహం జరగాల్సి ఉండగా.. మంధాన తండ్రి గుండెపోటుతో ఆసుపత్రి పాలైన కారణంగా పెండ్లిని వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. ఆ తర్వాత మంధాన, పలాశ్ పెండ్లి వాయిదాపై పలు కథనాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ నేపథ్యంలో స్మృతీ మంధాన ఆదివారం సోషల్ మీడియా వేదికగా స్పందించింది. తన వివాహం రద్దు అయిందని వెల్లడించింది. 'కొన్ని రోజులుగా నా వ్యక్తిగత జీవితంపై ఎన్నో వదంతులు వస్తున్నాయి. నా వ్యక్తిగత జీవితం ఎంతో గోప్యం. ఇప్పుడూ అది అలాగే ఉండాలని కోరుకుంటున్నాను. నా పెండ్లి రద్దు అయిన మాట వాస్తవమే. ఈ సమయంలో మా కుటుంబాల గోప్యతకు గౌరవం ఇవ్వాలి కోరుతున్నాను' అని మంధాన తెలిపింది.



Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68